




తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




epaper.vaartha.com WWW.VAARTHA.COM


విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-11-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 292 పేజీలు: 10+4 వెల: 8.00





# భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాలు

23 నవంబర్, 2025

విశ్వశాంతి, సౌభాగ్యం, సకల జనుల సంతోషం కోసం పరితపించిన

## భగవాన్ శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతి సందర్భంగా నవంబర్ 23, 2025న రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకలు



ప్రధాన వేదిక
ప్రశాంతి నిలయం, పుట్టపర్తి,
శ్రీ సత్యసాయి జిల్లా

భగవాన్ సత్య సాయిబాబా
శత జయంతి సందర్భంగా
భక్తులందరికీ శుభాకాంక్షలు

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సత్య సాయి సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకుందాం... సేవా కార్యక్రమాలకు ప్రేరణ పొందుదాం





శనివారం పుట్టపర్తిలోని సత్యసాయిబాబా మహాసమాధి వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

# సత్యసాయి సిద్ధాంత సూత్రాలే నిజమైన విద్య

## పరిశోధనారంగాన్ని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు

### ఉపరాష్ట్రపతి సిపి. రాధాకృష్ణన్

**శ్రీసత్యసాయి జిల్లా, నవంబరు 22, ప్రభాతవార్త ప్రతినిధి:** భగవాన్ సత్యసాయి బాబా సిద్ధాంతాలు సూత్రాలే నిజమైన విద్య అని భారత ఉపరాష్ట్రపతి సిపి.రాధాకృష్ణన్ వ్యాఖ్యానించారు. సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని ఉప రాష్ట్రపతి దర్శించుకున్నారు. అనంతరం శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో పట్టభద్రులైన వారికి ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ చేతుల మీదుగా బంగారు పతకాలు, పట్టాలు అందించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సీపీ రాధా కృష్ణన్ మాట్లాడుతూ శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ సంస్థను అద్భుతంగా తీర్చిదిద్దారని కితాబు ఇచ్చారు. 2047 నాటికి భారత దేశం నెంబర్1 స్థానంలో ఉంటుందని,



విద్యార్థులకు బంగారు పతకాలు అందిస్తున్న ఉప రాష్ట్రపతి సి.పి.రాధకృష్ణన్

పట్టభద్రులుగా పట్టాలు పుచ్చుకున్న విద్యార్థులు ఆ అభివృద్ధిలో భాగస్వాములు కాబోతున్నారన్నారు. పరిశోధనా రంగాన్ని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు కలుగుతాయన్నారు. గత మూడు రోజుల్లో దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న వారు జయంత్యుత్సవాల్లో పాల్గొన్నారని, దీనిని బట్టి బాబా ఎంతటి శక్తిమంతులనేది అర్థమవుతుందన్నారు. రాజకీయాల్లోకి రావాలని మంత్రి లోకేష్ చెప్పినప్పుడు విద్యార్థుల నుంచి మంచి స్పందన కన్పించిందని, దీని బట్టి విద్యార్థులు భవిష్యత్ లీడర్లుగా మారతారని ఆశిస్తున్నానన్నారు. కలలో కూడా ఊహించనంతటి గొప్ప సమాజాన్ని రూపొందించగలరనే నమ్మకం ఇక్కడున్న విద్యార్థులను చూస్తే కలుగుతోందన్నారు. ఏ యూనివర్శిటీలోనూ కన్పించినంతటి క్రమ శిక్షణ, నిబద్ధత శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ సంస్థలో కన్పిస్తుందన్నారు. కాన్వొకేషన్ లో క్రమశిక్షణ పాటిస్తూ విద్యార్థులు నేల మీద కూర్చొవడం ఎక్కడా చూడలేదనీ, పట్టా పుచ్చుకున్న విద్యార్థులకు, యంగ్ మైండ్స్ తయారు చేసిన ఈ సంస్థకు అభినందనలు తెలిపారు. ఉచితంగా ఇంత పెద్ద ఎత్తున విద్యను అందివ్వడం గొప్ప విషయమన్నారు. ఎంత మందిని గ్రాడ్యుయేట్లుగా తీర్చిదిద్దామనేది ముఖ్యం కాదు, ఎంత మంది మంచి పౌరులుగా తీర్చిద్దామనే కోణంలో ఈ సంస్థను నడపడం సంతోషాన్నిస్తోందన్నారు. పపంచం చెప్పేది భారత దేశం వింటుందనేది పాత మాట, భారత దేశం చెప్పేది ప్రపంచం వింటోందనేది కొత్త మాట అన్నారు. దేశాన్ని ఈ స్థాయికి తీసుకెళ్లడంలో ప్రధాని నరేంద్ర మోదీ పాత్ర కీలకమైనది. ఇన్నోవేషన్లకు కేంద్రంగా సుస్థిరాభివృద్ధికి ప్రతిరూపంగా భారత దేశాన్ని ప్రధాని తీర్చిదిద్దారన్నారు. నరేంద్ర మోడి ఓ దేశానికి వెళ్లినప్పుడు ఆ దేశ ప్రెసిడెంట్ మన దేశ ప్రధాని నరేంద్ర మోడి కాళ్లకు నమస్కారం పెట్టారని, 100కు పైగా దేశాలకు కోవిడ్ టీకాలను మన దేశం ఉచితంగా పంపిణీ చేయడమే కారణమని ఆ దేశ ప్రెసిడెంట్ చెప్పారన్నారు. ప్రపంచ ఆర్థిక శక్తిగా నాలుగో స్థానంలో భారత దేశం నిలిచిందని, ఆధునిక విధానాలను పాటించాలని, సంప్రదాయాలను పాటించాలని, మన కోసం మనం బతకడంతో పాటు, ఇతరుల గురించి బతకడమనేది ఉత్తమ విధానం అన్నారు. డ్రగ్స్ ఇప్పుడు అతి పెద్ద సవాలుగా మారిందని, నో టూ డ్రగ్స్ అంటు పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

# శాంతి స్వరూపం సత్యసాయి

>>మంది సత్యసాయి భక్తులు దేశ, విదేశాల్లో ఉన్న పేద వారికి సేవలందిస్తోన్నారు. 1969 నుంచే మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. నేషన్ ఫస్ట్ అనే విధానంలో సత్యసాయి బాబా సేవలందించారు. దీన్ని అందరూ పాటించాలి. బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన స్ఫూర్తితో పని చేస్తామని సంకల్పం తీసుకోవాల్లి అని ద్రౌపది ముర్ము వ్యాఖ్యానించారు.

**సత్యసాయి సూత్రాలు పాటిస్తే ప్రపంచం శాంతిగా ఉంటుంది : సీఎం చంద్రబాబు:** లవ్ ఆల్..సర్వ్ ఆల్, ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలి.. ఎవ్వరిని నొప్పించకూడదు అనేది శ్రీ సత్యసాయిబాబా సిద్ధాంతమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనేవి సత్యసాయి బాబా ప్రవచించిన ఐదు సూత్రాలని పేర్కొన్నారు. సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు.. సూత్రాలను పాటిస్తే ప్రపంచమంతా శాంతిగా ఉంటుందన్నారు. ˇఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రజలకు తాగు నీటి సౌకర్యాన్ని కల్పించారు. సత్యసాయి బాబాతో నాకు మంచి అనుబంధం ఉంది. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారు. కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు... పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి తాగు నీటి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చారు. ఇప్పటికే అదే స్ఫూర్తిని సత్యసాయి భక్తులు కొనసాగించడం నాకు సంతోషాన్నిస్తోంది. వివిధ ప్రాణాంతక రోగాల బారిన పడిన వారికి బాబా ట్రస్టు ఆదుకుంటోంది. మానవ సేవే... మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని సత్యసాయి బాబా ట్రస్ట్ అమలు చేసి చూపిస్తోంది. శాంతికి బ్రాండ్ అంబాసిడర్లుగా సత్యసాయి బాబా భక్తులు నిలుస్తారు. 7.50 లక్షల వాలంటీర్లు సత్యసాయి బాబా ట్రస్ట్ ద్వారా సేవలం దిస్తున్నారు. ఏ వ్యవస్థకు ఇంతటి శక్తి లేదు. నేడు సత్యసాయి ట్రైబల్ ఉమెన్ హెల్త్ కేర్ ప్రోగ్రాం ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది. ఏవైనా ప్రకృతి వైపరీత్యాలు వస్తే సత్యసాయి బాబా స్ఫూర్తితో సేవలందిస్తారు. ధనవంతులు... ఉన్నతాధికారుల కుటుంబాలకు చెందిన పిల్లలను సైతం ప్రశాంతి నిలయానికి పంపి సేవా కార్యక్రమాలు చేయిస్తారు. 140 దేశాల్లో 2 వేలకు పైగా బ్రాంచ్‌లు సత్యసాయిబాబా ట్రస్టుకు ఉన్నాయి. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపితం చేసేలా కృషి చేయాలి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తుంద్ది అని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్, మంత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి, మొక్కజొన్న, అరటి రైతులను ఆదుకోండి

>> రాయలసీమలో 40 వేల హెక్టార్లలో అరటి ఉత్పత్తి అవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. డిసెంబరు మొదటి వారం నుంచి అరటి ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే అప్పటి వరకూ అరటి రైతులు నష్టపోకుండా తక్షణం చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాయలసీమలో పండిన అరటిని రవాణా చేసేందుకు ఓ ఏజెన్సీ ముందుకు వచ్చిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎప్పటికప్పుడు అరటిని రవాణా చేసేందుకు ఓ ప్రణాళికను రూపొందించుకోవాలని ముఖ్య మంత్రి ఆదేశించారు. ఇక పత్తి కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. మొక్క జొన్న రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలిచ్చారు. మొక్క జొన్న మద్ధతు ధర కంటే తక్కువ రేటు పలుతున్నందున వ్యత్యాసాన్ని ధరల స్థిరీకరణ నిధి ద్వారా చెల్లించే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఈసారి 1.42 లక్షల హెక్టార్లలో మొక్కజొన్న సాగైందని 8.18 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. 2.04లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సీఎం సూచించారు. ఏజెన్సీల ద్వారా కొనుగోలు చేయించేందుకు ప్రయోగాత్మ కంగా కొనుగోళ్లు చేపట్టాలని పేర్కొన్నారు. అది సత్ఫలితాలు ఇస్తే మొక్క జొన్న కొనుగోళ్లకు సమస్య ఎదురైనప్పుడు దానిని ఆచరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు.

**పత్తి కొనుగోళ్లపై కేంద్రానికి లేఖ:** పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రతీ రోజూ తనిఖీ చేయాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు రైతులతో మాట్లాడి సమస్యల్ని పరిష్కరించాలని సూచించారు. రంగుమారిన, తడిచిన పత్తిని కూడా కొనుగోలు చేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలో రాగల రెండు మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పత్తి కొనుగోళ్ల వేగవంతం చేయాల్సిందిగా సీఎం అధికారులకు సూచించారు. సీఎం చంద్రబాబు సూచనల మేరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్లాట్ బుకింగ్ సమస్యను పరిష్కరించిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సమీపంలోని జిన్నింగ్ మిల్లులకే పత్తిని రవాణా చేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తేమ శాతం లాంటి సీసీఐ నిబంధనల కారణంగా పత్తి రైతులు నష్టపోకుండా చూడాలని సీఎం వారికి సూచించారు.

## శివమొగ్గ జైలు ఖైదీలకోసం

# అరటి గెలల్లో డ్రగ్స్, సిగరెట్ల సరఫరా

**శివమొగ్గ, నవంబరు 22:** కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ కేంద్ర కారాగారంలో అరటిగెలల సాయంతో జైలులో ఖైదీలకు మత్తు ఉత్పత్తులు, సిగరెట్లు అందచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే అనేక మార్లు వార్తలోకెక్కిన ఈ జైల్లో కొందరు ఖైదీలు కావాలనుకుంటే లిక్కర్, సిగరెట్లు, డ్రగ్స్ వంటి నిషేధిత వస్తువులు సులభంగా అందుబాటులోకి వస్తున్నాయని తెలుస్తోంది. శివమొగ్గ జైలులో ఖైదీల విలాసాలకు సంబంధించిన ఆనవాళ్లు ఇటీవల బయటపడిన నేపథ్యంలో భద్రతా సిబ్బంది అప్రమత్తమైంది. నిత్యం తనిఖీలు చేస్తూ.. ఖైదీలపై ఓ కన్నేసి ఉంచింది. ఈ క్రమంలోనే శనివారం రోజు ఉదయం ఒక ఆటో డ్రైవర్ వచ్చి జైలు క్యాంటీన్ కోసమని గేటు బయట ఐదు అరటి గెలలు దించి వెళ్లగా.. భద్రతా సిబ్బందికి అనుమానం వచ్చింది. దీంతో ఆ అరటి గెలలను క్షుణ్ణంగా పరిశీలించి చూడగా కాడలు తెరచి, తిరిగి అతికించినట్లుగా కనిపించింది. దీంతో సిబ్బంది వాటిని తెరిచారు. అందులో ఉన్న వాటిని చూసి షాకయ్యారు. ఎందుకంటే అరటి గెలెల్లో జాగ్రత్తగా గమ్ టేప్‌తో చుట్టిన సిగరెట్ల ప్యాకెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలు బయటపడ్డాయి. ఈ వినూత్న స్మగ్లింగ్ పద్ధతి చూసి భద్రతా సిబ్బంది కూడా నివ్వెరపోయారు.

## వారం - వర్జ్యం

23-11-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
తదియ రా.7.23
మూల రా.7.26.అనూరాధ కార్తె
వర్జ్యం : ఉ.6.00-7.46
దు.ము.3.59-సా.4.44
ఉ.9.00-9.45
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితుల నుండి సహాయ సహకారాలను అందుకుంటారు. నూతన విద్యా, ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**వృషభం:** మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. వివాహాది శుభకార్యా యత్నాలు ఫలిస్తాయి.

**మిథునం:** మాటల చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుని పనులు చక్కదిద్దుకుంటారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**కర్కాటకం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధికమిస్తారు. ఆరోగ్య సమస్యల నుండి బయటపడతారు.

**సింహం:** పారిశ్రామిక రాజకీయ రంగాల వారికి కొంత అనుకూలంగా ఉంటుంది. ఋణాలు తీరుస్తారు. వస్త్రలాభం ఉంది.

**కన్య :** స్తంభించిన కార్యక్రమాలను తిరిగి ప్రారంభించడానికి మీరు చేసే యత్నాలు ఫలిస్తాయి. వివాహ ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**తుల :** ఆర్థిక విషయాలలో తన పర భేదం ఉండదన్న విషయాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటారు.పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**వృశ్చికం:** సహోదరీ వర్గానికి సహాయ సహకారాలను అందిస్తారు. అయితే మాట తీరు వలన స్వల్పమైన సమస్యలు ఎదుర్కొంటారు.

**ధనుస్సు:** దీర్ఘాలోచనలు కొనసాగుతాయి. సంతాన విషయాలపైన ప్రధానంగా దృష్టిని కేంద్రీకరిస్తారు. వాహన సౌలభ్యం కలదు.

**మకరం:** కుటుంబ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటారు. ధనాన్ని కన్నా ఆత్మ గౌరవానికి ప్రాముఖ్యత నిస్తారు.

**కుంభం:** మీ ముందు ఒక మాట, మీ వెనుక ఒక మాట చెబుతూ వస్తున్న వారి పట్ల అప్రమత్తంగా మెలగవలసి వస్తుంది.

**మీనం:** ఋణ యత్నాలు ఫలిస్తాయి. తాత్కాలికంగా చేసే నూతన వ్యాపారాలను ప్రారంభిస్తారు. సోదరుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# డిసెంబరు చివరికి గుంతలులేని రోడ్లు

## పనులు చేపట్టని కాంట్రాక్టర్లపై చర్యలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 22,ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వంలో రహదారులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో రాబోయే డిసెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో రహదారులన్నింటిని గుంతల రహితంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. శనివారం ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టీ కృష్ణబాబు, ఆర్ బీ శాఖ ఉన్నతాధికారులతో రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పనుల స్థితిగతులపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్య మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి మరమ్మత్తుల పనుల తీరుపై ప్రత్యక్షంగా తనిఖీ చేయాలని ఆర్ అండ్ బి శాఖ మంత్రి, ప్రత్యేక ముఖ్య కార్య దర్శిలను సీఎం ఆదేశించారు.. అదే సమయంలో ఇప్పటికీ పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. అదే సమయంలో రహదారులు మరమ్మతు పనుల నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడవద్దని, అత్యుత్తమంగా ఉండేలా చూడాలన్నారు. రహదారుల అభివృద్ధిలో అత్యున్నత సాంకేతిక విధానాలను, వినూత్న మెటీరియల్ ను ఉపయోగించే విధానాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. గత ఏడాది గుంతల రహిత రహదారులే లక్ష్యంగా మిషన్ పాత్ హోల్ ఫ్రీ లో భాగంగా రూ. 861 నిధులతో రాష్ట్రంలో రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దడం జరిగింది. అయితే గత ప్రభుత్వంలో 5 ఏళ్లలో కనీసం రెన్యువల్ కూడా చేపట్టకపోవడం, రహదారులు పూర్తిగా నిరక్ష్యం వహించడం వంటి కారణాల వల్ల రహదారులు మరింత అధ్వాన్నంగా మారాయి. అయినప్పటికీ ఈ ఏడాది రహదారుల నిర్వహణ మరియు ఇంప్రూవ్మెంట్ కోసం రూ. 2500 కోట్లతో పనులు చేపట్టేందుకు ఇప్పటికే పరిపాలన అనుమతులు ఇవ్వడం జరిగింది ఇందులో భాగంగా రూ. 400 కోట్లు నాబార్డ్ నిధులతో 1250 కి.మీ జిల్లా ప్రధాన రహదారుల అభివృద్ధి కోసం 191 పనులు మంజూరు చేయడం జరిగింది. ఈ పనులన్నీ ఇప్పటికే టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించడం జరిగింది. ఇవి కాకుండా రూ. 600 కోట్లు మూలధన వ్యయం కింద 227 పనులు మంజూరు చేయడం జరిగింది. వీటితో పాటు 1450 కిలోమీటర్ల మేర రహదారులు అభివృద్ధి చేయడానికి గుత్తేదారులను గుర్తించి పనులు అప్పగించడం జరిగింది. ఇవి కాక మరో 2,104 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి కోసం 274 పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగింది. ఇందుకోసం రూ. 1000 కోట్లతో ఆయా పనులకు టెండర్లు పిలవడం జరిగింది. డిసెంబర్ నెల మొదటి వారంలో ఈ పనులన్నింటినీ గుత్తేదారులు గుర్తించి పనులు మొదలు పెట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగింది. ఇవి కాకుండా వివిధ కారణాలతో గుత్తేదారులకు అప్పగించి రద్దయిన రూ. 277కోట్లతో 607 కి.మీ రహదారుల నిర్వహణ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగింది. రాబోయే 2 - 3 రోజుల్లో ఈ పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంతో పాటు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడం జరుగుతుంది. ఇవి కాకుండా మరో రూ. 233 కోట్ల రూపాయలతో రహదారులు అభివృద్ధి చేయడం జరుగుతుంది. ఇందుకు ఇప్పటికే ఆర్థిక శాఖ నుంచి అనుమతులు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కేవలం ఒక్క ఏడాది వ్యవధిలో రూ. 2500 కోట్లతో 5471 కిలోమీటర్ల రహదారులు అభివృద్ధికి పరిపాలన అనుమతులు ఇచ్చిన ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కుతోంది.ఇవి కాకుండా 9101 కిలోమీటర్లు అత్యవసర మరమ్మత్తుల కోసం రూ. 500 కోట్లతో ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు సమర్పించడం జరుగుతుంది.. మొంథా తుఫాను వల్ల దెబ్బతిన్న దాదాపు 4794 కిలోమీటర్లు రహదారులను మరమ్మత్తు చేయడం కోసం ఈ నిధులను ఉపయోగించడం జరుగుతుంది. గుత్తేదారుల్లో ప్రభుత్వం పట్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ఆర్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి,ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశాలు ఇప్పటికే పలుమార్లు నిర్వహించడం జరిగింది. ఆర్ బీ శాఖ ఉన్నతాధికారులతో ఇటీవల పుట్టపర్తి, విశాఖపట్నంలోనూ, ఎప్పటికప్పుడూ విజయవాడలోనూ మంత్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సమావేశాలు నిర్వహించడం పనుల పురోగతిని సమీక్షించడం జరుగుతుంది. ఇప్పటికే ప్రారంభించిన పనులన్నీ డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు.

# ఏపి బ్రాండ్‌ను నిలబెడతాం

## 2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి: సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 22,పభాతవార్త ప్రతినిధి:** కొత్త లేబర్ కోడ్ ్స భారత అభివృద్ధి దిశలో మైలురాయి అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత అత్యంత కీలక మార్పులుగా ఇవి నిలుస్తాయని చెప్పారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. వీటితో ఉదో ్యగుల భద్రత మరింత బలోపేతమవుతుందని,వేతనాల హామీ ఉంటుందని పేర్కొన్నారు. కార్మికుల గౌరవం,హక్కులు ప్రాముఖ్యత లభిస్తుందని వివరించారు. గిగ్ వర్కర్లకు ప్రత్యేక రక్షణతో పాటు మహిళలకు మరింత సమానత్వం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. భారత కార్మిక విధానాలను అంతర్జాతీయ ప్రమాణాలకు సమీపం లోకి తీసుకువచ్చే కీలక అడుగు అని వివరించారు. ఈ చరిత్రాత్మక సంస్కరణలను ఆమోదించిన ప్రధాని నరేంద్ర మోడీకి అభినందలు తెలిపారు.అమరావతి నిర్మాణం కూడా వేగంగా చేపడుతున్నాంప్రతీ ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్త ఉండాలిఏపీ ఇక ఏఐగా మారాలి. విశాఖలో ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ వల్ల ఇతర దేశాలకు సేవలు అందుతాయి.2027 డిసెంబర్ కు పోలవరం ప్రాజెక్టుకు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.పీ4 అనుసంధానం ద్వారా పేదలకు చేయూత ఇచ్చి జీవన ప్రమాణాలను పెంచుతాం. 2047 నాటికి భారత్ ప్రపంచలో నెంబర్ వన్ గా మారుతుంది. అందులో స్వర్ణాంధ్ర కూడా అగ్రస్థానంలో ఉంటుంది. తద్వారా ప్రజల ఆర్థిక పరిస్థితి కూడా గణనీయంగా పెరుగుతుంది. ఏపీకి కావాల్సింది సుస్థిరమైన పాలనే అన్నారు.గడిచిన అయిదేళ్లలో మనం ఇటువంటి పండగలు జరుపుకునే పరిస్థితి రాష్ట్రంలో లేదు. సూపర్ జీఎస్టీ పండుగ చాలా చక్కగా వ్యాపారస్తులు జరుపుకుంటున్నారు. ఒకప్పుడు నాలుగు వస్తువులు కొంటే ఇప్పుడు అదనంగా మరో నాలుగు కొంటున్నారు. దసరా అంటే ఒకప్పుడు కలకత్తా గుర్తు వచ్చేది. కానీ ఇప్పుడు విజయవాడ గుర్తొచ్చే విధంగా ఫెస్టివల్ నిర్వహించారు. రాష్ట్రంలో ఇప్పుడు పాజిటివ్ వైబ్రేషన్ వస్తుంది. కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. వెంటిలేటర్ పై ఆర్థిక వ్యవస్థకు ప్రాణం పోసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదే. అమరావతి పనులు గాడిలో పడ్డాయి. ఎప్పుడు లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ఇస్తున్నాం. సూపర్ జీఎస్టీ ద్వారా సూపర్ సేవింగ్ జరిగాయి. ప్రతి ఒక్క కుటుంబానికీ మేలు జరిగే విధంగా జీఎస్టీ రిఫార్మ్స్ వచ్చాయి అని చెప్పారు.రాష్ట్రంలో మళ్ళీ వైకుంఠపాళి వద్దు. వెంటిలేటర్ పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కేంద్రం ప్రాణం పోసింది.16 నెలల్లో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిన పెట్టాం. సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఉద్యోగులకు కూడా ఆర్థిక ప్రయోజనాలు కల్పించామన్నారు.ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించటమే కూటమి ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలకు నమ్మకాన్ని కలిగించి తిరిగి రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు 9 స్టేట్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించామన్నారు. 113 ప్రాజెక్టులకు సంబంధించి రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని, వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. 6 వేలకు పైగా ఆలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామని తెలిపారు. అర్చకుల వేతనాల్ని రూ.15 వేలకు పెంచి, ఆలయాల్లో అన్యమతస్తులు లేకుండా చూస్తున్నామని వెల్లడించారు. ఉచిత ఇసుకు విధానం అమలు చేస్తూ భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టి, ఇప్పటివరకు 1.5 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక అందించామన్నారు. సైనిక శక్తిలోనూ మనమేంటో ఆపరేషన్ సింధూర్‌తో నిరూపించామన్నారు. శత్రుదేశాలు తూటాలు పేల్చితే మిస్సైళ్లతో బదులిచ్చిన మన త్రివిధ దళాలకు జై కొడదామని పిలుపునిచ్చారు. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం రూ.12,157 కోట్ల నిధులు విడుదల చేసి సకాలంలో పనులు జరిగేందుకు సహకరించిందన్నారు. 2028 నాటికి ˇజల జీవన్ మిషన్ కింద ప్రతి పల్లెకు, ప్రతి గడపకు సురక్షిత తాగునీరు అందిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 4,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 250 కిలోమీటర్ల బీటీ రోడ్లు నిర్మించామని తెలిపారు.

# డ్రగ్స్, ఉగ్రలింక్‌లు ఛేదించాలి

## జోహాన్స్‌బర్గ్ సదస్సులోన ప్రధాని మోడీ కీలక ప్రసంగం

**జోహాన్స్‌బర్గ్, నవంబరు 22:** దక్షిణాఫ్రికాలోజరుగుతున్న జీ20 దేశాల సదస్సులో భారత ప్రధాని నరేంద్రమోడీ నాలుగుప్రధాన కార్యాచరణలను ప్రతిపాదించారు. ఈ నాలుగు కీలక కార్యాచరణల్లో గ్లోబల్ ట్రెడిషనల్ నాలెడ్జి రిపాజిటరీ, ఆఫ్రికా స్కిల్స్ మల్టిప్లయర్ ఇనీషియేటివ్, గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటుచేయడంతోపాటు అంతర్జాతీయంగాను జీ20 దేశాలమధ్య డ్రగ్స్, ఉగ్రవాదుల లింకులను ఛేదించి ధ్వంసంచేయాలని పిలుపునిచ్చారు. ఆర్థికాభివృద్ధికి ఎంతో ఆటంకం అడ్డంకి గా మారిన ఈ సంబంధాలను ఆదిలోనే తుంచివేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ నాలుగు కార్యాచరణలతో అన్నిరంగాల్లో సమిష్టి వృద్ధిని సాధించగలుగుతామని అన్నారు. జీ20 తొలిరోజు సదస్సు సమ్మిళిత, సుస్థిర అభివృద్ధిపై జరిగింది. భావితరాల అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ సాంప్రదాయ విజ్ఞాన రిపాజిటరీవల్ల ఎంతో మేలుచేస్తుందని, సుస్థిర జీవనశైలి అలవడుతుందని, విజ్ఞాన సముపార్జనకు దోహదంచేస్తుందని అన్నారు.

ఇలాంటి సాంప్రదాయ విజ్ఞానం పరంగా భారత్‌కు ఎంతో చరిత్ర ఉందని వీటిని వ్యాప్తిలోకి తీసుకురావడంద్వారా మంచి ఆరోగ్యం, ఉత్తమజీవనశైలికి అలవరిచినట్లవుతుందని అన్నారు. జీ20 దేశాల సదస్సు కు హాజరైన మోడీ తొలిరోజు ప్రసంగంలో మాట్లాడుతూ ఆఫ్రికా ఖండం అభివృద్ధి ప్రపంచ ప్రగతికి కీలకమవుతుందని, ఈ ఆఫ్రికా ఖండంపట్ల భారత్ నిరంతరం సంఘీభావంతోనే నడిచిందని చెప్పారు. ఆఫ్రికా నైపుణ్యాల కార్యాచరణతో శిక్షకులకు మరింత శిక్షణ ఇచ్చే వ్యవస్థను ఏర్పాటుచేస్తామన్నారు. దీనివల్ల మిలియన్లకొద్దీ సర్టిఫైడ్ శిక్షకులు తయారవుతారని, ఆఫ్రికాలో వచ్చే దశాబ్దంలోనే పదిలక్షలమంది శిక్షకులను రూపొందించగలమని అన్నారు.

వీరంతా మళ్లీ యువతకు శిక్షణ ఇస్తారని, ఇలా రెట్టింపుస్థాయికి చేరుతూ ఖండం మొత్తం ఉద్యోగార్హత నైపుణ్యాలను కలిగిఉండే యువతను తీర్చిదిద్దుతుందన్నారు. స్థానిక సామర్థ్యం పెంచడంతోపాటు ఆఫ్రికా సుదీర్ఘ అభివృద్ధిని కూడా మరింత శక్తివంతంచేస్తుందని అన్నారు. అలాగే జీ20 గ్లోబల్ హెల్త్‌కేర్ స్పందన బృందాన్ని ఏర్పాటుచేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. అత్యవసర వైద్యసమయాల్లో ఈ గ్లోబల్ హెల్త్‌కేర్ రెస్పాన్స్‌టీమ్ సేవలు వెలకట్టలేనివని ఆయన అన్నారు.

# ఆజాద్ సహా 37 మంది మావోయిస్టులు లొంగుబాటు

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాత వార్త:** మావోయిస్టు పార్టీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటిరే ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఎపిలలో పదుల సంఖ్యలో నక్సలైట్లు లొంగిపోగా ఇదే క్రమంలో శనివారం నాడు తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి ఎదుట 37 మంది అజ్ఞాత మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోయారు. వీరిలో 25మంది మహిళలు వున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు మరో ముగ్గురు డివిజన్ క మిటీ సభ్యులు తొమ్మిది మంది ఎసిఎంలు ,22 మంది దళ సభ్యులు వున్నారు. వీరు తమ వద్ద వున్న ఒక ఎకె 47 తుపాకి, రెండు ఎ స్ఎల్ఆర్ తుపాకులు, నాలుగు 303 తుపాకులు, ఒక జి2 తుపాకి, 346 తూటాలను ఈ సందర్భంగా అందజేశారు. లొంగిపోయిన వారిలో ము లుగు జి ల్లాకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యాడ సాంబయ్య అలియాస్ ఆజాద్ (49), పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన అప్పాసి నా రాయణ అలియాస్ రమేష్ (70), ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జి ల్లా జేగర్‌గుండాకు చెందిన ముచ్చకి సోమడా అలియాస్ ఎర్రా (ఇతను దక్షిణ బస్తర్ డివి జన్ కమి టీ నాయకుడు కూడా)లు కీలకమైన వారు. వీరిపై తలా 20 లక్షల రూపాయల రివార్డు వుంది. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీలో వున్న ఛ త్తీస్‌ఘడ్ దండకారణ్య కమిటీ నక్సల్స్ నూపో గంగా అలియాస్ నీలేష్ (25), మడవి సుక్మా, (25), కట్టం మోటూ (22), ఉయికే బిచ్చే, పూనెం ఉంగి (23), అబ్కా రైమోతి (20), కుడియం దేవే అ లియాస్ రోషిణి (21), బస్తర్ కమిటీ నక్సల్స్ సోడి సుక్కి (20), సోడి పైకి (20), సోడి హిడుమా (17), దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యులు మడవి సోనా (38). హేంలా అడుమే (35). ముచ్చకి ఊరా (22), కుడం లక్ష్మీ (22 ). సోడి సోమిడి (24), పొడియం మసే (26). వద్దం రైను (25) కారం మంగలి (32), మడివి మాంకీ (21), కుంజల కమల (18) పొడియం జోగా (20) , మిద్యం మల్లే (22) వెకో కోసి (22) ఊకె రణిత (22), సోడి మంగి (25), ఉయికే రత్న (20), వెట్టి జోగి (22), ఓయం లాలి (22), మోడియం రోని (21), కోర్సా లక్ష్మీ (21), కులుము ఉంగి (20), హెమ్లా భీమీ (20), మడివి కోసా (27), నుపో మక్కీ (24)లు వున్నారు. లొంగిపోయిన వారిలో 20 లక్షల రూపాయల రివార్డు వున్న ముగ్గురికి చెక్కులను అందించగా మిగతా వారికి తక్షణ సహాయం కింద తలా 25 వేల రూపాయల నగదును అందించారు. లొంగిపోయిన నక్సలైట్లకు నూ. 1.41 కోట్ల నగదును త్వరలో అందజేస్తామని డిజిపి తెలిపారు.మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎపిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన దానికి తమకు ఎలాంటి సంబంధం లేదని డిజిపి శివధర్ రెడ్డి తెలిపారు. హిడ్మా తమ వద్దకు లొంగిపోయేందుకు రాలేదని, ఈ విషయంలో వస్తున్న వార్తలు నిజం కావని ఆయన తెలిపారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-11-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 292 పేజీలు: 10+4 వెల: 8.00



శనివారం పుట్టపర్తిలోని సత్యసాయిబాబా మహాసమాధి వద్ద అంజలి ఘటిస్తున్న రాష్ట్రపతి ముర్ము

లోక కల్యాణానికే ఆయన ఆవిర్భవించారు..

బాబా శతజయంతి ఉత్సవాలలో రాష్ట్రపతి ముర్ము

మహాసమాధిని దర్శించి నివాళులర్పించిన రాష్ట్రపతి

సత్యసాయి సిద్ధాంతాలకు భక్తులు బ్రాండ్ అంబాసిడర్లు కావాలి: సీఎం చంద్రబాబు

# శాంతి స్వరూపం సత్యసాయి

**పుట్టపర్తి, నవంబరు 22 ప్రభాతవార్త:** సత్యం, మంచి వ్యక్తిత్వం, శాంతి, ప్రేమ వంటిని పాటించాలని సత్యసాయి బాబా నిరంతరం బోధించేవారని, లోక కళ్యాణం కోసం బాబా పనిచేశారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు జాతి నిర్మాణం కోసం పని చేస్తోందని తెలిపారు. పుట్టపర్తిలో జరుగుతోన్న సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు ఆమె హాజరయ్యారు. అంతకు ముందు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకుని వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ సత్యసాయి బాబా జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా మహాద్భాగ్యం. మానవ సేవే మాధవసేవ అని బాబాభావించేవారు. సమాజానికి సేవలందించిన మహానుభావుల్లో సత్యసాయిబాబా అగ్రభాగాన ఉన్నారు. చాలా >>2



జోహన్స్‌బర్గ్ సదస్సులో మాట్లాడుతున్న పిఎం మోడీ

డ్రగ్స్, ఉగ్రలింక్‌లు 2లో

## ఛేదించాలి

జి-20 దేశాలు మరింత సమన్వయంతో సాగాలి

పత్తి, మొక్కజొన్న, అరటి

# రైతులను ఆదుకోండి

కేంద్రానికి సిఎం చంద్రబాబు లేఖ

**సత్యసాయి జిల్లా,(పుట్టపర్తి), నవంబరు 22 ప్రభాతవార్త:** రాయలసీమలో పండిన అరటిని ముంబై లాంటి మార్కెట్ లకు తరలించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ముంబై, కలకత్తా లాంటి ప్రాంతాలకు తరలించి అక్కడి మార్కెట్లలో విక్రయించాలని సూచించారు. అరటి ధరలు, పత్తి,మొక్కజొన్న కొనుగోళ్లపై అధికారులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. అరటి ధరలు, కొనుగోళ్లపై ప్రతీ రోజూ వ్యాపారులతో సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మహారాష్ట్ర లాంటి ప్రాంతాల్లో ఉన్న మార్కెట్లకు అరటి లోడుతో కూడిన రైల్వే వ్యాగన్లను పంపేందుకు చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం >>2







# పరీక్షల భయంతోనే విద్యార్థుల ఆత్మహత్యలు

నాగమణీంద్ర పల్లాపు

మరికొద్ది రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పోటీ పరీక్షలతోపాటు, వార్షిక పరీక్షలు మొదలు కానున్నాయి. పరీక్షలంటే ఇటు విద్యార్థులతోపాటు.. అటు తల్లిదండ్రుల్లోనూ టెన్షన్ పెరుగుతుంది. వార్షిక పరీక్షల కంటే పోటీ పరీక్షలైతే ఇదీ మరీ ఎక్కువగా ఉంటుంది. పరీక్షల భయంతో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు ప్రతి ఏడాది చూస్తూనే ఉంటాము. విద్యార్థుల ఆత్మహత్యలకు పరీక్షల భయం ఒక్కటే కాకుండా.. ఇంకా అనేక కారణాలు ఉంటున్నాయి. స్కూల్‌లో ఉపాధ్యాయులు అవమానించారని. తోటి విద్యార్థులు ఎగతాళి చేశారని, తక్కువ మార్కులు వచ్చాయని ఇలా ఇతర కారణాలు కూడా ఉంటున్నాయి. మరికొన్ని సంఘటనల్లో అయితే కార్పొరేట్ కాలేజీల్లో చేరిన విద్యార్థులు అక్కడి వాతావరణానికి తట్టుకోలేక, చదువుపై ఒత్తిడిని భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ మధ్య కాలంలో టీచర్ల వేధింపుల మూలంగా తనువు చాలిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. సాధారణంగా విద్యార్థులు వార్షిక పరీక్షలంటే భయపడతారు. ఆ పరీక్షల్లో ఫెయిల్ అవుతామోమోననే భయంతో కొందరు విద్యార్థులు పరీక్షలకి ముందే చనిపోతుంటే.. మరికొందరు పరీక్షలు రాసిన తరువాత మంచి మార్కులు రావని, పరీక్షల్లో ఫెయిల్ అవుతామనే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వార్షిక పరీక్షల భయం కాకుండా పోటీ పరీక్షల భయం మూలంగా మరికొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మెడిసిన్‌లో సీట్ల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్షల్లో తాము మంచి మార్కులు సాధించలేమని ముందుగానే ఊహించుకుని పరీక్షలకు సిద్ధమవుతున్న సందర్భంలోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఐఐటీల్లో ఇంజనీరింగ్ సీట్ల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామన(జేఈఈ)లో ర్యాంక్ సాధించలేమని భావించే విద్యార్థులు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు విద్యార్థులు హాస్టల్స్‌లో ఉంటూ ఆ భోజనాన్ని తినలేక, హాస్టల్స్‌లో ఉండలేక తల్లిదండ్రులకు చెప్పినా ఫలితం ఉండదని భావించి చనిపోతున్నారు. ఇలా

కర్ణుడి చావుకి సవాలక్ష కారణాల మాదిరిగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడానికి పలు కారణాలు ఉంటున్నాయి. విద్యార్థులు ఆత్మహత్యలకు ప్రధానంగా కారణాలు రెండు. మొదటిది వార్షిక పరీక్షల్లో ఫెయిల్ కావడమైతే రెండోది పోటీ పరీక్షల్లో మంచి ర్యాంకులను సాధించేమనే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ రెండుకారణాలతో మరణిస్తున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఇది ఏఒక్క రాష్ట్రం



లోనూ జరగడం లేదు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కూడా జరుగుతోంది. విద్యార్థుల ఆత్మహత్యలు పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లోనూ జరుగుతోంది. ఏడాదంతా చదివి ఎగ్జామ్స్ రాసే పిల్లలకు ఎంత టెన్షన్ ఉంటుందో దానికి పదింతలు పేరెంట్స్ టెన్షన్ పడతారు. పిల్లలకు ఎగ్జామ్‌లో మార్కుల రాకపోతే పేరెంట్స్ తిడతారనే భయం, ఫెయిల్ అయితే కొడతారనే భయంతో ఒత్తిడికి గురై విద్యార్థులు సూసైడ్‌కి పాల్పడుతున్నారు. చదువులో ఫెయిల్ అయినందుకు స్టూడెంట్ సూసైడ్ చేసుకుంటున్నారనుకుంటే అందుకు కారణం. ఇంట్లో అమ్మానాన్న ఏమంటారోసొసైటీ ఎలా చూస్తుందో అనే భావనతోనే సగానికి పైగా స్టూడెంట్స్ చనిపోతున్నారు. పిల్లాడు లేదా పిల్ల చనిపోయిన తర్వాత మేము ఏమంటాము బతికుంటే ఇంకేదైనా పని చేసుకునేవాడివి అని ఏడుస్తారు కానీ ఉన్నప్పుడు మేమున్నామనే భరోసా ఇచ్చే తల్లిదండ్రులు చాలా తక్కువ మంది ఉంటారు. చదువు కాకుండా వారికి దేనిమీద ఇంట్రస్ట్ ఉందో తెలుసుకుని అటువైపుగా వారు రాణించేలా చూసుకోవాలి. అలాచేస్తే విద్యార్థుల ఆత్మహత్యలు చాలావరకు తగ్గే అవకాశం ఉంటుంది. మంచి మార్కులు తీసుకుచ్చి స్టేట్ లెవెల్‌లో టాప్ టెన్‌లో నిలవాలని విద్యార్థులపై తల్లిదండ్రుల ఒత్తిడి ఓవైపు కాలేజీకి మంచి పేరు తీసుకుచ్చి మార్కెటింగ్ చేసుకోవాలన్న తపనతో కాలేజీ యాజమాన్యం ఒత్తిడి మరోవైపు వెరసి విద్యార్థుల ప్రాణాలకే ప్రమాదంగా మారుతున్నాయి. విద్యార్థుల ఆత్మహత్యలు టెన్త్, ఇంటర్‌లో ఫెయిలైన సందర్భాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చినపుడు, ఎస్ఎస్‌సి ఫలితాలు వచ్చినప్పటి నుంచి రెండు,మూడు రోజులవరకు విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలు జరుగుతున్నాయి. విద్యార్థులు పరీక్షలను బాగా రాశామని భావించినప్పటికీ ఒక్కో సందర్భంలో వారు ఫెయిలైతే దానిని తట్టుకోలేక చనిపోతున్నారు. పరీక్షల ఫలితాలు వెలువడే దానికంటే ముందుగానే విద్యార్థులు తాము పరీక్షల్లో ఫెయిలవుతామనే భయంతో కూడా కొందరు విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు. అయితే ఈమధ్య కాలంలో ఇలాంటి భయంతో ఆత్మహత్యలకు పాల్పడి వారు పరీక్షల్లో మంచి మార్కులను తెచ్చుకున్న సంఘటనలుకూడా జరిగాయి. ఇలా టెన్త్,ఇంటర్‌పరీక్షల భయంతో చనిపోతున్న వారి సంఖ్య పదుల సంఖ్యలో ఉంటుంది. ఇది కాకుండా నీట్, జేఈఈ, సీఏ వంటి పోటీ పరీక్షల్లో తాము మంచి ర్యాంకులను సాధించలేమని భయంతో ఒత్తిడికి గురై చనిపోతున్న వారి సంఖ్య గత నాలుగైదేళ్లుగా పెరుగుతూ వస్తోంది. ప్రధానంగా నీట్‌లో ర్యాంక్‌రాదనే భయంతో విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. గత మూడు, నాలుగేళ్లుగా ఏడాదిలో కనీసం 20కి తగ్గకుండా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నీట్‌కి కోచింగ్ ఇస్తున్న కోటా నగరంలోనే ఎక్కువమంది విద్యార్థులు చనిపోతున్నారు. 2023లో 22 మంది చనిపోగా, 2024లో 25 మంది చనిపోయారు. ఈ ఏడాది కూడా ఇప్పటికే సుమారు 18 మంది చనిపోయినట్టు పోలీసుల లెక్కలు చెబుతున్నాయి. నీట్‌కి కోచింగ్ ఇస్తున్న సంస్థలు రాజస్థాన్ లోని కోటాలోఎక్కువగా ఉండటం ఇందుకు కారణం. గత మూడు, నాలుగేళ్లుగా కోటాలో జరుగుతున్న ఆత్మహత్యలను సీరియస్‌గా తీసుకున్న అక్కడి రాష్ట్ర ప్రభుత్వం స్టూడెంట్స్ సూసైడ్‌ల నివారణకు మార్గాలను అన్వేషిస్తూ ఆత్మహత్యల నివారణకు తగిన మార్గాలను చెప్పాలని విద్యారంగ నిపుణులకి సూచించడమే కాకుండా కోటింగ్ సెంటర్లకి సీరియస్‌గా వార్నింగ్ కూడా ఇచ్చింది. ఇవేకాకుండా ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులుఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వారిలో ఎక్కువశాతం అప్పటివరకు అంటే 10వ తరగతి వరకు తల్లిదండ్రుల దగ్గర ఉండి చదువుకున్న విద్యార్థులు ఒక్కసారిగా హాస్టల్‌లో ఉండిచదువుకోవల్సి రావడం అదీ కూడా 24 గంటలకు ఒకటే చదువు, చదువు అని ఒత్తిడి చేయడంతో మానసికంగా తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ మధ్యకాలంలో ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లోఉండి చదువుతూ ఆత్మహత్యలకు పాల్పడుతూవిద్యార్థులు సూసైడ్ నోట్లను రాస్తున్నారు. వాటిలో ప్రధానంగా ఒత్తిడిని తట్టుకోలేక తమకు ఇష్టంలేకున్నా హాస్టల్‌చేర్పించడంతోపాటు.. తాము వేరేకోర్సులో చేరాలనుకుంటే బలవంతంగా తల్లిదండ్రులు తమకు నచ్చిన కోర్సులో చేర్పించడంతో ఇదే విషయాన్ని సూసైడ్‌లో నోట్‌లో రాస్తూ తమ్ముడు, చెల్లి విషయంలో ఇటువంటి నిర్ణయం తీసుకోవద్దని చెబుతూ ఆత్మహత్య చేసుకున్న ఘటనలు జరుగుతున్నాయి. ఉన్నత విద్యాసంస్థలైన ఐఐటీలు, యూనివర్సిటీల్లోనూ కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. వారు సైతం ఒత్తిడిని తట్టుకోలేక చనిపోతున్నట్టు లేఖలు రాసిన మరణిస్తున్నారు. ●

ఇక సాధారణంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్న విద్యార్థుల్లోనూ కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. హాస్టల్స్‌లో తోటి విద్యార్థుల వేధింపులతోపాటు, ఉద్యోగుల వేధింపుల కారణం కూడా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో లైగింక వేధింపుల మూలంగా కూడా విద్యార్థిని, విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.సాధారణంగా హాస్టల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో చదివే విద్యార్థులే కాకుండా .. ఇంటర్, డిగ్రీ,యూనివర్సిటీ, ఎంబిబిఎస్, ఇంజనీరింగ్ వంటి కోర్సుల్లో చేరిన వారు కూడా అక్కడ వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో కాలేజీలు, యూనివర్సిటీలు, ఇంజనీరింగ్, మెడిసిన్‌లో ఫీజులుఎక్కువగా ఉన్నచోట ఫీజులను సరైన సమయానికి చెల్లించకపోతే.. యాజమాన్యాల వేధింపుల మూలంగా ఆత్మహత్యలు చేసుకుం



టున్న ఘటనలు కూడా ఉంటున్నాయి. ఏమైనా విద్యార్థుల ఆత్మహత్యలకు విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, తోటి విద్యార్థులు, యాజమాన్యాలు, పాఠాలు బోధించే టీచర్లు, లెక్చరర్లు కూడా కారణంగా ఉంటున్నారు. మొత్తంగా విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, లెక్చరర్ల తీరులో మార్పురావల్సి ఉంది. విద్యార్థులు ఫెయిలైనప్పటికీ వారిని మందలించకుండా తదుపరి ఏమీచేయాలో ఆలోచించేలా తల్లిదండ్రులు వ్యవహారించడంతోపాటు విద్యార్థులపై వేధింపులు లేకుండా పాఠాలుబోధించే టీచర్లు, లెక్చరర్లు,తోటి విద్యార్థులు వ్యవహారించాల్సిన అవసరం ఉంటుందని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

---

కర్ణాటక

# సుఖాంతమేనా!

ఎ.వి.వి ప్రసాద్

నిప్పు లేనిదే పొగ రాదంటారు. అది నిజమే. కానీ వ్యాపించిన దట్టమైన పొగ వెనుక ఎలాంటి నిప్పు లేదంటున్నారుముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె శివకుమార్. అయితే అంత దట్టమైన పొగ వారం రోజులుగా వ్యాపించినా,దానివెనుక ఎలాంటి నిప్పులేదనడం విడ్డూరమే. రెండున్నరేళ్ల క్రితం భారీ మెజారిటీతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆ ఇద్దరు అధినాయకుల మధ్య గట్టి పోటీయే తలెత్తింది. ఏదో మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతోందని అభిమానులు సంతోషిస్తుంటే,ఈ బెడద ఏమిటని పార్టీఅధిష్ఠానం తలపట్టుకొంది.కర్ణాటకలో కాంగ్రెస్ కనుమరుగవుతున్న దశలో తిరిగి పార్టీలో జవసత్వాలు నింపింది తానేననీ, పార్టీ తిరిగి అధికారంలోకి రావడంలో తనవంతు సింహభాగమనీ సింహంలా గర్జించారు డికె. ఆయన అప్పటికే పిసిసి చీఫ్‌గా ఉన్నారు. అధిష్ఠానం ఏదోవిధంగా నచ్చజెప్పి, చివరికి సిద్ధరామయ్యకే సింహాసనం అప్పగించింది. ముఖ్యమంత్రిగా ఆయనకు గల గత అనుభవం,సామాజిక కారణాలు అందుకు కొంత పనిచేశాయి. రెండున్నరేళ్ల సిద్ధరామయ్యకు,తర్వాత రెండున్నరేళ్ల డికెకు అధికార పంపిణీ జరిగేట్లుగా అధిష్ఠానం నచ్చజెప్పిందనీ,అందుకే అప్పటికిసమస్య పరిష్కారమైందనీ ప్రచారం జరిగింది. అటువంటి 'పంపకం' రాజకీయాలలో కొత్త కాదు కనుక, 'కాబోలు' అనే అంతా అనుకొన్నారు. ఈలోగా రెండున్నరేళ్ల గిర్రున తిరిగాయి. అప్పటి 'ఒప్పందం' ప్రకారం ఇప్పుడు డికె వంతు వచ్చిందనే అంతా భావించారు. ఆయన కూడా అందుకు తగినట్లుగానే రెండు మూడు వారాలుగా కొన్ని ప్రకటనలు చేస్తూ వచ్చారు.'అయిదేళ్ల నేనే ముఖ్యమంత్రిని' అంటూ సిద్ధరామయ్య గంభీరంగానే చెబుతున్నా మధ్యమధ్యలో డికె ' భగవంతుడు ఏమనుకొంటున్నాడో, అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకొంటుందో 'అంటూ సొంత రాగం వినిపిస్తుండడంతో ఆయన అభిమానులంతా ఖుషీ అయిపోయారు. 'మా డికె నే ఇక సిఎం 'అంటూ అభిమానులు తయారు చేసిన హోర్డింగులు కూడా ఇటీవల బెంగళూరులో దర్శనమిస్తుండడంతో తెరవెనుక జరుగుతున్న కథ ఏమిటో అందరికీ అర్థమైపోయింది. ముఖ్యంగా గత వారం రోజులుగా ఇటు బెంగళూరు, అటుఢిల్లీలో కూడా ఇద్దరు నాయకుల అనుచరులు చేసిన హడావుడి చూసి ఏదో జరగబోతోందనే అంతా భావించారు. నవంబరు 20తేదీతో రెండున్నరేళ్ల పూర్తవుతుంది కనుక 21 నుంచి డికె ప్రభుత్వం ఏర్పాటవుతుందనే ప్రచారం జోరుగా సాగిపోయింది. సిద్ధరామయ్యతో తనకు ఎలాంటి విభేదాలు లేవంటూనే 'ఎమ్మెల్యేలంతా నా వాళ్లే'అని డికె చేసిన ప్రకటనలతో మరింత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దాదాపు 15 మంది ఎమ్మెల్యేలు, డజను మంది ఎమ్మెల్సీలు వారం రోజులుగా ఢిల్లీలోనే ఉండి డికెకు మద్దతుగా పావులు కదిపారనీ, అధిష్ఠానంపై ఎంతో ఒత్తిడి తెచ్చారనీ ప్రచారమైంది. వారు అక్కడ ఏం చేశారన్నదానిపై



సిద్దరామయ్య

భిన్న కథనాలు వచ్చినా,ఓ పాతిక మంది డికె మద్దతుదారులైన ప్రజాప్రతినిధులు ఢిల్లీలో తమ వంతు ప్రయత్నాలు చేశారన్నది మాత్రం నిజం. ఓ నాలుగు రోజులు డికె, సిద్దరామయ్య కూడా ఢిల్లీలోనే ఉన్నారు.వారిద్దరూ అధిష్ఠానంతో వేర్వేరుగా చర్చలు జరిపారు. ఇటీవల బీహార్లో కంగుతిన్న కాంగ్రెస్ కర్ణాటక సమస్యలో తలదూర్చలేక 'మీ తిప్పలు మీరు పడండి' అని వారికి చెప్పి పంపినట్లుగా వినిపించింది. మంత్రివర్గ విస్తరణ జరిపితే సమస్య పరిష్కారం కావచ్చని సిద్దరామయ్య చెప్పగా చివరికి ఖర్గే అంగీకరించారనీ, ఈ విషయంలో డికెకూడా తనకు అభ్యంతరంలేదని అన్నారనీ తెలిసింది. విస్తరణలో డికె ముఖ్య అనుచరులకు మంత్రిపదవి లభిస్తే మిగిలిన రెండున్నరేళ్ల ఎటువంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం నడుస్తుందనే రాజీసూత్రం ఫలించినట్లే కనిపిస్తోంది. మూడు నాలుగు రోజులు ఢిల్లీలో ఈ విషయంపై తీవ్ర స్థాయి చర్చలు జరిగిన తర్వాత సిద్ధరామయ్య శుక్రవారం ఒక ప్రకటన చేస్తూ 'పూర్తికాలం నేనే ముఖ్యమంత్రిని' అనడం,ఆతర్వాత కొద్దిసేపటికి డికె కూడా'ఆయనకు మా శుభాకాంక్షలు' అనడంతో సమస్య పరిష్కారమైనట్లు కనిపించింది. మామూలు పరిస్థితిలోనైతే అధికారమార్పిడి జరిగి డికెముఖ్యమంత్రి అయ్యేవారనీ,కానీ బీహార్‌లో తిన్నదెబ్బతో కర్ణాటకలో ప్రయోగం చేయడానికి పార్టీ అధిష్ఠానం సాహసించలేదనీ తెలుస్తోంది. డా. రంగనాథ్, బాలకృష్ణ,ఇక్బాల్ హుస్సేన్ వంటి డికె మద్దతుదారులు రాహుల్ గాంధీ వద్దకు వెళ్లి అధికార మార్పిడి గురించి ప్రస్తావించగా,'కొత్త తలనొప్పిని సృష్టిస్తారా!'అని ఆయన వారిని వారించినట్లుగా చెబుతున్నారు.తర్వాత వారంతా ఖర్గేను కలుసుకొని మంత్రివర్గ విస్తరణ జరిపించాలని పట్టుపట్టడం, సిద్ధరామ య్య కూడా అదే అభిప్రాయంతో ఉండడంతో ఖర్గేదానిని ఆమోదించడంజరిగినట్లుగా తెలుస్తోంది. ఎంపి అయిన డికె సోదరుడు సురేష్ రాహుల్‌తో గల సాన్నిహిత్యంతో చక్రం తిప్పడానికి ప్రయత్నించారనీ, అయితే ఆయనకు కూడా రాహుల్ తొందరపడొద్దని సూచించారనీ తెలిసింది.2028లో జరిగే ఎన్నికలు చాలా కీలకం గనుక మళ్లీ పార్టీని అధికారంలోకి తేవడంపై మాత్రమే అందరూ దృష్టి పెట్టాలనీ,కొత్త తలనొప్పులు సృష్టించరాదనీ రాహుల్ వారిని హెచ్చరించినట్లు కూడా తెలిసింది.డికెను ముఖ్యమంత్రిని చేయకపోతే రాజీనామా చేస్తామంటూ పది మంది ఎమ్మెల్యేలు,ముగ్గురు ఎంపీలు సిద్ధపడినట్లు కూడా పొగవ్యాపించింది. అయితే వారం దరిదీ అధిష్ఠానం బుజ్జగించి, సిద్ధరామయ్యను మార్చితే ఎదురుకాగల పరిస్థితిని వివరించిందనీ, ప్రస్తుతానికి అందరూ నిశ్శబ్దంగా ఉండాలని సూచించిందనీ తెలుస్తోంది.ఈ 'మార్పిడి' సమస్యతో పాలన మందగించిందనే అభిప్రాయం కూడా ఉంది. ప్రస్తుతం అధికార మార్పిడి సమస్య కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది గనుక పాలన ఇక మెరుగుపడవచ్చనే భావించాలి. పొగ వెనుక నిప్పు ప్రస్తుతానికి చల్లారినట్లే అనుకోవాలి. ●


---

ఉక్రెయిన్

# ట్రంప్ 'శాంతి' మెలిక!

గన్ని మోహన్

ఉక్రెయిన్‌పై రష్యా కొనసాగిస్తున్న దండయాత్రను కట్టడిచేసి ఇరువైపులా శాంతిస్థాపనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న కార్యాచరణ ఎప్పటికీ కొలిక్కివచ్చేదిగా కనిపించడంలేదు. తాజాగా 28 అంశాలతో రూపొందించిన ఒప్పంద ముసాయిదాలో మూడొంతులు రష్యాకు మేలు చేసేవిగానే ఉన్నాయి.ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ అమెరికా చెప్పినట్లు నడుచుకోవాల్సిన పరిస్థితులకు ట్రంప్ రూపకల్పన చేసారనిపిస్తోంది. సుదీర్ఘ సైనిక పోరాటంలో అలిసిపోయిన ఉక్రెయిన్ దేశానికి అంతోఇంతో సాయంచేసి యుద్ధాన్ని నివారించాల్సిన పెద్దన్నఏకపక్షంగా రష్యాకు అనుకూలంగా ఒప్పంద పత్రాన్ని రూపొందించడంపైగా తన ప్రతినిధులతో ఉక్రెయిన్ అధ్యక్షుడికి అందచేయడం చూస్తుంటే రష్యాకు సంపూర్ణ మద్దతిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఇక అజెండా అంశాలను చూస్తే నాటోలో ఉక్రెయిన్ చేరకూడదు, నాటో దళాలు ఉక్రెయిన్‌లో బసచేయకూడదు.ఉక్రెయిన్ సైన్యాన్ని 8.80 లక్షల నుంచి 6లక్షలకు తగ్గించుకోవాలి. ఇప్పటికే రష్యా ఆక్రమణలో ఉన్న లుహాన్స్,డోనెట్స్క్, ఖెర్సన్ ప్రాంతాలు రష్యాకు వదిలివేయాలి వీటితోపాటే 2014లో రష్యాదండయాత్రచేసి ఆక్రమించుకున్న క్రిమియా ప్రాంతం కూడా రష్యాదే అవుతుందని వీటిలో కీలకఅంశాలుగా పొందుపరిచారు. అంతేకాదు రష్యా భూభాగంపైకి ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఆయుధప్రయోగం చేయకూడదు. ప్రస్తుతం ఉక్రెయిన్‌లో ఉన్న ఝపోరిజియా అణుకేంద్రంవిద్యుత్ ఉత్పత్తిని ప్రారం భించి వచ్చే ఉత్పాదకతను రష్యా ఉక్రెయిన్‌కు సమాన పంపిణీ చేయడం వంటివి ఉన్నాయి.ఉక్రెయిన్‌కు అమెరికా సైనిక ఆర్థికసాయం తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఉక్రెయిన్ భూభాగంలో విదేశీ బలగాలను అనుమతించకూడదు. రష్యాపైకి దాడి చేసే సామర్థ్యం ఉన్న ఆయుధాలను ఉక్రెయిన్‌కు మరే ఇతర దేశం కూడా అందించకూడదు అన్న కీలక నిబంధనలు విధించారు. వీటితోపాటుగానే రష్యాపై ఉన్న ఆంక్షలు పూర్తిగా ఎత్తివేయడం, స్తంభింపచేసిన ఆస్తులనుంచి వచ్చే మొత్తం ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి 50 శాతం వెచ్చించడం, 50శాతం అమెరికా లాగేసుకోవడం వంటివి ఉన్నాయి.ఉక్రెయిన్‌కు మద్దతిస్తున్న యూరోపియన్ దేశాల యుద్ధవిమానాలు పోలండ్‌లో ఉంటాయి. రష్యా తిరిగి ఉక్రెయిన్‌పై దండయాత్రలు చేస్తే అంతర్జాతీయంగాఉన్న ఆంక్షలు అలాగే కొనసాగుతాయి. కొత్తగా వచ్చిన ప్రాదేశికప్రాంతాన్ని గుర్తిం చకపోవడం,అన్ని ప్రయో జనాలనున రద్దుచేయడం వంటివి చేస్తుంది. ఐరోపాలో ఉక్రెయిన్ సభ్యత్వం పొందవచ్చు. ఉక్రెయిన్ డెవలప్ మెంట్‌ఫండ్ ఏర్పాటుచేసి పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడం, టెక్నాలజీ, డేటాసెంటర్లు, ఎఐ వినియోగం వంటి వాటిని అమెరికా చూస్తుంది. అమెరికా దీర్ఘకాలిక ప్రాతిపదకన ఉక్రెయిన్‌లో సహజవనరులు, విద్యుత్, మౌలికవనరులు,



జెలెన్స్కీ

ఎఐ,డేటా సెంటర్స్, రేర్ ఎర్త్‌మెటల్ అన్వేషణ ప్రాజెక్టులు పర్యవేక్షిస్తుంది. పరస్పరప్రయోజనాల ఆధారంగా వీటిపై పనిచేస్తుంది. అన్నింటికంటే ముందు రష్యాను జి8 కూటమిలోకి తిరిగి ఆహ్వానిస్తుంది. మొత్తం 28 పాయింట్లతో కూడిన ఈ ఒప్పంద పత్రం చూస్తుంటే ట్రంప్ ఆదేశాల మేరకు రష్యాకు మొత్తం అనుకూలంగా రూపొందించినట్లు కనిపిస్తోంది. ఇదే కనుక అమలులోకి వస్తే జెలెన్స్కీకి అయినా ఉక్రెయిన్ ప్రజలకు అయినా ఆత్మహత్యా సదృశ్యమేనని చెప్పక తప్పదు. ఎందుకంటే ఇన్నాళ్లుగా ఇంచుమించు 2022నుంచి పోరాడుతూ వస్తూఎక్కడా మడమతిప్పకుండా ప్రపంచదేశాల మద్దతును పొందుతున్న ఉక్రెయిన్ హఠాత్తుగా ట్రంప్ రూపొందించిన ప్రణాళికకు తలొగ్గితే ఇక భవిష్యత్తు మొత్తంఅమెరికాకు బానిస బతుకుగా కొనసాగాల్సిందేనన్న వాదన కూడా ఉక్రెయిన్ ప్రజల్లో పెరిగింది. అందులోనూ ట్రంప్ మొదటి నుంచి కూడా రష్యా ఆక్రమించిన ప్రాంతాలు రష్యాకే ఇచ్చేయాలని పట్టుబడుతున్నారు.ఒకదశ లో జెలెన్స్కీని బెదిరించే ప్రయత్నాలు కూడా చేసిన సంగతి తెలిసిందే. మీడియా ముందే జెలెన్స్కీని అవమానించిన ట్రంప్ తాజాగా మళ్లీ ఈ శాంతి ఒప్పందానికి కేవలం రష్యాను బుజ్జగించడం కోసమే చేస్తున్నారనిపిస్తోంది. ఉక్రెయిన్‌ను ఏకాకిని చేసి ఈ శాంతి ఒప్పందంపై సంతకాలు చేయిస్తోందని ఇప్పటికే యూరోపియన్ దేశాలు ధ్వజమెత్తుతున్నాయి. అందుకు తగ్గినట్లుగానే ఈ 28పాయింట్ల అజెండా కూడా ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇకపై ఎలాంటి చర్చలు జరిగినా ఐరోపా కూటమి నిర్ణయించిన ప్రతినిధుల సమక్షంలోనే జరగాలని యూరోపియన్ కమిషన్ కూడా పట్టుబట్టడంతో ట్రంప్ కొంత వెనక్కి తగ్గే పరిస్థితి వచ్చింది. రష్యాకోసం ఇంత పరితపించిపోతున్న ట్రంప్ ప్రతిపాదనలకు కేవలం రష్యా ప్రతినిధి స్పందించారేకానీ ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌నుంచి ఒక్కమాటకూడా వెలువడకపోవడం గమనార్హం. మొత్తంగా చూస్తుంటే ఉక్రెయిన్‌ను క్రమేపీ తమరష్యన్ ఫెడరేషన్‌లోనే విలీనం చేసేసుకోవాలన్న లక్ష్యంతోనే ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకు తగినట్లుగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కూడా తాను ఎన్నికైనప్పటినుంచి పుతిన్‌కు మద్దతుగానే వ్యాఖ్యలు చేస్తుండటం చూస్తుంటే జెలెన్స్కీపై ఒత్తిడి తెచ్చి శాంతి ఒప్పందంపేరిట ఈ డీల్‌పై సంతకం చేయించాలని చూస్తున్నారు. అమెరికాకు అంత అభిమానం హఠాత్తుగా రావడానికి కారణం కూడా లేకపోలేదు. ఉక్రెయిన్‌లో ఉన్న అత్యంత అరుదైన ఖనిజ వనరులు అపారంగా ఉన్నాయి. వాటిని తవ్వితీసే ప్రాజెక్టును తామే తీసుకోవాలన్న లక్ష్యంతో శాంతి శాంతి అంటూ ఉక్రెయిన్‌పై కపటప్రేమ ప్రదర్శిస్తోంది. ఈ అజెండాపై జెలెన్స్కీ కూడా ఆచితూచి వ్యవహరిస్తున్నారు.ఒక మంచి మిత్రుడినికోల్పోవాలా, ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టాలా అన్న మీమాంసలో ఉన్న జెలెన్స్కీ ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని మాత్రం ఇతరులచేతికి అందించబోమన్న దృఢనిర్ణయం ఆయనలో కనిపిస్తోంది. ●

---

# ప్రపంచాన్ని శాసిస్తున్న శాస్త్ర,సాంకేతిక రంగాలు



సుంకవల్లి సత్తిరాజు

అక్షరాలు దిద్ది, పుస్తకాలను చదివి, అహరహం శ్రమించి అనుభవాలను పాఠాలుగా నేర్చుకుని, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా జీవిత సాగరాన్ని నెట్టుకొచ్చే ఓర్పు, నేర్పు గతించిన తరాలకు పుష్కలంగా ఉండేది. ఈ ఆధునిక డిజిటల్ యుగంలో డబ్బుంటే చాలు సౌకర్యవంతమైన జీవితం మన సొంతమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. జీవితాలను, భారంగా, అసౌకర్యంగా నెట్టుకొచ్చే కాలం గతించింది. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, సైన్స్ ఫలితాలు అరచేతిలో ప్రపంచాన్ని మనముందు సాక్షాత్కరింప చేస్తున్నాయి. నేటి ప్రపంచాన్ని సైన్స్ టెక్నాలజీ శాసిస్తున్నాయి. సైన్స్‌ను టెక్నాలజీని విభజించి చూడలేం.సైన్స్ అనే మహావృక్షానికి చెందిన ఫలమే టెక్నాలజీ. నేడు ప్రపంచం ఇంతగా అభివృద్ధి చెందడానికి పెరిగిన సాంకేతిక పరిజ్ఞానమే కారణం. అనేక రంగాలు సాంకేతిక పరిజ్ఞానంతో పెనవేసుకున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు వ్యవస్థలన్నీ టెక్నాలజీ సాయంతో నడుస్తున్నాయి. డిజిటల్ టెక్నాలజీ అనేక అద్భుతమైన ఫలితాలకు ఆలవాలంగా మారింది. విద్య వైద్య, ఇంజనీరింగ్, కళా సాంస్కృతిక రంగాలు టెక్నాలజీ వలన వినూత్నమైన రూపం సంతరించుకున్నాయి. అనేక వ్యాధులకు చికిత్సనందించడంలోను, శస్త్రచికిత్సల్లోను సాంకేతిక పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతున్నది. విద్యార్థులకు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు అందుబాటులోకి రావడంతో నేర్చుకునే ప్రక్రియ సులభతరంగా మారింది. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో సరికొత్త మార్పులొచ్చాయి. నేర పరిశోధనలో టెక్నాలజీ పాత్ర కీలకంగా మారింది. సమాచార వ్యవస్థ స్వరూప స్వభావాలు మారిపోయాయి. ఇంటర్నెట్‌లో సకల సమాచారం లభ్యమవుతున్నది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అత్యంత వేగంగా విస్తరించే అవకాశముంది.ఇప్పటికే ఏఐ ప్రకంపనలు మొదలయ్యాయి. గూగూల్ సెర్చ్ ఇంజన్ కూడా అదృశ్యమయ్యే అవకాశముంది. 'సైన్స్ అండ్ టెక్నాలజీ' మానవ జీవితాలను శాసిస్తున్నది. ప్రయోజనాలతో పాటు అనేక విపరీత పరిణామాలకు కూడా విజ్ఞాన, సాంకేతిక పరిజ్ఞానం దోహదం చేయడం బాధాకరం. ఇది కేవలం మానవ తప్పిదం. సైన్స్‌ను సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంలో మంచి చెడుల విచక్షణ అవసరం. ఇప్పటికే సాంఘిక మాధ్యమాలు హోరెత్తిపోతున్నాయి. విద్యార్థులు, యువతతో పాటు విద్యాధికులు, పెద్దలు సైతం సోషల్ మీడియా కబంధ హస్తాల్లో చిక్కుకుని, వాటికి దాసోహమై మానవ సంబంధాలకు తిలోదకాలిస్తున్నారు. వేగవంతమైన ఇంటర్నెట్ వలన అనేక యూట్యూబ్ ఛానళ్లను ప్రజలు యధేచ్ఛగా చూడగలుగుతున్నారు. మెయిన్ స్ట్రీమ్ ఛానళ్ల కంటే యూట్యూబ్ ఛానళ్ల ప్రభావమే అధికంగా కనిపిస్తున్నది.అసభ్యకరమైన కంటెంట్ యువత జీవితాలను నాశనం చేస్తున్నది. అనేక పోర్న్‌సైట్లు అందుబాటులోకి వచ్చాయి. ధనార్జనే ధ్యేయంగా భావించి విలువలకు తిలోదకాలిస్తూ, నగ్న సంస్కృతిని ప్రోత్సహిస్తూ, బ్లాక్‌మెయిలింగ్ పద్ధతులకు పాల్పడడం వలన సమాజంలో ఆటవిక ప్రవర్తన పెరిగిపోయే అవకాశాలు ఏర్పడ్డాయి.మహిళలను, బాలికలను బెదిరిస్తూ, బాధిస్తూ,మానసిక, లైంగిక హింసలకు గురిచేస్తున్న వారిని శిక్షించడం కష్టసాధ్యంగా మారింది. అంతర్జాతీయ స్థాయిలో సాగుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయకపోతే మోసాలే మానవ నైజంగా మారి, హింసా ప్రవృత్తి పెరిగేపోయే అవకాశముంది. ఆన్‌లైన్ గేమింగ్ ప్రక్రియలు వ్యసనంగా మారిపోతున్నాయి. కల్పితాలతో కూడిన కంటెంట్‌తో మానవ జీవితాలు అల్లకల్లోలమయ్యే పరిస్థితులకు సైన్స్ అండ్ టెక్నాలజీ కారణం కారాదు. ఎన్ని విజయాలు సాధించినా, ప్రపంచం వైజ్ఞానికంగా ఎంతగా ముందుకు దూసుకుపోతున్నా, శాస్త్రవేత్తల పరిశోధనలు ఆగలేదు.అనేక విషయాలపై నేటికీ విస్తృతంగా పరిశోధనలు, ప్రయోగాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో మనిషి మృత్యువును కూడా జయించగలడేమో అనే నమ్మకం కలుగుతున్నది. ప్రస్తుతం శాస్త్ర



సాంకేతిక రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు ఈ నిజానికి బలం చేకూర్చుతున్నాయి. మనిషి ఆయుస్సును పెంచడానికి పరిశోధనలు జరుగుతున్నాయి.'ఏజ్ రివర్సింగ్ ప్రాసెస్' ఎలాంటి సత్ఫలితాలనిస్తుందో వేచిచూడాలి. మానవ కణాలను,శరీర అవయవాలను మార్చి,ఎలాంటి రోగాలు లేకుండా మనిషి వందలాది సంవత్సరాలు జీవించడం కోసం పరిశోధనలు జరుగుతున్నాయి. మనిషి మెదడులో మైక్రోచిప్ అమర్చడానికి జరుగుతున్న ట్రయల్స్‌గురించి, చిప్ ట్రాన్స్ ఫ్లాంటేషన్ ప్రక్రియ గురించి వింటుంటే మానవ జీవితాలు భవిష్యత్తుల్లో ఎలాంటి మార్పులు సంతరించుకుంటాయో ఊహించుకోవడానికే భయం కలుగుతుంది. మానవ మేథస్సుకు కృత్రిమ మేథస్సుతోడుకావడం భవిష్య పరిణామాలపై ఆసక్తితో పాటు, భయోత్పాతం కలగడం సహజం. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సంభవిస్తున్న పరిణామాలు కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారకూడదు. శాస్త్ర పరిశోధనలకు ఉపక్రమించే ముందు వాటి వలన ఏర్పడే విపత్కర పరిణామాల గురించి ముందే ఆలోచించాలి. ఇప్పటికే పెరిగిన శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానం వలన మానవ జీవితం అనేక మలుపులు తిరిగింది. కొన్ని ఊహించని పరిణామాలు కూడా సంభవించాయి. భూగోళంపై కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. భూ ఉపరితలం వేడెక్కిపోతున్నది. నదులు, ఇతర జలరాశులు అంతరించే ప్రమాదం పొంచి ఉంది. శీతల దేశాల్లో కూడా అధికఉష్ణోగ్రతల వలన తీవ్రమైన పరిస్థితులు ఏర్పడే ప్రమాదముంది. రసాయనాలతో నిండిన ఆహారాన్ని భుజిస్తూ, కృత్రిమమైన జీవన శైలితో, అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతూ, నిరంతరం ఔషధాలను ఉపయోగిస్తూ, జీవచ్ఛవాల్లా బ్రతుకీడ్చే పరిస్థితులకు కారణం ఏమిటి? విజ్ఞానం పెరిగి,వినాశనానికి దారితీస్తే, మానవ మనుగడ అసాధ్యం. మానవ అవసరాలకు కావలసిన సహజ వనరులు తరిగిపోతున్నాయి. భూగర్భ సంపదను విచక్షణారహితంగా వాడేస్తున్నాం. సముద్రాలను కలుషితం చేస్తున్నాం. ప్రయోగాల పేరుతో అంతరిక్షాన్ని ఒక డంపింగ్ యార్డ్‌లా మార్చేస్తున్నాం. ప్రకృతిని విధ్వంసం చేసి, భూగోళాన్ని మృతగోళంగా మార్చే విధంగా మన ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. రోబోల శకం రాబోతున్నది. మానవ ప్రమేయం లేని 'మర మనుషుల లోకం' ఆవిర్భవించబోతున్నది. ఇవన్నీ ఆందోళన కలిగించే విషయాలే. కాలచక్ర పరిభ్రమణ ప్రక్రియలో భాగంగా ఈ ప్రపంచం అనేక మలుపులు తిరిగింది. అనేక మార్పులకు లోనై, నిరంతరం ఏదో ఒక కొత్తదనాన్ని తనలో ఇముడ్చుకుని, ముందుకు సాగుతున్నది. 'కొత్తొక వింత పాతొక రోత అన్న చందంగా ఈ భూతలంపై నివసిస్తున్న జనబాహుళ్యం కొంగ్రొత్త జీవన విధానాలను తమ నిత్య జీవితాలకు అన్వయించుకుంటున్నది. అయితే మనతో పాటు ఈభూగ్రహంపై నివసిస్తున్న ఇతరజీవరాశులుమాత్రం కేవలం ఆహారంకోసం మాత్రమే అన్వేషిస్తూ, యథావిధిగా జీవిస్తూ, గతిస్తున్నాయి.భూమండలంపై ఏర్పడుతున్న అనేక పరిణామాలను తట్టుకుని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన మార్పులుచేసుకుంటూ,అనేక అంటు వ్యాధులను ఎదుర్కొంటూ,ప్రకృతి విపత్తులను సైతం తట్టుకుంటూ జీవిస్తున్న కారణంగానే మానవజాతి ఈ భూగ్రహంపై తన అస్థిత్వాన్ని కొనసాగిస్తున్నది.'సైన్స్ అండ్ టెక్నాలజీ' ప్రభావంతో నేడు మనమంతా ఎంతో సౌకర్యవంతంగా జీవిస్తున్నాం.ఇలాంటి అనుకూల పరిస్థితులను కాదనుకుని, జంతువుల్లా జీవించాలనుకోవడం జంతు ప్రవృత్తిని అలవరచుకుని,మానవ నాగరికతకు,మానవ జీవన విధానంలోని విశిష్టతకు దూరంగా జరగాలనుకోవడం,కేవలం ఏదోలా జీవించడానికే మార్గాలను అన్వేషించడం దేనికి సంకేతం?కేవలం బ్రతకడానికే ప్రాధాన్యత నిచ్చే విపరీతమైన ధోరణులను అలవరచుకోవడం మానవ అస్థిత్వాన్నిప్రశ్నిస్తున్నాయి. వైజ్ఞానిక, సాంకేతిక ప్రగతిని స్వార్థం కోసం వినియోగించడం, నేరపూరిత ప్రవర్తనతో ఇతరులను వంచించి,హింసించి, చంపడం, కేవలం తినడానికే బ్రతకడం, బ్రతకడానికి మోసాలు చేయడం జంతు ప్రవృత్తికి నిదర్శనం. ఇకనైనా ఈ ధోరణి మారాలి. పెరిగిన విజ్ఞానం మెరుగైన జీవితాలకు సోపానం కావాలి.'సైన్స్ అండ్ టెక్నాలజీ' వినియోగం మనతోపాటు మనతో మమేకమై జీవిస్తున్న ఇతర జీవరాశుల మనుగడకు ప్రమాదకరంగా పరిణమించకూడదు.ప్రస్తుత వైజ్ఞానిక ఆవిష్కరణలు మనిషిని మృత్యుంజయుడిగా మారుస్తాయో,మృత్యువుకు ఎరగా వేస్తాయో కాలమే సమాధానం చెప్పాలి. ●

# క'ర్నాటకం'లో కొత్త సమీకరణాలు!

## దళిత సీనియర్ నేతకు సీఎం పదవి?

### మరోసారి ఢిల్లీకి డికెవర్గం

**బెంగళూరు, నవంబరు 22:** కర్ణాటక కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం జరుగుతున్న అంతర్గత పోరు మరింత ముదిరింది. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఎవరికివారు మంకుపట్టుతో ఉంటే సీనియర్ దళిత ఎమ్మెల్యేను సీఎం చేయాలని ప్రతిపాదించారు. ఈరేసులో మొట్టమొదటగా వచ్చేది కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర రేసులో ముందుంటారు. తాజాగా డీకే శివకుమార్ వర్గం ఢిల్లీలో పాగా వేయగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వర్గం బెంగళూరులో ప్రతివ్యూహాలకు పదును పెడుతోంది. సీఎం పదవి మార్పు కోసం ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా, డీకే శివకుమార్ మద్దతుదారులుగా ఉన్న 10 మందికి పైగా ఎమ్మెల్యేలు గత రెండు రోజులుగా ఢిల్లీలో మకాం వేశారు. త్వరలోనే మరో ఎమ్మెల్యేల బృందం కూడా ఢిల్లీకి బయలుదేరనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలతో అప్రమత్తమైన సిద్ధరామయ్య వర్గం, డీకే దూకుడుకు కళ్లెం వేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇటీవల ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానంతో భేటీ అయిన సిద్ధరామయ్య, డీకే శివకుమార్‌కు చెక్ పెట్టేందుకు రాష్ట్రంలో మరో ఇద్దరు డిప్యూటీ సీఎంలను నియమించాలని ప్రతిపాదించినట్లు సమాచారం. ఇది డీకే శివకుమార్ ప్రాబల్యాన్ని తగ్గించే ఎత్తుగడగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు, బెంగళూరులో సిద్ధరామయ్యకు విధేయులైన సీనియర్ మంత్రులు కేఎన్ రాజన్న, వెంకటేశ్, డాక్టర్ జి.పరమేశ్వర, హెచ్‌సీ మహదేవప్ప తదితరులు మంత్రి సతీశ్ జార్కిహోళి నివాసంలో విందు సమావేశం నిర్వహించడం తీవ్ర చర్చనీయాంశమైంది. డీకే వర్గం ఢిల్లీలో చేస్తున్న ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలనే దానిపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారని, ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రులు నిర్ణయించారు. ఒకవేళ అధిష్ఠానం అధికార మార్పిడి వైపు మొగ్గుచూపితే, ముఖ్యమంత్రి పదవి డీకే శివకుమార్‌కు కాకుండా దళిత నేతకు ఇవ్వాలని వారు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో దళిత నేతలు కూడా ప్రత్యేకంగా సమావేశం కావడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. మొత్తం మీద, విందు రాజకీయాలు, వర్గ సమీకరణాలతో కర్ణాటక కాంగ్రెస్‌లో పోరు తీవ్రస్థాయికి చేరింది. ప్రస్తుతం రెండు వర్గాలు అధిష్ఠానం నిర్ణయం కోసం వేచిచూస్తున్నాయి. రాబోయే కొన్ని రోజులు కర్ణాటక రాజకీయాలకు అత్యంత కీలకం కానున్నాయి.





# ట్రంప్ శాంతిప్రతిపాదనకు పుతిన్ అంగీకారం

**మాస్కో, నవంబరు 22:** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన 28అంశాల శాంతి ప్రణాళికకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. 2022 నుంచి కొనసాగుతున్న ఈ భీకర యుద్ధానికి ఒక తుది పరిష్కారం కనుగొనడానికి ఈ ప్రణాళికను ప్రాతిపదికగా తీసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ టివిలో చేసిన ప్రసంగంలో పుతిన్ ఈ విషయం వెల్లడించారు. అమెరికా నుంచి తమకు ప్రతిపాదన అందిన విషయాన్ని ధ్రువీకరించారు. తుది శాంతియుత పరిష్కారానికి దీనిని ఆధారంగా ఉపయోగించుకోవచ్చని నేను నమ్ముతున్నానని పుతిన్ పేర్కొన్నారు. అలాస్కాలోని యాంకరేజ్‌లో జరిగిన చర్చల సందర్భంగా అమెరికా వైపు నుంచి కొన్ని సర్దుబాట్లు, సౌలభ్యం చూపాలని కోరినట్లు పుతిన్ తెలిపారు. కొన్ని క్లిష్టమైన సమస్యలు ఉన్నప్పటికీ రష్యా ఈ ప్రతిపాదనకు అంగీకరించిందని ఆయన వివరించారు. అదే సమయంలో ఈ ప్రతిపాదనను ఉక్రెయిన్ తిరస్కరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పుతిన్ హెచ్చరించారు. ఒకవేళ కీవ్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తే గతంలో కుపియాన్స్క్‌లో జరిగిన పరిణామాలే యుద్ధరంగంలోని ఇతర కీలక ప్రాంతాల్లోనూ పునరావృతం అవుతాయి. మొత్తం మీద ఈ పరిస్థితి మాకు ఆమోదయోగ్యమేనని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, ఈ శాంతి ప్రణాళిక రష్యా డిమాండ్లకు అనుకూలంగా ఉందని భావిస్తున్న ఉక్రెయిన్ తీవ్ర సందిగ్ధంలో పడింది.

దీనిపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ ఇప్పుడు ఉక్రెయిన్ ముందు చాలా కఠినమైన ఎంపిక ఉంది. ఆత్మగౌరవాన్ని వదులుకోవడమా? లేక ఒక ప్రధాన భాగస్వామి మద్దతును కోల్పోవడమా? అనేది తేల్చుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, నిజమైన, గౌరవప్రదమైన శాంతిని అందించే ప్రణాళిక కోసం తాము ఎదురుచూస్తున్నామని, ట్రంప్ బృందం ప్రయత్నాలను గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ శాంతి ప్రణాళికను అంగీకరించేందుకు ఉక్రెయిన్‌కు వచ్చే గురువారం వరకు ట్రంప్ గడువు విధించారు.



## దుబాయ్ ఎయిర్‌షోలో వింగ్‌కమాండర్ మృతి

### ఘటన చూస్తూ హతాశుడైన అతని తండ్రి!

**న్యూఢిల్లీ, నవంబరు 22:** భారత వైమానిక దళానికి చెందిన తేజస్ యుద్ధవిమానం దుబాయ్ ఎయిర్‌షోలో కూలిపోవడంతో వింగ్‌కమాండర్ నమాంశ్ స్యాల్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కుమారుడు పాల్గొన్న ఎయిర్‌షో వీడియోలను నమాంశ్ తండ్రి ఆసక్తిగా చూస్తోన్న సమయంలో ఈ షాకింగ్ ఘటన జరిగింది. ఆ దృశ్యాల ద్వారానే కుమారుడి మరణవార్తను తెలుసుకుని ఆ తండ్రి హతాశులయ్యారు. నమాంశ్ తండ్రి జగన్నాథ్ స్యాల్ హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి, పదవీ విరమణ పొందారు. నమాంశ్ దుబాయ్ ఎయిర్‌షోలో తేజస్ యుద్ధవిమానాన్ని నడుపుతుండటంతో ఆ దృశ్యాలను యూట్యూబ్‌లో చూస్తున్నారు. అప్పుడే విమానం కుప్పకూలిపోవడం ఆయన కంటపడింది. దాంతో వెంటనే తన కోడలికి ఫోన్ చేశారు. ఆమె కూడా వైమానిక దళంలో వింగ్ కమాం డర్‌గా ఉన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికే కొందరు అధికారులు జగన్నాథ్ ఇంటికి వచ్చారు. దాంతో తన కుమారుడికి ఏదో చెడు జరిగిందని ఆయన మనసు కీడు శంకించింది. కానీ అప్పటికే అంతా జరిగిపో యిందని ఆయన కన్నీరుమున్నీరయ్యారు. కుమారుడి మృతదేహం భారత్‌కు ఎప్పుడు తీసుకువస్తారనే దానిపై ఆ అధికారులు స్పష్టత ఇవ్వలేదని, అక్కడ అధికారిక ప్రక్రియలు పూర్తిచేసేందుకు రెండు రోజుల సమయం పట్టవచ్చని ఆయన విలపించారు. ఎయిర్‌షోలో తన విన్యాసాలను టివి, యూట్యూబ్‌లో చూడమని వెళ్లేముందు నమాంశ్ చెప్పాడని గుర్తుచేసుకున్నారు. నమాంశ్ తెలివైనవాడు. తన ఆలోచనలు ఎప్పుడూ గొప్పగా ఉండేవి. హిమాచల్ ప్రదేశ్‌లోని ఆర్మీ పబ్లిక్ స్కూల్, సైనిక్ స్కూల్‌లో చదువుకున్నాడు. 2009లో ఎన్‌డిఎ పరీక్షలను క్లియర్‌చేసి విధుల్లో చేరాడు. నమాంశ్ భార్య ప్రస్తుతం కోల్‌కతాలో శిక్షణ పొందుతున్నారు. దుబాయ్ ఎయిర్‌షోలో నేల నుంచి తక్కువ ఎత్తులో విన్యాసాలు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

# 'ఓట్ చోరీ'పై కాంగ్రెస్ భారీ ర్యాలీ

## వచ్చే 14న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో నిర్వహణ



**న్యూఢిల్లీ, నవంబరు 22:** ఎన్నికలు ఏవైనా ఓట్ల చోరీతోనే బిజెపి అధికారంలోకి వస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను పరిహసిస్తోందని కొద్దికాలంగా ఎడతెగని విమర్శలు కురిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ తన వాదనను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు పట్టుదలగా ఉంది. ఇందులో భాగంగా 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో డిసెంబరు 14న భారీ ర్యాలీ నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంతకాల సేకరణను ఈ సభలో హైలైట్ చేయనుంది. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ ఈ ర్యాలీలో పాల్గొంటారు. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారతదేశ ప్రజాస్వామ్యాన్ని విడిపించేందుకు జరుపుతున్న పోరాటానికి ఇది ఆరంభమని కాంగ్రెస్ చెబుతోంది. కాంగ్రెస్ 'మహా ర్యాలీ' వివరాలను పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ వివరిస్తూ, వచ్చే నెల 14వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రస్తుత తరుణంలో ప్రజాస్వామ్యాన్ని కమ్మేస్తున్న అతిపెద్ద ప్రమాదం ఓట్ చోరీ అని, దేశ రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా రామ్‌లీలా నుంచి గట్టి సందేశాన్ని ప్రజల్లోకి పంపుతామని తెలిపారు. 'బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, పెద్ద ఎత్తున ఎన్నికల జాబితాల్లో అవకతవకలకు పాల్పడటం వంటి దుష్ట పన్నాగాలకు బిజెపి-ఇసిఐ పాల్పడుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా కోట్లాది మంది సంతకాలు మాకు అందాయి. నిబంధనలను ఇసిఐ ఏ విధంగా తుంగలో తొక్కుతోందో, ఎంసిసి ఉల్లంఘనలను బేఖాతరు చేస్తోందో, పట్టపగలే డబ్బులు పంచుతూ బిజెపి రిగ్గింగ్‌కు పాల్పడుతుంటే ఏవిధంగా సహకరిస్తోందో ప్రజలందరికీ తెలుసు' అని కెసి వేణుగోపాల్ విమర్శించారు. నిష్పాక్షికంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ ఇప్పుడు వివక్షాపూరితంగా వ్యవహరిస్తూ ఎన్నికల వ్యవస్థను కళ్ల ముందే ధ్వంసం చేస్తుంటే తాము చూస్తూ ఊరుకోలేమని చెప్పారు. బీహార్ ఎన్నికల ఫలితాల తర్వాత జరిపిన సమీక్షా సమావేశంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించాలనే నిర్ణయం కాంగ్రెస్ పార్టీ తీసుకుందన్నారు. బీహార్ ఫలితాలకు ఓట్ చోరీనే కారణమన్నారు. ఇందుకు ప్రధాని, హోం మంత్రి, ఎన్నికల కమిషన్ కలిసి భారీ వ్యూహం పన్నాయని ఆరోపించారు.

కాగా, ఓట్ చోరీపై రాహుల్‌గాంధీ గత ఆగస్టులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశానంతరం కాంగ్రెస్ పార్టీ సెప్టెంబరు నుంచి సంతకాల ఉద్యమం ప్రారంభించింది. కర్ణాటక కాంగ్రెస్ 1.12 కోట్ల సంతకాలు సేకరించగా, పంజాబ్ యూనిట్ 27 లక్షల సంతకాలను సేకరించి పార్టీ అధిష్ఠానానికి అందజేసింది. ఇతర రాష్ట్రాల్లో సైతం కాంగ్రెస్ విభాగాలు సంతకాల సేకరణ జరిపాయి.

# నోబెల్‌పురస్కారం అందుకోవాలన్నా అన్నీ సమస్యలే..



**కారకాస్, నవంబరు 22:** వెనెజులా ప్రతిపక్ష నేత మరియా కొరీనా మచాడోను ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక బహుమతి నోబెల్ శాంతి పురస్కారం వరించిన సంగతి తెలిసిందే. ఈ పురస్కారాన్ని అందుకోవడంలో మరియా కొత్త చిక్కులను ఎదుర్కొంటున్నారు. నోబెల్ పురస్కారాలను డిసెంబర్ 10న నార్వేలోని ఓస్లోలో ప్రధానం చేయనున్నారు. ఈ వేడుకకు హాజరయ్యే విషయంలో మరియాకు ఇబ్బందులు తప్పడంలేదు. వెనెజులా ప్రభుత్వ ఆంక్షల కారణంగా ప్రస్తుతం ఆమె అజ్ఞాతంలో ఉన్నారు. నోబెల్ అందుకోవడానికి నార్వేకు వెళితే మరియాను పరారీలో ఉన్న నేరస్థురాలిగా ప్రకటిస్తామని తాజాగా వెనెజువెలా అటార్నీ జనరల్ ప్రకటించారు. దేశాధ్యక్షుడిపై ప్రజల్లో విద్వేషాన్ని ప్రేరేపించడం, ప్రభుత్వంపై కుట్ర, ఉగ్రవాదం సహా పలు ఆరోపణలు మరియాపై ఉన్నాయి.

# జి20 సమ్మిట్‌లో ప్రధాని మోడీ, ఇటలీ ప్రధాని మెలోనీ

**న్యూఢిల్లీ, నవంబరు 22:** భారత్, ఇటలీ ప్రధానులు నరేంద్రమోడీ, జార్జియా మెలోనీ మంచి స్నేహితులు. అంతర్జాతీయ వేదికలపై వారిద్దరూ కలుసుకొన్నప్పుడు ఒకరినొకరు ఆత్మీకంగా పలకరించుకుంటుంటారు. ఆయా సందర్భాలకు సంబంధించిన దృశ్యాలు మెలోనీ పేరుతో వైరల్ అవుతుంటాయి. దక్షిణాఫ్రికాలోని జొహెన్నెస్‌బర్గ్‌లో శనివారం జరిగిన జి20 దేశాల 20వ శిఖరాగ్ర సదస్సుకు ప్రపంచ దేశాల అధినేతలు హాజరయ్యారు. సమావేశంలో పాల్గొనడానికి ముందు మోడీ, మెలోనీ ఎదురుపడడంతో వారు చిరునవ్వులు చిందిస్తూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. 2023 డిసెంబర్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయ్ వేదికగా జరిగిన 'కాప్28' సదస్సు సందర్భంగా మొదటిసారి మోడీ, మెలోనీ సెల్ఫీ వైరల్ అయింది. మోడీతో తీసుకున్న స్వీయ చిత్రాన్ని మెలోనీ ఎక్స్‌లో షేర్ చేశారు. సదస్సుకు ముందు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా చేతులు జోడించి



మోడీకి నమస్కరిస్తూ స్వాగతం పలికారు. జి7 సదస్సులో భాగంగా ప్రధాని మోడీ వరుస ద్వైపాక్షిక భేటీలతో బిజీబిజీగా గడిపారు. చైనా, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడా, జర్మనీ, జపాన్, ఆస్ట్రేలియా సహా పలు దేశాల అధినేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. మోడీ ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో రక్షణ, అణుఇంధనం సహా పలు రంగాల్లో పరస్పర సహకారం పెంపుపై చర్చించినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది.

# పాక్‌లో మనీలాండరింగ్ అవినీతి ఎక్కువే..

## ఐఎంఎఫ్ సంచలన నివేదిక విడుదల




**కరాచి, నవంబరు 22:** పాకిస్థాన్‌లో అవినీతి సంబంధిత మనీ లాండరింగ్ ప్రమాదం అత్యంత తీవ్ర స్థాయిలో ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) హెచ్చరించింది. దేశంలో జవాబుదారీతనం బలహీనంగా ఉండటం, దర్యాప్తు సంస్థల పనిలో తరచూ రాజకీయ జోక్యం జరగడమే ఈ దుస్థితికి ప్రధాన కారణాలని స్పష్టం చేసింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ నవంబర్ 19న విడుదల చేసిన గవర్నెన్స్ అండ్ కరప్షన్ డయాగ్నస్టిక్ నివేదికలో ఐఎంఎఫ్ వెల్లడించింది. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, ప్రభుత్వ కొనుగోళ్లు వంటివి మనీ లాండరింగ్‌కు అత్యంత ప్రమాదకర రంగాలుగా ఉన్నాయి. ముఖ్యంగా రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తులతో ముడిపడిన కార్యకలాపాల్లో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉందని తెలిపింది. డొల్ల కంపెనీలు, కార్పొరేట్ వ్యవస్థల దుర్వినియోగం, అనధికారిక నగదు బదిలీ మార్గాల ద్వారా అవినీతి సొమ్మును దాస్తున్నారని వివరించింది. న్యాయవ్యవస్థలో జాప్యం, సుదీర్ఘ విచారణలు, తక్కువ శిక్షల రేటు వల్ల మనీ లాండరింగ్ నిరోధక చట్టాల అమలు నీరుగారిపోతోందని అభిప్రాయపడింది. అయితే, దేశంలో మారుతున్న పరిస్థితులను కూడా ఐఎంఎఫ్ ప్రస్తావించింది. పాక్ జనాభాలో 60 శాతానికి పైగా 30 ఏళ్లలోపు యువతే ఉండటం, వారు అవినీతిని ఏమాత్రం సహించకపోవడంతో జవాబుదారీతనం కోసం డిమాండ్ పెరుగుతోందని పేర్కొంది. ఈ ఒత్తిడి కారణంగా రాజకీయ నాయకులు కూడా అవినీతిని అరికట్టాల్సిన అవసరాన్ని గుర్తిస్తున్నారని తెలిపింది. పాకిస్థాన్‌లోని నేషనల్ అకౌంటబిలిటీ బ్యూరో వంటి దర్యాప్తు సంస్థల పనితీరులో తీవ్ర లోపాలు ఉన్నాయని ఐఎంఎఫ్ ఎత్తిచూపింది. అవినీతి ఫిర్యాదులపై అధికారిక విచారణ ప్రారంభించడానికే సుమారు నాలుగు నెలల సమయం పడుతోందని, చాలా ఫిర్యాదులు మధ్యలోనే ఆగిపోతున్నాయని తెలిపింది. 2023-24లో 17 బ్యాంకులపై రూ.944 మిలియన్ల జరిమానాలు విధించినప్పటికీ, రాజకీయ సంబంధాలున్న కేసుల్లో దర్యాప్తు పక్షపాతంగా జరుగుతోందనే ఆందోళనలు ఉన్నాయని ఐఎంఎఫ్ స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయ లోపం, పారదర్శకత లేకపోవడం వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొంది.

# సంక్షిప్తంగా..

## అణుదాడిని తట్టుకునే ఫ్లోటింగ్ ఐలాండ్ నిర్మిస్తున్న చైనా



**బీజింగ్, నవంబరు 22:** అణ్వస్త్ర దాడిని తట్టుకుని నిలిచే తేలియాడే కృత్రిమ దీవిని చైనా నిర్మిస్తున్నట్లు తెలుస్తున్నది. దీనిని మెగా సైన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అని చైనా ప్రభుత్వ పరిశోధకులు చెపుతున్నారు. ఈ 78,000 టన్నుల బరువైన సెమీ సబ్‌మెర్సిబుల్ ట్విన్ హాల్ ప్లాట్‌ఫామ్ ప్రపంచంలో మొదటి సంచార, స్వయం సమృద్ధ కృత్రిమ దీవి. ఈ ప్రాజెక్టు సారథి, అకడమీషియన్ లిన్ ఝోంగ్‌కిన్ మాట్లాడుతూ, 2028 నాటికి ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాలంతో పరుగులు పెడుతున్నామన్నారు. దీనిలో 238 మంది 4 నెలలపాటు బస చేయగలరు. విధ్వంసకరమైన ప్రకంపణలను తట్టుకునేలా మెటా మెటీరియల్ శాండ్‌విచ్ ప్యానెల్స్‌తో దీనిని రూపొందిస్తారు. దీనిలో అత్యవసర విద్యుత్, కమ్యూనికేషన్స్, నేవిగేషన్ కంట్రోల్ వంటివి ఉంటాయి.

## జీన్స్‌తో వచ్చి ప్రమాణ స్వీకారం చేసిన యువ మంత్రి


**పాట్నా, నవంబరు 22:** బీహార్ ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రుల ప్రమాణస్వీకారోత్సవంలో ఒక యువమంత్రి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఉన్నత విద్యావంతుడయిన దీపక్‌ప్రకాష్ క్యాజువల్ జీన్స్, షర్ట్‌లో వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి మంత్రిగా ప్రమాణం చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కూడా చేయని ఈ యువకుడు ఎవరంటూ సోషల్ మీడియాలో ఒక్కసారిగా చర్చ మొదలైంది. ఆ ఎమ్మెల్యే పేరు దీపక్ ప్రకాశ్ (36). ఎన్డీయే భాగస్వామ్య పక్షమైన రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం) అధినేత, రాజ్యసభ ఎంపీ



ఉపేంద్ర కుష్వాహా కుమారుడే ఈయన. దీపక్ తల్లి స్నేహలతా కుష్వాహా ససారం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆర్‌ఎల్‌ఎం పార్టీకి కేటాయించిన ఏకైక మంత్రి పదవిని, ఎమ్మెల్యేగా గెలిచిన తన తల్లికి బదులుగా దీపక్ దక్కించుకోవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

# కాలేయ మార్పిడిలో ప్రపంచానికి భారత్ మార్గదర్శి

## కాలేయమార్పిడి సొసైటీ వార్షిక సదస్సులో వైద్యనిపుణులు



**న్యూఢిల్లీ, నవంబరు 22:** కాలేయ మార్పిడి (లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్) శస్త్రచికిత్సల్లో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని వైద్య నిపుణులు ప్రశంసించారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యంత నైపుణ్యం కలిగిన సర్జన్లు, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థల వల్లే ఇది సాధ్యమైందని వారు స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలో ప్రారంభమైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక సదస్సులో నిపుణులు ఈ అభిప్రాయాలను పంచుకున్నారు. గ్లోబల్ అబ్జర్వేటరీ ఆన్ ఆర్గాన్ డొనేషన్ అండ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ , నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ గణాంకాల ప్రకారం 2024లో భారతదేశంలో సుమారు 5,000 కాలేయ మార్పిడి ఆపరేషన్లు జరిగాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 200కు పైగా క్రియాశీల లివర్ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ సందర్భంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా కాబోయే అధ్యక్షుడు డాక్టర్ అభిదీప్ చౌదరి మాట్లాడుతూ భారత్‌లో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ వ్యవస్థ అనేది విజ్ఞానం, నైతికత, మానవత్వం మధ్య సంపూర్ణ సమన్వయాన్ని సూచిస్తుంది. ఇక్కడి ప్రతి విజయం వెనుక కఠినమైన ప్రోటోకాల్స్, పారదర్శక దాతల ఎంపిక విధానం, వైద్యుల నిబద్ధత ఉన్నాయి. కేవలం సంఖ్యలోనే కాకుండా కరుణ, జవాబుదారీతనం వంటి విలువలతో కూడిన ప్రక్రియ భారత్‌ను ప్రత్యేకంగా నిలుపుతోందని వివరించారు. ప్రపంచంలోనే జీవించి ఉన్న దాతల నుంచి కాలేయ మార్పిడి సర్జరీలు అత్యధికంగా చేసే దేశం భారత్ అని నిపుణులు తెలిపారు. ఇక్కడ దాత, గ్రహీత ఇద్దరి భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, పారదర్శకమైన, చట్టబద్ధమైన ప్రక్రియను అనుసరిస్తున్నారు. దాతలు సాధారణంగా దగ్గరి బంధువులే ఉంటారు. ప్రతి కేసును వైద్య, మానసిక, నైతిక కోణాల్లో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తారు. ఈ కఠిన నిబంధనల వల్లే అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా, కొన్నిసార్లు వారికంటే మెరుగైన సక్సెస్ రేటును భారత్ సాధిస్తోంది. ఇంటర్నేషనల్ లివింగ్ డోనర్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మొహమ్మద్ రెలా మాట్లాడుతూ భారత ఎల్‌డీఎల్‌టీ నమూనా ప్రపంచానికే ఒక బంగారు ప్రమాణంగా నిలిచింది. మా అనుభవాలను పంచుకోవడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను అందరికీ సురక్షితంగా, అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని అన్నారు. రేపటి వరకు జరగనున్న ఈ సదస్సుకు 20కి పైగా దేశాల నుంచి వెయ్యి మందికి పైగా నిపుణులు, పరిశోధకులు హాజరయ్యారు.

## హిందూ సమాజం లేకుంటే ప్రపంచమే ఉనికి కోల్పోతుంది..

### ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్‌భగవత్

**ఇంఫాల్, నవంబరు 22:** ప్రపంచాన్ని నిలబెట్టడంలో హిందూ సమాజం కీలకపాత్ర పోషిస్తోందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు. హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచానికే ఉనికి ఉండదని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రతి దేశం అన్ని రకాల పరిస్థితులను చూసిందని, యునాన్ (గ్రీస్) మిస్ర్ (ఈజిప్టు), రోమ్ వంటి సామ్రాజ్యాలు, నాగరికతలు కనుమరుగైనా హిందూ సమాజం చెక్కు చెదరలేదని చెప్పారు. జాతుల మధ్య ఘర్షణలతో ఇటీవల కాలంలో అట్టుడికిన మణిపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ భాగవత్ మాట్లాడుతూ, హిందూ సమాజం ధర్మానికి ప్రపంచ సంరక్షుడిగా ఉందన్నారు. భారత్ అంటే అమర నాగరికతకు పేరని, సమాజంలో అలాంటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నందునే హిందూ కమ్యూనిటీ చెక్కుచెదరకుండా ఉందని, హిందువులు ఉనికి కోల్పోతే ప్రపంచమే ఉనికి కోల్పోతుందని అన్నారు. ఇండియాలో ఉన్నవారంతా హిందువులేనని, హిందూ వారసత్వానికి చెందినవారే ముస్లింలు, క్రిస్టియన్లని చెప్పారు. దేశ పటిష్టతకు ఆర్థిక స్వావలంభన చాలా ముఖ్యమనిమోహన్ భాగవత్ అన్నారు. దేశ నిర్మాణంలో మిలటరీ సామర్థం, నాలెడ్జ్ కెపాసిటీకి సమ ప్రాధాన్యత ఉందని చెప్పారు. దేశ నిర్మాణం జరగలాంటే బలం కావాలని, బలం అంటే ఆర్థిక సామర్థ్యమని చెప్పారు.ఆధిపత్యం అనే పదానికి ఒక్కోసారి విపరీత అర్థం వస్తుందన్నారు. అయితే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎవరిపైనా ఆధారపడకూడదన్నారు. నక్సలిజం తగ్గుముఖం పట్టడంపై మాట్లాడుతూ, నక్సలిజాన్ని ఇంకెంత మాత్రంసహించేది లేదని సమాజం నిర్ణయించుకోవడమే ఇందుకు కారణమని అన్నారు.



# అయ్యప్ప దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు

## టికెట్ల జారీలో ఆంక్షలపై భక్తుల్లో నిరసన వెల్లువ

**పతనంతిట్ట(కేరళ), నవంబరు 22:** మండల మకరు విళక్కు పూజల కోసం తెరిచిన శబరిమల అయ్యప్ప స్వామి దర్శనాల కోసం భక్తులు పోటెత్తారు. దీంతో సన్నిధానం నుంచి పంబ వరకూ క్యూలైన్ నిలిచిపోయింది. సౌకర్యాలు కూడా అంతంతమాత్రంగా ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై కేరళ హైకోర్టు జోక్యం చేసుకోవడంతో అధికారులు చర్యలు చేపట్టి, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. స్పాట్ బుకింగ్ టిక్కెట్ల కోటాను 5 వేలకు తగ్గించడం సహా పలు ఆంక్షలు విధించారు. అలాగే, నిలక్కల్, వండిపెరియార్ వద్ద మాత్రమే స్పాట్ బుకింగ్ టిక్కెట్లను జారీచేస్తున్నారు.



పంపా, ఎరుమేలి, చెంగనూరు లోని బుకింగ్ సెంటర్లను తాత్కాలికంగా నిలిపివేశారు. వర్చువల్ క్యూ దర్శనం టిక్కెట్లను ఆన్‌లైన్‌లో భక్తులు బుక్ చేసుకోవాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు విజ్ఞప్తి చేసింది. శబరిమలలో పరిస్థితులు, టీడీబీ చేపట్టిన చర్యలపై కేరళ హైకోర్టు తీవ్ర విమర్శలు గుప్పించింది. నవంబరు 17 నుంచి శబరిమలలో దర్శనాలకు అనుమతించగా.. 48 గంటల్లోనే 2 లక్షల మంది భక్తులు తరలివచ్చారు. దీంతో భక్తులను నియంత్రించలేక అధికారులు చేతులెత్తేశారు. క్యూలైన్‌లో ఓ మహిళా భక్తురాలు చనిపోయిన సంగతి తెలిసిందే. నిలక్కల్‌లో అర్ధరాత్రి తర్వాత స్పాట్ బుకింగ్‌లు నిలిపివేయడంతో భక్తులు నిరసనకు దిగారు. ఆకస్మిక ఆంక్షలతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు గందరగోళానికి గురయ్యారు. స్పాట్ బుకింగ్‌లపై కేరళ హైకోర్టు ఆంక్షల గురించి తెలియక నిలక్కల్, పంపా వద్ద భారీగా భక్తులు బారులు తీరారు. బుకింగ్ మొదలైన కొద్ది సమయంలో టోకెన్ల కోటా పూర్తికావడంతో టిక్కెట్ దొరక్క వందల మంది నిరాశకు గురయ్యారు. శబరిమల వెళ్లేందుకు అనుమతించకపోవడంతో క్షేత్రస్థాయి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు కొత్త నిబంధనల గురించి వివరించేందుకు సిబ్బంది నానా తంటాలు పడ్డారు. శబరిమల ఏడీఎం అరుణ్ ఎస్ నాయర్ మాట్లాడుతూ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా నియంత్రణలోకి వచ్చిందన్నారు.

## ఢిల్లీ పేలుడు కేసులో కాశ్మీర్‌నుంచి మరొకరి అరెస్టు



**న్యూఢిల్లీ, నవంబరు 22:** ఢిల్లీ ఎర్రకోటవద్ద జరిగిన కారుబాంబు పేలుడుకేసులో జమ్ముకాశ్మీర్ దర్యాప్తుసంస్థ ఎస్ఐఎ, ఎస్ఒజి శనివారం మరొకరిని అరెస్టుచేసింది. పుల్వామా నివాసి అయిన తుఫైల్ అహ్మద్‌ను దర్యాప్తుదళాలు అదుపులోకి తీసుకున్నాయి. ఒక పారిశ్రామిక ఎస్టేట్‌లో పని చేసే ఎలక్ట్రీషియన్ అయిన తుఫైల్‌ను ప్రస్తుతం పోలీసులు ఇంటరాగేషన్ చేస్తున్నారు. తుఫైల పాత్ర గతంలో తాము విశ్వసించిన స్థాయికంటే విస్తృతంగా ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని దర్యాప్తు బృందాలు పేర్కొంటున్నాయి. తుఫైల్‌కు ఉన్న సంబంధాలు, ఢిల్లీ కారుబాంబుదాడిలో పాత్ర ఎంతమేరకుందన్న అంశంపై దర్యాప్తు చేస్తున్నాయి. ఈ మొత్తం కుట్రలో భాగం ఉన్న అందరినీ ఛేదించాలనే ఈ దర్యాప్తుసాగుతున్నది.

## రెండేళ్లక్రితమే ఉగ్ర కుట్రలకు బీజం..

**న్యూఢిల్లీ, నవంబరు 22:** దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు కేసుకు సంబంధించి దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇది కేవలం ఒక్క నగరానికి పరిమితమైన దాడి కాదని, దేశవ్యాప్తంగా పలు నగరాల్లో సిరియల్ పేలుళ్లకు జైషే మహ్మద్‌తో సంబంధమున్న ఓ వైట్ కాలర్ ఉగ్రవాద ముఠా భారీ కుట్ర పన్నినట్లు తేలింది. ఈ కుట్రకు 2023లోనే బీజం పడిందని నిందితుల్లో ఒకరు విచారణలో అంగీకరించినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ నెల 10న ఎర్రకోట సమీపంలో ఓ కారులో జరిగిన పేలుడులో 13 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే, ఇది ఉగ్రవాదులు భయంతో ముందుగానే పేల్చేయడం వల్ల జరిగిందని, అసలు ప్రణాళిక మరింత పెద్దదని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఆత్మాహుతి బాంబర్ ఉమర్ మహ్మద్ సహచరుడైన డాక్టర్ ముజమ్మిల్ షకీల్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) విచారించగా కీలక వివరాలు వెల్లడయ్యాయి.



# శాంతికి బ్రాండ్ అంబాసిడర్ సత్యసాయి

## - బాబా సిద్ధాంతాల్ని సర్వవ్యాప్తం చేయాలి - ముఖ్యమంత్రి చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**సత్యసాయి జిల్లా, నవంబర్ 22, ప్రభాత వార్త ప్రతినిధి :** భగవాన్ సత్యసాయి బాబా శాంతికి బ్రాండ్ అంబాసిడర్ గా నిలుస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. భగవాన్ సత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో కలిసి శనివారం ఉదయం ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్య సాయిబాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రి నారాలోకేష్‌తో పాటు ఆయా శాఖల మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు బాబా మహాసమాధినిదర్శించుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సత్యసాయి బాబా చెప్పిన సిద్ధాంతాలు సూత్రాలను పాటిస్తే ప్రపంచం శాంతియుతంగా ఉంటుందన్నారు. సత్యసాయి సాయిబాబా సిద్ధాంతాన్ని సర్వత్రా వ్యాపితం చేసేలా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. " అందరినీ ప్రేమించు - అందరినీ సేవించు" (లవ్ ఆల్ - సర్వ్ ఆల్), "ఎప్పుడూ సేవ చేస్తూనే ఉండాలి - ఎవ్వరిని నొప్పించకూడదు" (హెల్ప్ ఎవర్ - హర్ట్ నెవర్) అనేది సత్యసాయిబాబా సిద్ధాంతం అనీ , సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా అనేది సత్య సాయి బాబా ప్రవచించిన ఐదు సూత్రాలు గా అభి వర్ణించారు. ఆంధ్రా, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రా ల్లో తాగు నీటి సౌక ర్యాన్ని కల్పించారనీ, సత్యసాయి బాబాతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తాగు నీటి ప్రాజెక్టు కోసం అవసరమైతే ప్రశాంతి నిలయాన్ని తాకట్టు పెట్టాలని సత్యసాయి బాబా భావించారనీ, కానీ ఆయన అభిప్రాయాన్ని తెలుసుకున్న భక్తులు, విరాళాలు సేకరించి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడం జరిగిందన్నారు.

# భారత రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతులకు ఘనస్వాగతం

**పుట్టపర్తి , నవంబర్ 22, ప్రభాతవార్త :**భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతోత్సవాలలో పాల్గొనేందుకు శనివారం ఉదయం పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మధ్యాహ్నం సత్యసాయి యూనివర్శిటీ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఉప రాష్ట్ర పతి సి.పి.రాధాకృష్ణన్‌లకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, హిందూపురం ఎంపీ బికే. పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, 13వ జాతీయ నెహ్రూ యువ కేంద్రం వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, సీసీఎల్‌ఏ స్పెషల్ సిఎస్ జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, డిఐజి షిమోషీ, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అలాగే రాష్ట్ర పతి, ఉపరాష్ట్రపతులు తిరుగు ప్రయాణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రిలోకేష్‌తో పాటు మంత్రు లు, ఎమ్మెల్యేలు, కలెక్టర్, డిఐజి, ఎస్పి, అధికారులు వీడ్కోలు పలికారు.

## నిరుద్యోగ భృతి ఇవ్వండి - మంత్రి నారా లోకేష్ కు ఎఐవైఎఫ్ వినతి

**విజయవాడ,నవంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్నికల వాగ్దానాల ప్రకారం నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి రూ.3000 ఇవ్వాలని జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మొజ్జడ యుగంధర్ పరుచూరి రాజేంద్ర రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి లోకేష్‌ను కలిసి పత్రం అందజేశారు.

## సత్యసాయి విద్యార్థులు విశిష్ట విద్యా విధానానికి ప్రతిరూపాలు : ముఖ్యమంత్రి చంద్రబాబు



ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు జ్ఞాపిక అందిస్తున్న ఆర్.జె.రత్నాకర్

**పుట్టపర్తి, నవంబర్ 22, ప్రభాత వార్త:** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా యూనివర్సిటీ విద్యార్థులు బాబా విశిష్ట విద్య విధానానికి ప్రతిరూపాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ శతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, విలువల ఆధారిత, వ్యక్తిత్వ నిర్మాణమే కేంద్రంగా ఉన్న శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ స్నాతకోత్సవానికి హాజరైనందుకు గౌరవంగా ఉందన్నారు. బోధనా మాధ్యమం క్రమశిక్షణ, ప్రేమ అనేవి విద్యార్థులకు ఫస్ట్, సెకండ్, థర్డ్ లాంగ్వేజీలన్నీ సేవే అని సత్య సాయి బాబా చెప్పారని, ఇప్పుడు పట్టభద్రులు అయిన వారంతా నిస్వార్థ సేవ, కరుణ నిజాయితీ అనే విలువలను ఆచరించాలన్నారు. భారతదేశం వేల సంవత్సరాలుగా తన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రపంచంతో పంచుకుంటోందన్నారు. "వసుధైక కుటుంబకం" అనేది శాశ్వత సందేశం, మన సంస్కృతికి గుండె వంటిదన్నారు. సత్యసాయి యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆర్ట్స్ వంటి రంగాల్లో నైపుణ్యంతో పాటు, సామాజికంగా ఉపయోగపడే పరిశోధనలపై ఇక్కడ బలమైన ప్రాధాన్యత ఉందన్నారు. సాయి సిద్ధాంతాన్ని, సూత్రాల ద్వారా అత్యుత్తమ యువ మేధావులను తీర్చి దిద్దుతున్నారన్నారు. 21వ శతాబ్దం భారతదేశానిదనీ, అధిక జనాభా వల్ల ప్రయోజనాలు కలుగుతున్నాయన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బలమైన నాయకత్వం మనకు ఉందనీ, ఈ అనుకూలతలన్నీ సద్వినియోగం చేసుకోవడం ద్వారా దేశం 10వ స్థానం నుంచి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి ఉపయోగపడిందన్నారు. 2047 నాటికి మనం ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా అవతరిస్తామన్నారు. దీనిని సాధించడానికి మనం భవిష్యత్తు రంగాలు అయిన ఏఐ , డేటా సెంటర్లు, క్వాంటం, ఏరో స్పేస్, డ్రోన్, అంతరిక్షం, సెమీకండక్టర్, రక్షణ రంగాలలోని పెట్టుబడులపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. సీఐఐ సదస్సులో రూ. 13.25 లక్షల పెట్టుబడులు తెచ్చామని, 16 లక్షల ఉద్యోగాలు రానున్నాయన్నారు. డేటా సెంటర్ కోసం 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులను గూగుల్ పెట్టనుందనీ, వినూత్న ఆలోచనలకు వేదికగా ఆర్టీఐహెచ్ ఉందన్నారు. దేశంలో తెలు గు వాళ్లు నెంబర్1గా ఉండేలా పనిచేస్తున్నామన్నారు.



## ప్రపంచ తెలుగు మహా సభలకు సిఎం చంద్రబాబుకు ఆహ్వానం

**విజయవాడ,నవంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరులో 2026 జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు మూడో ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించనున్నారు. అమరావతి శ్రీసత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణం(హైవే)లోని నందమూరి తారక రామారావు వేదికపై జనవరి 3న ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ సభ జరుగనుంది. ఈ నేపథ్యంలో ఏపీ సిఎం చంద్రబాబు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ కలిశారు. ఈ కార్యక్రమానికి సతీసమేతంగా ముఖ్య అతిథిగా విచ్చేయాలని చంద్రబాబును కోరారు. ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని, మాతృ భాషా వికాసం కోసం ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేయాలని అన్నారని తెలుగు మహా సభల ముఖ్య సమన్వయకర్తలు పి.రామ చంద్ర రాజు,వాసిరెడ్డి విద్యాసాగర్‌లు తెలిపారు.

## అరటి మార్కెట్ ధరపై రాష్ట్రస్థాయి సమావేశం

**సచివాలయం,నవంబర్ 22,ప్రభాతవార్త :** అరటిపంట మార్కెట్ విషయంలో వచ్చిన సంక్షోభం మీద రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ అన్ని దళారి కంపెనీ ప్రతినిధులతో అంతర్జాల సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో ముఖ్యంగా ఎస్‌కె బనానా, ఐఎన్ఐ,నోవా,శాంద్రీయా విగ్రో,బందన్ కంపెనీ ప్రతినిధులు మరియు ఉద్యాన శాఖ అధికారులు పాల్గొన్నారు.అరటిలో నాణ్యత ఉన్న పంట రూ.7.50నుంచి 8.00ల రైతుల నుండి తీసుకోవడం జరుగుతుందని కంపెనీ ప్రతినిధులు తెలపడం జరిగింది.నాణ్యత పెరిగితే దూర ప్రాంతాలకు ఎక్కువ సరుకును మార్కెట్ చేసుకోవడానికి అవకాశమందదన్నారు.

# హైకోర్టు ఆదేశాలతో పరకామణి కేసులో రిట్‌పిటిషనర్‌కి పోలీసుభద్రత


## - నిందితుడి ఆస్తులపై సిఐడి లోతైన దర్యాప్తు

**తిరుపతి,నవంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించే కానుకలను లెక్కించే పరకామణి భవనంనుండి 2023లో 920 అమెరికన్ డాలర్లు చోరీ కేసులో సమగ్ర దర్యాప్తు చేయాలని కోరుతూ హైకోర్టులో రిట్‌పిటిషన్ వేసిన శ్రీనివాసులకు పోలీసు భద్రత కల్పించింది. అతను నివాసముంటున్న అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాధవనగర్‌లో ఆయన ఇంటి వద్దకు శనివారం అలిపిరి పోలీసులు వెళ్ళారు. అతనితో మాట్లాడి హైకోర్టు ఆదేశాలతో పోలీసు భద్రత విషయం తెలిపారు. అతని ఇంటి వద్ద రక్షక్, బ్లూకోల్ట్స్ పోలీసులతో నిఘా ఉంటుందని, అతని ఇంటికి ఉన్న సిసికెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. శ్రీనివాసులు ఇంటికి చేరుకుని అలిపిరి పోలీసులు సమాచారం తెలియజేశారు.

ఏదేని అనుమానాస్పద వివరాలు తెలిసినా, ఫోన్‌చేస్తే 24గంటలూ స్పందించి తగిన రక్షణ కల్పిస్తామని అలిపిరి సిఐ రామకిశోర్ సిబ్బంది ద్వారా సూచించారు. ఇప్పటికే సంచలనం కలిగించిన ఈ కేసులో కీలకఫిర్యాదిదారుడు టిటిడి పూర్వఏవిఎస్‌ఓ వై.సతీశ్‌కుమార్ అనుమానాస్పదంగా ప్రాణాలు కోల్పోయిన ఘటన జరిగింది. అయితే తాడిపత్రి పోలీసులు హత్యకేసుగానమోదు చేయడంతో హైకోర్టు ఆందోళన చెందింది. దీంతో సాక్షులకు,రిట్‌పిటిషనర్‌కు భద్రత కల్పించాలని, ఈ కేసు విచారణ ముగిసేవరకు వారికి రక్షణ ఉండాలని ఆదేశించిన విషయం విదితమే. ఈ కేసుపై సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్ బృందం లోతుగా అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తోంది.

# ఆర్థిక పటిష్టత ఉంటేనే సాంస్కృతిక అభివృద్ధి

## అసెంబ్లీ ప్యానెల్ స్పీకర్, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్



జ్యోతి ప్రజ్వలనతో రెండు రోజుల జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ చిత్రంలో కలిమిశ్రీతదితరులు

**విజయవాడ,నవంబరు 22,ప్రభాత వార్తప్రతినిధి:** ఏ దైశమైతే ఆర్థికంగా పటిష్టంగా ఉంటుందో అక్కడ, కళ సాంస్కృతిక రంగాలు వర్ధిల్లుతాయని ఏపీ శాసనసభ ప్యానెల్ స్పీకరు,అధికారభాషా సంఘం పూర్వాధ్యక్షులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు.గొప్ప సాంస్కృతిక కేంద్ర బిందువైన విజయవాడ నగరం కవులు రచయతలు కళాకారులకు పుట్టినిల్లువంటిదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కూచిపూడి నృత్యం ఉమ్మడి కృష్ణాజిల్లాకు కేంద్ర బిందువుకావడం జ్ఞానపీఠం అవార్డు గ్రహీతలు, గాయక రత్నాలు, ఘన చరిత్ర కలిగిన ఎందరో జానపద కూచిపూడి భరతనాట్య కళాకారులు రచయతలు కవులు సినిరంగ కళాకారులు పుట్టినట్టువంటి గడ్డపై జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించడం గర్వకారణమన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కౌహాన్స్ సంస్థ సహకారంతో విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలను శనివారం అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాదు, జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పోలవరపు సాంస్కృతిక సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణ రావు అధ్యక్షతన జరిగిన సభలో మండలి మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ ఎన్టిటి రామారావు స్ఫూర్తితో రాష్ట్ర ముఖ్యమంత్రి సాంస్కృతిక రంగాన్ని ప్రాధాన్యతనిచ్చి కవులు రచయతలు కళాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సాంస్కృతిక శాఖకు మరిన్ని నిధులను కేటాయించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కళా రంగానికి మరింత వైభవాన్ని తీసుకువచ్చేలా తనవంతు కృషిచేస్తానన్నారు.

## టన్ను అరటి పంటకు రూ.25 వేలు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి - వైఎస్ షర్మిల

**విజయవాడ,నవంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** టన్ను అరటి పంటకు కనీసం రూ.25 వేలు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ధరల పతనంపై వెంటనే సమీక్షించాలని శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గల్ఫ్, యూరప్ దేశాలకు ఎగుమతులు ఎందుకు నిలిచిపోయాయనే విషయాన్ని పరిశీ లించి, తక్షణమే ఎగుమతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్నదాతను అరటి పంట ముంచుతుంటే, వారి ఆక్రందన కూటమి ప్రభుత్వానికి పట్టకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. టన్ను ధర రూ.28 వేల నుంచి రూ.వెయ్యికి పడిపోవడం పరిస్థితికి అద్దం పడుతుందని తెలిపారు.

## దేశ సేవకు అత్యున్నత మార్గం అగ్నివీర్

**విజయవాడ, నవంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** భారత వాయుసేనలో అగ్నివీర్ ద్వారా దేశ సేవకు అత్యున్నత మార్గం అందుబాటులో ఉందని.. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య శనివారం ఓ ప్రకటనలో పిలుపు నిచ్చారు. అగ్నివీర్ ఉద్యోగ అవకాశాలపై ఇప్పటికే లయోలా కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించామని.. భారత వాయుసేన అధికారి వింగ్ కమాండర్ షేక్ యాకూబ్ అలీతో కలిసి అర్హత, ఎంపిక విధానం, దేహదారుఢ్య ప్రమాణాలు తదితర అంశాలను క్షుణ్నంగా వివరించినట్లు తెలిపారు. వివిధ కళాశాలలకు చెందిన దాదాపు 2,500 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నారన్నారు.

## స్టార్ హోటళ్లలోనూ పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించాలి

### ప్రభుత్వానికి హోటళ్ల అసోసియేషన్ విజ్ఞప్తి

**విజయవాడ,. నవంబరు22,ప్రభాతవార్తప్ర తినిధి:** స్టార్ కంటే మించిన హోటళ్ళలో పర్యాటక కార్యకలాపాలకు ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం వెసులుబాట్లు కల్పించాలని రాష్ట్ర స్టార్ హోటళ్ళ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆతిథ్య రంగానికి ప్రోత్సాహంగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోవడంపై అసోసియేషన్ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు. విదేశీ పర్యాటకులను దృష్టిలో పెట్టుకుని ప్రీమియం లిక్కర్,సీజనల్ ఎడిషనల్,అంతర్జాతీయ బ్రాండ్ కోసం సింగిల్ బాటిల్ ఇండెంట్‌లకు స్టార్ హోటళ్ళు అనుమతించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్,ప్రొహిబిషన్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనాకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి అధ్వర్యంలో ప్రతినిథులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు.

## రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో చెత్త నిర్వహణకు రూ.603 కోట్లు విడుదల

**విజయవాడ,నవంబరు 22,ప్రభాత వార్తప్రతినిధి:**రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో చెత్త నిర్వహణకు రూ.603 కోట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీలో భాగంగా విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, వైఎస్ఆర్ కడప, అనంతపురం వంటి చోట్ల ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు.

## రాష్ట్ర ప్రజల సంతోషమే సిఎం చంద్రబాబు లక్ష్యం

### - సిఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి



**కుప్పం, నవంబర్ 22 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలనేదే సిఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం అని సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి,ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా శనివారం తమిళనాడు సరిహద్దుల్లోని కుప్పం గ్రామీణ మండలం పెద్దవంక, నాయనూరు, దాసేగానూరు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించి ప్రజలు, మహిళలనుద్దేశించి ప్రసంగించారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో అభివృద్ధి పాతికేళ్లు వెనక్కు వెళ్లిందని పేర్కొన్నారు. 2014-19వ ధ్య రాష్ట్రానికి చాలా పరిశ్రమలు వచ్చాయని అయితే వైఎస్సార్సీ అరాచకాలతో వెనక్కు వెళ్లిపోయాయన్నారు. వైఎస్సార్సీ పాలనలో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. గంజాయి విచ్చల విడిగా ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళలు అర్ధరాత్రి సమయంలో కూడా ధైర్యంగా ఇంటికి వెళ్తున్నారని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబుపై నమ్మకంతో పారిశ్రామిక వేత్తలు లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారన్నారు. 16లక్షల మందికి ఉద్యోగాల కల్పనకు మౌఖిక ఒప్పందాలు చేసుకున్నారని పేర్కొన్నారు. అమరావతి.. చంద్రబాబు రాజధాని అమరావతి నగరం, వైజాగ్ నగరాలతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని నారా భువనేశ్వరి పేర్కొన్నారు.రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్‌వన్ చేయాలనే దిశగా సిఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నారు.

# తిరుమల సమాచారం

## తిరుమల నుండి తిరుచానూరుకు శ్రీవారి పాదుకలు



**తిరుమల,నవంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి అలంకరించే బంగారుపాదుకలను తిరుమల ఆలయం నుండి దేవేరి తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారికి అలంకరించేందుకు తీసుకెళ్ళారు. శనివారం ఉదయం ఆలయంలో బంగారుపాదాలకు పూజలు నిర్వహించిన అనంతరం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, సివిఎస్‌ఒ మురళీకృష్ణ ,ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్ పాదుకలను ఊరేగింపుగా తీసుకెళ్ళారు. మొదట తిరూచానూరు పసుపుమండపం వద్దకు తీసుకెళ్ళి అక్కడ నుండి మంగళ వాయిద్యాల నడమ ఆలయానికి చేర్చారు. శనివారం రాత్రి జరిగిన పద్మావతిఅమ్మవారి గరుడవాహనసేవలో బంగారు పాదాలను అలంకరించారు.

## వైకుంఠద్వార దర్శనాలకు 27నుండి ఇ డిప్‌లో రిజిస్ట్రేషన్

### - టిటిడి వెబ్‌సైట్, వాట్సాప్,మొబైల్‌యాప్‌ద్వారా బుకింగ్

**తిరుమల,నవంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన ముక్తిమార్గం వైకుంఠద్వార దర్శనాలకు ఈ ఏడాది టిటిడి అమలుచేస్తున్న నూతన విధానంలో ఇ డిప్‌ద్వారా భక్తులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈనెల 27వతేదీ నుండి డిసెంబర్ 1వతేదీ వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. టిటిడి వెబ్‌సైట్‌ను ,వాట్సాప్‌ద్వారా, మొబైల్‌యాప్ ద్వారా భక్తులు వినియోగించుకుని డిసెంబర్ 30,31,జనవరి 1వతేదీల ఉచిత టైమ్‌స్లాట్ సర్వదర్శనాల టోకన్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. డిప్‌కోసం తెలుగు,తమిళం, హిందీ,కన్నడ,ఆంగ్ల భాషల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.డిప్ పద్ధతిలో ఎంపికయిన వారికి డిసెంబర్ 2వతేదీ సెల్‌ఫోన్‌లకు మెసేజ్ వస్తుంది. అ లింక్‌ద్వారా వైకుంఠద్వార దర్శనం టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంది. ఆ మూడురోజులు దర్శన టోకెన్లు ఉన్నవారిని మాత్రమే తిరుమలకు అనుమతించి వైకుంఠద్వార దర్శనానికి పంపుతారు. లేనిభక్తులకు నిరాశే. తిరుమల ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి సామాన్యభక్తులకు టిటిడి అత్యధిక సమయం కేటాయించింది. గతం కంటే భిన్నంగా ఈ ఏడాది ఆఫ్‌లైన్‌లో టోకెన్లు జారీ కౌంటర్‌లను రద్దుచేశారు. రాజ్యాంగపరిధిలోని ప్రముఖులు, ప్రోటోకాల్ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు స్వయంగా వస్తేనే వారికి వైకుంఠద్వార దర్శన టిక్కెట్లు జారీ చేస్తారు. జనవరి 2వతేదీ నుండి 8వరకు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశదర్శనాల టిక్కెట్లురోజుకు 15వేలు, శ్రీవాణి ట్రస్ట్ దర్శనాలు రోజుకు వెయ్యిలెక్కన ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. సిఫార్సు లేఖలు స్వీకరించరు. తిరుపతి,తిరుమలలో ఉంటున్న స్థానికులకు జనవరి 6,7,8తేదీల్లో వైకుంఠద్వార దర్శనాలకు రోజుకు ఐదువేల టోకెన్లు మొదట వచ్చినవారికి మొదట అనే విధానంలో ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీచేస్తారు.జనవరి 2వతేదీ నుండి 8వతేదీ వరకు సాధారణసర్వదర్శనం అమలుచేసి వైకుంఠమ్ 2ద్వారా భక్తులను వైకుంఠద్వార దర్శనాలకు అనుమతించేలా టిటిడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## శ్రీవారి అన్నప్రసాదంపై యాంకర్ శివజ్యోతి వివాదాస్పద వ్యాఖ్యలు - తప్పుపడుతున్న భక్తులు



**తిరుమల,నవంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తులకు ఎంతో పవిత్రంగా, రుచిగా శుచిగా తయారుచేసి అందిస్తున్న అన్నప్రసాదాలస్వీకరణ రిచ్చెస్ట్ బిక్షగాళ్ళుగా యాంకర్ శివజ్యోతి వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.ఇటీవల భర్తతో కలసి దర్శనానికి తిరుమల క్యూలైన్‌లో స్నేహితులతో కలసి వచ్చిన ఆమె శ్రీవారి ప్రసాదాలపై వ్యాఖ్యలు చేయడంవివాదాస్పదంగా మారాయి. బాధ్యతాయుతమైన స్థానంలోఉంటూ ఇలా వ్యాఖ్యానించడం ధార్మిక సంఘాలు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడి ఉండగా టిటిడి సేవకులు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఆ ప్రసాదాలు అందుకున్న శివజ్యోతి ఆమె స్నేహితుడు తిరుమలలో "కాస్ట్లీప్రసాదం అడుక్కుంటున్నాం"రిచ్చెస్ బిక్షగాళ్ళం మేమే అంటూ వ్యాఖ్యానించారు. ఈ ప్రసాదం విషయం పెద్ద దుమారం రేపుతుండటంతో భక్తులు ఆమెపై తీవ్ర ఆగ్రహం చెందారు. ఆమె దేవుని ప్రసాదాన్ని కించపరిచారని, క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

## భక్తి లేకుంటే తిరుమలకు రావద్దు

### విహారయాత్రకు వచ్చినట్లు వ్యవహరించడం మంచిది కాదు

### - శివజ్యోతిపై జనసేననేత కిరణ్‌రాయల్ ఆగ్రహం

**తిరుమల,నవంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమని, ఏడుకొండల వేంకటేశ్వరస్వామి పవిత్రమైన దేవుడని భక్తితో గాకుండా విహారయాత్రకు వచ్చినట్లు భావించడం యాంకర్ శివజ్యోతికి తగదని జనసేన నేత కిరణ్‌రాయల్ సూచించారు. కోట్లరూపాయలు సంపాదించినా దేవుని వద్ద భక్తితో ఒదిగి ఉండాలని, గర్వంతో వ్యవహరించి భక్తుల మనోభావాలు కించపరచడం మంచిదికాదని అన్నారు. శివజ్యోతి వ్యాఖ్యల దుమారంపై జనసేననేత కిరణ్‌రాయల్ మీడియాతో మాట్లాడారు. భక్తిలేకుంటే తిరుమలకు రావద్దని, భక్తుల ముసుగులో ఉన్న నాస్తికులకు టిటిడి టిక్కెట్లు జారీచేయకుండా ఉండాలన్నారు. సెలబ్రిటీలు ఏ కార్యక్రమం చేపట్టినా ముందుగా దేవుని ప్రార్థిస్తారని, మంచి జరగాలని వేడుకుంటారన్నారు. అను కున్న కార్యం దిగ్విజయమైతే దేవుళ్ళనే హేళన చేసే స్థాయికి కొందరు దిగజారుతున్నారని మండిపడ్డాడు. ఇలాంటి వ్యాఖ్యలు బాధాకరమన్నారు. పిక్నిక్, విహారయాత్రకు వచ్చినట్లు తిరుమలకు రావద్దని, అలాంటి వ్యాఖ్యలు చేయవద్దని అన్నాడు. కాస్ట్లీ బిక్షగాళ్ళం అంటూ యాంకర్ శివజ్యోతి వ్యాఖ్యలు కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని, చాలా పవిత్రమైన శ్రీవారి ప్రసాదం కోటీశ్వరులు, ప్రముఖులు ప్రసా దాన్ని స్వీకరిస్తున్నారని కిరణ్‌రాయల్ గుర్తుచేశారు.

## భగవంతుని ఆశీస్సులందరిపై ఉండాలి



**తిరుమల,నవంబర్ 22ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందరిపై కలగాలని వేడుకున్నట్లు సినీనిర్మాత నందమూరి రామకృష్ణ, పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ ఛైర్మన్‌కూన రవికుమార్ తెలిపారు. శనివారం ఉదయం వేర్వేరుగా ఇద్దరూ ఆలయంలోనికి చేరుకున్నారు. విఐపి బ్రేక్ దర్శన సమయంలో టిటిడి అదనపు ఇఒవెంకయ్యచౌదరి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# 'వార్త' శీనయ్య ప్రస్థానం ముగిసింది



పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి( ఫైల్)

**సూళ్లూరుపేట, నవంబర్ 22 ప్రభాతవార్త** తడ విలేఖరిగా నాలుగు దశాబ్దాల క్రితం తన ప్రస్థానాన్ని ప్రారంభించి వార్తలో సుదీర్ఘకాలం సేవలందించి, ఎన్నో విశ్లేషణాత్మకమైన వార్తలు, ప్రజలకు ఉపయోగపడే మంచి సమాచారాన్ని అందించి సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయిలో 'వార్త' శీనయ్యగా పేరు తెచ్చుకున్న పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డి (56) శుక్రవారం రాత్రి కన్నుమూశారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో ప్రయోగం జరిగినా, అక్కడ ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించినా వాటిని విశ్లేషణాత్మకంగా ప్రజంటేషన్ చేయడంలో శీనయ్య దిట్ట. అలాగే రాజకీయపరమైన వార్తలతో పాటు సమాజంలో ఉండే సమస్యలపై కూడా మంచి వ్యాసాలు అందించేవాడు. అలాగే తనకున్న సినీ మక్కువతో సినిమాలకు సంబంధించి మంచి ఆర్టికల్స్‌ను అందజేసేవారు. ఎప్పుడు వార్తల కోసం పరితపిస్తూ నిరంతరం వార్తా శ్రామికుడిగా పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. గత 8 నెలలుగా తీవ్ర అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటూ వార్తలు అందించేందుకు పరితపించేవారు. అటు రాజకీయ నాయకులతో, అధికారులతో, ప్రజలతో మమేకమై తన పాత్రను సమర్థవంతంగా పోషించిన శీనయ్య ఇక లేరన్న నిజం ఈ ప్రాంత వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు.

**శీనయ్య మృతికి పలువురు సంతాపం :**సూళ్లూరుపేట, తడ ప్రాంతాల్లో విలేఖరిగా పనిచేసి శుక్రవారం రాత్రి మృతిచెందిన పర్వతరెడ్డి శ్రీనివాసులురెడ్డికి పలువురు సంతాపం తెలిపి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోపాల్‌రెడ్డిపాలెంలోని శ్రీనివాసులురెడ్డి స్వగృహానికి వెళ్లి పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, శ్రేయోభిలాషులు నివాళి అర్పించారు. మాజీ ఎంపి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పలువురు రాజకీయ నేతలు శీనయ్య భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు.

# ఇంధన పొదుపు , ఇంధన సామర్థ్యం పై షార్ట్ వీడియో పోటీలు



## - జెన్కో మేనేజింగ్ డైరెక్టర్, ఎపిఎస్ఇసిఎం సిఇఓ ఎస్ నాగలక్ష్మి

**విజయవాడ,నవంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంధన సామర్థ్యం పై ఆంధ్ర ప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఏర్పాటు చేసిన 2025 షార్ట్ వీడియో పోటీలలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించేందుకు ముందుకు రావాలని, పాఠశాలలు విద్యార్థులను ప్రోత్సహించాలని ఏపీజెన్కో మేనేజింగ్ డైరెక్టర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్. నాగలక్ష్మి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పాఠశాలలో 8వ, 9వ, 10వ తరగతి చదివే విద్యార్థులకు తమ సృజనాత్మకతను చూపడంతో పాటు సమాజానికి ప్రయోజనం చేకూర్చే ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాలలో భాగస్వాములు కావడానికి ఈ షార్ట్ వీడియో పోటీ ప్రత్యేకమైన అవకాశమని సిఈఓ పేర్కొన్నారు. విద్యార్థులలో ఇంధన పొదుపు పై అవగాహనను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను సమిష్టిగా ప్రోత్సహించాలని ఆమె పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇంధన సంరక్షణ-సామర్థ్య రంగంలో దిశానిర్దేశం, బలమైన ప్రోత్సాహం అందిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికె. విజయానంద్ ఎస్ఈసిఎం సీఈఓ నాగలక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వారి సహకారం వల్ల సమర్ధ ఇంధన వినియోగం , ప్రజలలో ఇంధన పొదుపు పై అవగాహన, విద్యార్థుల భాగస్వామ్యం వంటి విభాగాలలో రాష్ట్రంలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను అమలు చేయగలుగుతోందన్నారు. ఈ షార్ట్ వీడియో పోటీ కూడా అదే దృష్టితో విద్యార్థుల్లో ఇంధన సంరక్షణపై చైతన్యం పెంపొందించడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు . ఈ ఏడాది డిసెంబర్ 14 నుండి 20 వరకు నిర్వహించనున్న జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా"బ్రైట్ ఐడియాస్, బ్రైటర్ ఫ్యూచర్: ఎనర్జీ ఎఫిషియెన్సీ ఛాలెంజ్ ఫర్ స్కూల్ చిల్డ్రెన్" అనే పేరుతో ఈ పోటీని ఏపీఎస్ఈసిఎం ఏర్పాటుచేస్తుందని, ఇంధన సామర్థ్యం, సంరక్షణ, సస్టైనబిల్ ప్రాక్టీసులు వంటి అంశాలపై విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలు, ఆచరణాత్మక సూచనలను ప్రదర్శించడం ఈ పోటీ యొక్క లక్ష్యమన్నారు. చిన్న వయసులోనే ఇంధన వినియోగంపై సరైన అవగాహన పెంపొందించడం ఎంతో ముఖ్యమని సిఈఓ పేర్కొన్నారు. రోజువారీ జీవనంలో విద్యుత్ ఆదా చేయడం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులు సృజనాత్మకంగా తమ ఆలోచనలు తెలియజేయడానికి ఈ పోటీ ఉపయోగపడుతుందని నాగలక్ష్మి అన్నారు. ఈ పోటీ 8, 9, 10వ తరగతి చదువుతున్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మాత్రమే ఉంటుందన్నారు. అన్ని నామినేషన్లు సంబంధిత పాఠశాలల ద్వారా మాత్రమే పంపించాలని, ఇంధన సంరక్షణ,ఇంధన సామర్థ్యం లేదా సుస్థిర ఆచరణలపై ఆధారపడి, తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో30 సెకన్ల నుంచి 2 నిమిషాల నిడివితో, లీశ4 ఫార్మాట్‌లో ఒరిజినల్ గా చేసిన వీడియోలు మాత్రమే పంపించాలని, గతంలో సమర్పించిన వీడియోలు పరిగణలోకి తీసుకోబడవని సిఈఓ పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ 20,000, ద్వితీయ బహుమతి రూ 10,000, తృతీయ బహుమతి రూ 5,000 అలాగే 2,000 చొప్పున పది మంది పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వబడతాయని తెలిపారు . విజేతలను జాతీయ ఇంధన సంరక్షణ వారోత్సవం-2025 ముగింపు వారోత్సవాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులు అందజేయడంతోపాటు ఆ కార్యక్రమంలో విద్యార్థుల వీడియోలను ప్రదర్శించడంతో పాటు ఏపీఎస్ఈసిఎం సోషల్ మీడియాలో, వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడతాయని, వీడియోలు సమర్పించిన పాఠశాలలకు ప్రశంసాపత్రం అందజేస్తామని ఏపీ జెన్కో ఎండీ, ఎస్ఈసియం సీఈఓ శ్రీమతి నాగలక్ష్మి పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తాము రూపొందించిన వీడియోలు డిసెంబరు 5 వ తేదీ సాయంత్రం 5:00 గంటలలోగా నామినేషన్లను తమ పాఠశాలల ద్వారా కేవలం గూగుల్ ఫారమ్ ద్వారా మాత్రమే అప్లోడ్

# విలువలతో కూడిన విద్య శ్రీసత్యసాయి యూనివర్సిటీ ప్రత్యేకత: మంత్రి నారా లోకేష్



స్నాతకోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న నారా లోకేష్

**పుట్టపర్తి టౌన్, నవంబర్ 22, ప్రభాతవార్త** విలువలతో కూడిన విద్య శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ప్రత్యేకత అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44 స్నాతకోత్సవం లో మంత్రి పాల్గొన్నారు. ప్రశాంతి నిలయం పూర్ణచంద్ర ఆడిటోరియంలో జరిగిన ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తో పాటు గౌరవ అతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ. పుట్టపర్తిని సందర్శించే ప్రతి హృదయంలో సత్యసాయి బాబా ప్రేమ, కరుణ, ఆధ్యాత్మిక శక్తి ప్రకాశిస్తుంది. ఆయన సేవా కార్యక్రమాలు దేశంలోని ప్రతి మారుమూల ప్రాంతాన్ని చేరాయి. దూర ప్రాంతాలకు తాగునీటి సరఫరా కార్యక్రమాలు, వేలాది మందికి వైద్యసేవలు అందించడంతో పాటు లక్షలాది మందికి దైవిక, ప్రేమ, ఆధ్యాత్మిక అనుభూతులు దేశం నలుమూలలా వ్యాపించాయన్నారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ గారు ఈ స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరుకావడం ప్రత్యేక గౌరవంగా ఇస్తున్నామన్నారు. అణకువ, నిజాయతీ, ప్రజాసేవ పట్ల అంకితభావానికి ఆయన ప్రతిరూపం. ప్రజాసేవతో ప్రారంభమైన ఆయన ప్రయాణం ఉప రాష్ట్రపతి స్థాయి వరకు చేరడం ఇక్కడున్న ప్రతి గ్రాడ్యుయేట్ కు ప్రేరణగా నిలుస్తుంది. రాయలసీమ అనేది ధైర్యం, నిరాండబరత, త్యాగానికి ప్రతీక. ఆధ్యాత్మిక కాంతి కలిగిన పవిత్ర భూమి. ఈ నేలలోనే ప్రపంచ ఆధ్యాత్మిక కిరణం భగవాన్ శ్రీ సత్యసాయి బాబా జన్మించారు. బాబా దర్శనం, దృష్టి, కరుణ ఈ విశ్వవిద్యాలయానికే కాదు ప్రపంచానికే మార్గనిర్దేశం. ఈ పవిత్ర మట్టిలోనే ఆధ్యాత్మికత, నిరాడంబరత, త్యాగం నిండి ఉన్నాయి. అలాంటి నేలపై ఉన్న ఈ విశ్వవిద్యాలయం బాబా దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇదో ఆధునిక గురుకులం. ఇవే భారత భవిష్యత్ నాయకులకు కావాల్సిన లక్షణాలు. ఈ నేల నుంచే బాబా ప్రపంచం మెచ్చుకునే విద్యా నమూనాను నిర్మించారు.నేడు భారతదేశం కీలక మార్పు దిశగా ముందడుగు వేస్తోంది. వికసిత్ భారత్ లక్ష్యసాధనకు కేవలం మేధావులనే కాకుండా స్థిరమైన, బలమైన, సేవాభావం కలిగిన వారిని తీర్చిదిద్దే విద్యాసంస్థలు అవసరం.

శ్రీ సత్యసాయి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ అలాంటి సంస్థలలో ముందువరుసలో ఉంది. ఈ పవిత్ర విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులైన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు. ముందుకు సాగండి ధైర్యంతో నడిపించండి, దయతో సేవ చేయండి, బలమైన భారతదేశాన్ని నిర్మించాలని, యువత రాజకీయాల్లో రావాలని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

# జగ్గయ్యపేట మున్సిపల్ చరిత్రలో కొత్త రికార్డు

## - రూ.140 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు - ఘనంగా నాలుగు వసంతాల విజయోత్సవం



**జగ్గయ్యపేట, నవంబర్ 22, ప్రభాతవార్త** :ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మున్సిపాల్టీ చారిత్రాత్మకంగా కొత్త రికార్డును సమోదుచేసినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రకటించారు. శనివారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నాలుగు వసంతాల విజయోత్సవ వేడుక నిర్వహించారు. చైర్మన్ రాఘవేంద్ర కేక్‌కట్‌చేసి కౌన్సిలర్లు, సిబ్బంది, మీడియాకు పంచిపెట్టారు. జగ్గయ్యపేట పట్టణంలో ఏనాడు సాధించని రికార్డును తమ కౌన్సిల్ సొంతం చేసుకున్నదని రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు జరుగటం మున్సిపాల్టీ ఉన్నంతకాలం ఒక చరిత్రంగా నిలిచిపోతుందని చైర్మన రాఘవేంద్ర సంతోషం వ్యక్తంచేశారు. స్థానిక ఎంఎల్ఏ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), విజయవాడ ఎంపి కేశినేనని శివనాథ్ (చిన్ని) సహకారం, పట్టణ ప్రజల విశ్వాసం సమిష్టి కృషితో ఈ అరుదైన, అద్భుత రికార్డు సాధించినట్లు చెప్పారు. శనివారంతో తమ కౌన్సిల్‌కు నాలుగు సంవత్సరాలు పూర్తయ్యిందన్నారు. మిగిలిన కాలంలో కూడా చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులు చేస్తామన్నారు. కౌన్సిలర్లు అందరూ సభలో ప్రసంగించారు. అభివృద్ధి పనులు నిర్వహించుకోవటంపట్ల ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలుపుకున్నామన్నారు. కాగా సమావేశంలో పలు ప్రాంతాల్లో ఇంకా నిర్వర్తించాల్సిన పారిశుద్ధ్య నిర్వహణ పనుల గురించి కౌన్సిలర్లు వివరించి అధికారులు దృష్టిసారించాలని కోరారు. కాగా సమావేశంలో కమిషనర్ కృష్ణారావు, డిఇ ఉలిసి శివకోటేశ్వర రావు, ఏఇ హనుమంతరావు, పట్టణ ఎస్ఐ ఉన్నారు.

# భూములిచ్చిన రైతులకు అన్యాయం జరగదు

## కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి నారాయణ హామీ



రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ భేటీ దృశ్యం

**విజయవాడ,నవంబరు 22,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వంపై నమ్మకంతో అమరావతి రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని కేంద్ర మంత్రి పెమ్మసాని, ఏపీ మున్సిపల్ మినిస్టర్ పి.నారాయణ:రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై సీఆర్డీఏ కీలక సమావేశం నిర్వహించింది. రాజధానిలోని సీఆర్డీఏ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ భేటీ అయ్యింది. ఈ కమిటీలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ ఉన్నారు. సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, ముఖ్య అధికారులతో కమిటీ సమావేశమైంది.

దీనికి రైతు జేఏసీ ప్రతినిధులు హాజరయ్యారు. రైతులు లేవనెత్తిన అంశాలపై పరిష్కారం దిశగా కమిటీ సమాలోచనలు చేసింది. ఏ రైతుకూ ఇబ్బంది లేకుండా చేయడమే లక్ష్యమని మంత్రి నారాయణ అన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని పేర్కొన్నారు. గతంలో జగన్ ప్రభుత్వ తీరు వల్ల రాజధానిలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని పెమ్మసాని అన్నారు. సమస్యలన్నీ పరిష్కరించాలని తమ కమిటీకి సీఎం సూచించారని తెలిపారు. రాజధానిలో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. జరీబు భూముల సమస్యకు 30 రోజుల్లో పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. సీఆర్డీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి జరీబు భూములను గుర్తిస్తారని, గ్రామ కంఠాల సమస్య కూడా పరిష్కరిస్తారని కేంద్రమంత్రి పెమ్మసాని వెల్లడించారు. లంక భూముల సమస్యను జగన్ జఠిలం చేశారని, దీనిపై వైఎస్సార్సీపీ నేతలు కోర్టులో కేసులు వేశారు. అసైన్డ్ భూములను కొందరు అమ్ముకుంటే జగన్ ప్రభుత్వం తప్పుబట్టి ఆపేసింది. మిగతా ప్రాంతాల్లో అసైన్డ్ చట్టానికి, రాజధానిలో అసైన్డ్ భూములకు వ్యత్యాసం ఉందని ఆయన అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మూడు నెలల సమయం పడుతుందని, 90 శాతం రైతులకు ప్లాట్ల కేటాయింపు పూర్తయిందని ఆయన వివరించారు. రాబోయే 15 ఏళ్లలో జనాభా పెరుగుదల అంచనాల ప్రకారం మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. 20 రోజుల్లో డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే జూన్ నాటికి రాజధాని గ్రామాల్లో తాగునీరు, డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. మరో వారం తర్వాత త్రిసభ్య కమిటీ సమావేశమవుతుందని పెమ్మసాని అన్నారు. త్వరితగతిన సీడ్ యాక్సిస్ రోడ్డు పనులు : రాజధాని అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణ పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. రాజధాని ప్రాంతాన్ని 16వ నంబర్ జాతీయ రహదారికి అనుసంధానం చేయడంలో సీడ్ యాక్సిస్ రోడ్డు ఎంతో కీలకమన్నారు. అయితే పెనుమాక, ఉండవల్లిలో భూసమీకరణకు కొంతమంది ముందుకు రాకపోవడంతో రోడ్డు పనులు ఆగిపోయాయన్నారు. రోడ్డు పనుల పూర్తికి ఆటంకంగా ఉన్న ప్రాంతాలను నారాయణ పరిశీలించారు. ఇటీవల కొందరు రైతులు భూ సమీకరణకు అంగీకరించారు. దీంతో అడ్డంకులు కొంత మేర తొలిగాయి. అక్కడ పనులు చేపడుతున్నారు. సీడ్ యాక్సిస్ రోడ్డులో కొండవీటి వాగు, గుంటూరు ఛానెల్, బకింగ్ హాం కెనాల్స్ పై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను మంత్రి పరిశీలించారు. విజయవాడ నుంచి రాజధానికి కరకట్ట మీదుగా వెళ్లే అవసరం లేకుండా త్వరితగతిన సీడ్ యాక్సిస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగు ఎత్తిపోతల వద్ద జరుగుతున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణం వేగవంతం చేయాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. రాజధానిలో ప్రతి రైతుకూ న్యాయం చేస్తామని స్పష్టం చేసారు. రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు వేగంగా జరుగుతున్నాయన్నారు.

# నైపుణ్య శిక్షణ కోర్సు ద్వారా దాదాపు రూ.64వేల వేతనం - ప్రభుత్వం వెల్లడి

విజయవాడ నవంబరు 22,,ప్రభాతవార్తప్రతినిధి: నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి ఉజ్వల భవిష్యత్తు చూపించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. తొలిసారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ), డీడీయూ జీకేవై (దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన) ద్వారా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు.

ఇంటర్, డిగ్రీ, బీటెక్‌లో ఎన్ని మార్కులొచ్చినా ఉద్యోగం రావాలంటే ప్రతి విద్యార్థికి కనీస నైపుణ్యాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రైవేటు సంస్థల్లో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నా ఫీజు చెల్లించలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయి. ఏపీలో రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి (సీడాప్) విభాగం ఆధ్వర్యంలో ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను నేర్పిస్తున్నారు. ప్రొడక్షన్ ఇంజినీర్ మల్టీ స్కిల్ టెక్నీషియన్ వేర్‌హౌస్ సూపర్‌వైజర్ కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ (నాన్ వాయిస్) రెస్టారెంట్ కెప్టెన్ ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్ స్పెషలిస్ట్ ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ అండ్ పెరిఫెరల్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తారు.డొమైన్ కంప్యూటర్ ఇంటర్వ్యూ సాఫ్ట్ స్కిల్స్ స్పోకెన్ ఇంగ్లీష్‌లను నేర్పిస్తారు.,ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో ఒప్పందం చేసుకున్నట్లు ఏపీ ఉపాధి కల్పన వ్యవస్థాపన అభివృద్ధి సంస్థ (సీడాప్) ఛైర్మన్ దీపక్‌రెడ్డి తెలిపారు. యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన తెలిపారు. యువతకు ఉపాధిని కల్పించడమే తమ లక్ష్యంగా దాదాపు 24 సెక్టార్స్ లో శిక్షణ కోసం ఐఎస్ బీతో ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వన్ ఫ్యామిలీవన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదం సాకారం చేసేందుకు ఐఎస్ బీతో కొన్ని కోర్సులకు ఎంవోయూ చేసుకున్నామని అన్నారు. సెంచూరియన్ యూనివర్శిటీతోనూ గతంలో ఒప్పందం చేసుకున్నామనీ, శిక్షణలో 40 శాతం ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ లో రానున్న మూడు సంవత్సరాల్లో దాదాపు 22,000 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సీడాప్ ఒక నోడల్ ఏజెన్సీగా ఉండేలా సీఎం చంద్రబాబు దిశానిర్దేశంలో పని చేస్తుందని ఈ సందర్భంగా ఛైర్మన్ దీపక్‌రెడ్డి వివరించారు. శిక్షణ పొందే యువతీ,యువకులకు ప్రత్యేక వసతి సదుపాయం ఉంది. రెండు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, తదితరాలు అందిస్తారు. వివిధ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. జాతీయస్థాయి స్కిల్ ఇండియా సర్టిఫికెట్ అందిస్తున్నారు. కోర్సులో చేరిన అభ్యర్థులకు అనుభవజ్ఞులైన శిక్షకులు నైపుణ్యాలు నేర్పిస్తారు. శిక్షణలో 90 రోజులు తరగతి గదిలో, 30 రోజులు క్షేత్రస్థాయిలో మెలకువలను నేర్పుతారు. పరిశ్రమల సందర్శనకు సైతం తీసుకెళ్తారు. భవిష్యత్తుపై దిశా నిర్దేశం చేయడంతోపాటు కౌన్సెలింగ్ ఇస్తారు.శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు విశాఖతోపాటు తిరుపతిలోని శ్రీసిటీ, పుణె తదితర నగరాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ఆసక్తిగా కోర్సు ముగించిన అభ్యర్థికి కచ్చితంగా ఉద్యోగం చూపిస్తున్నాం. ఒక్కో విద్యార్థికి కోర్సు ఆధారంగా రూ.36,000 నుంచి రూ.64,000 వరకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుంది. శిక్షణ వ్యవధి కనీసం 90 రోజుల వరకూ ఉంటుంది.

# చంద్రబాబు రాంగ్ ట్రాక్‌లో వెళ్తున్నారు

## - అరటి, టమోటా, వరి పంటలు సాగుచేసిన రైతులు దివాళ తీస్తుంటే చంద్రబాబు మోడీ భజన చేస్తున్నాడు: సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ




**అనంతపురం, నవంబర్ 22 ప్రభాతవార్త బ్యూరో** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాంగ్ రూట్లో వెళ్తున్నారని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. అడవులను కార్పోరేట్ శక్తులకు అప్పగించేందుకు నక్సలైట్లను బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో చంపేస్తున్నారని, అరటి, వరి, టమోటా, తదితర పంటలను సాగు చేసిన రైతులు దివాలా తీస్తుంటే సీఎం చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్రమోదీ భజన చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. శనివారం సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. స్వాతంత్రం తర్వాత వచ్చిన ప్రధాన మంత్రులందరూ కలిసి దేశాన్ని అభివృద్ధి చేయడానికి 55 లక్షల కోట్లు అప్పులు చేస్తే 11 ఏళ్ల కిందట అధికారం చేపట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2వందల లక్షల కోట్లకు అప్పు సమకూర్చాడని మండిపడ్డారు. భారత్ ఎలిగిపోతుందంటూ బిజెపి దాని అనుబంధ సంస్థలు సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు 11 ఏళ్ల మోడీ పాలనంత ఏం సాధించిందో చెప్పుకోలేని దీనావస్థలో ఉన్నారన్నారు. రూపాయి విలువ నానాటికి దిగజారి పోతుంటే దేశ ప్రగతి ఎలా సాధిస్తుందని ప్రశ్నించారు. ధరలు మండిపోతున్న నిరుద్యోగ యువతీ యువకులు దీనావస్థలో ఉన్న రైతులకు కనీస మద్దతు ధర లభించకుండా నష్టాల పాలవుతున్న రైతుల గోడు వింటుంటే బాదేస్తుందుదన్నారు. మైనార్టీలపై రోజు దాడులు జరుగుతున్న ఎన్డీఏ ప్రభుత్వం అవేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుందని ఆందోళన చెందారు. పుట్టపర్తిలో సినీనటి ఐశ్వర్యరాయ్ మానవత్వం అన్ని కులాలు సమానత్వంపై మాట్లాడితే బిజెపి దాని అనుబంధ సంస్థలు ట్రోల్ చేయడం సిగ్గు చేటన్నారు. సినీ దర్శకుడు రాజమౌళిని సైతం సోషల్ మీడియాలో టోల్ చేయడం ఖండించదగిన విషయం అన్నారు. అడవులను కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి నక్సల్స్‌ను హత్యలు చేస్తున్నారని, ఈ కోవలోనే హిడ్మిని చంపేశారని ఆవేదన చెందారు. రామరాజ్యం కాకుండా రావణ రాజ్యంగా మారిపోయిందని ప్రజాతంత్ర వాదులంతా నక్సల్స్‌ను చంపడాన్ని ఖండించాలన్నారు. ప్రజాస్వామ్య ఎన్నికల్లో గెలిచిన ప్రభుత్వాలు చర్చలకు పిలిచి ఎన్కౌంటర్లు చేయడం బాధాకరమన్నారు. రైతులు ఎక్కడ సుభిచితంగా ఉన్నారో చెప్పండి రైతులు ఎక్కడ సుభిక్షంగా ఉన్నారో చెప్పాలని నిలదీశారు. అరటి రైతులు మామిడి, టమోటా, ఉల్లి, వరి ధాన్యం పండించే రైతులు దివాలా తీస్తుంటే చంద్రబాబు నాయుడు మోడీ భజన చేస్తున్నారని మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తూ పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. విశాఖ కార్మికులను పనిచేయడం లేదని చంద్రబాబు మాట్లాడటం బాగాలేదన్నారు. రాంగ్ ట్రాక్‌లో వెళ్తూ పాలన సాగిస్తున్న చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. అనంతపురం కార్పొరేషన్‌లో దోచుకుంటున్న టిడిపి నేతలు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ..అనంతపురం నగర మునిసిపల్ కార్పొరేషన్ అధికార పార్టీ నాయకులకు దోచుకొనేందుకు అడ్డాగా మారిందని, అభివృద్ధి చేయకుండా అధికారులు, అధికార పార్టీ నాయకులు దోచుకుంటున్నారని అనంతపురం ఎమ్మెల్యే మరియు అధికార పార్టీ నాయకులపై జగదీష్ మండిపడ్డారు.

# సీడాప్ ఆధ్వర్యంలో త్వరలో డిడియూజికెవై 2.0 శిక్షణా కార్యక్రమాలు

**విజయవాడ, 23,ప్రభాతవార్తప్రతినిధి:**గ్రామీణ నిరుద్యోగ యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్ష ఆరోగ్యం, ఆటోమొబైల్, లాజిస్టిక్స్, హాస్పటాలిటీ, ఎలక్ట్రానిక్స్ సహా ప్రధాన రంగాల్లో శిక్షణ 3 నెలలపాటు ఉచిత శిక్షణ మరియు హాస్టల్ వసతి, శిక్షణ అనంతరం ఉద్యోగాల కల్పన ప్రాజెక్ట్ ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలతో విస్తృత సమావేశం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్)మరిన్ని చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో గ్రామీణ యువతకు మార్కెట్ డిమాండ్ కు తగినట్టు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడమే సీడాప్ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా సీడాప్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న డీడీయూ జీకేవై 2.0 కార్యక్రమం ద్వారా 15,000 గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

# తెనాలి ట్యాంక్ బండ్‌పై గౌతులచ్చన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

## - బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు వినతి



మంత్రి నాదెండ్ల మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చిత్రం

**గుంటూరు, నవంబర్ 22, ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులురైతు బాంధవుడు అణగారిన వర్గాల ఆశాజ్యోతి, కీ.శే.డా:సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు విగ్రహాన్ని తెనాలి ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని,ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు శనినివారం తెనాలిలోని పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ కార్యాలయంలో పలువురు బీసీ నేతలతో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేసన మీడియాతో మాట్లాడుతూ, ఉద్యమాల నిప్పు కణిక లచ్చన్న 17 ఏండ్ల ప్రాయంలోనే స్వాతంత్రోద్యమంలో దుమికిన యువకిశోరమన్నారు. 1930లో మహాత్మా గాంధీ పిలుపునందుకొని ఉప్పు సత్యాగ్రహాన్ని,1932లో శాసనోల్లంఘన ఉద్యమం తో పాటు, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమాలలోనూ, 1942 క్విట్ ఇండియా ఉద్యమాలలోనూ వారు చురుకుగా పాల్గొన్నారన్నారు. హరిజనవాడల్లో హరినామ సంకీర్తనలు పాడిస్తూ,వారికి ఆలయ ప్రవేశం కల్పించి అంటరానితనం నిర్మూలన చేసి చూపించారన్నారు. జై ఆంధ్ర ఉద్యమం చేపట్టి,పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న రాష్ట్రాల ఏర్పాటు ఆవశ్యకతను ఆనాడే గుర్తించి పోరాడిన యోధుడు వారన్నారు. బడుగుల ఆరాధ్య దైవం గౌతు లచ్చన్న తన గీత కార్మిక వర్గాల ఐక్యతను చాటుతూ గౌడ జాతిబీసీ బిడ్డల అభివృద్ధి కోసం వారు ఎనలేని సేవలు అందించారన్నారు. బడుగుల ఆరాధ్య దైవమైన డా.సర్దార్ గౌతు లచ్చన్న నిలువెత్తు విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని ప్రభుత్వ వర్గాలకు శంకరరావు విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ అధ్యక్షులు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు కుర్రా శ్రీను, తుళ్లూరు శ్రీనివాసరావు,కేసన స్వాములు,సిహెచ్. సురేష్, పి.అయ్యప్ప,బి.సురేష్,సిహెచ్. పసి,మన్యం సాయి పలువురు బీసీ నాయకులు.

# బులియన్ మర్చంట్ శ్రీరాం సుబ్బారావు-సూర్యకాంతం దంపతులకు స్టార్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు ప్రదానం




స్టార్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు స్వీకరిస్తున్న జగ్గయ్యపేట బులియన్ వ్యాపారి శ్రీరాం సుబ్బారావు-సూర్యాకాంతం దంపతులు.

**జగ్గయ్యపేట, నవంబర్ 22, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు-సూర్యాకాంతం (సునీత) దంపతులు స్టార్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు సాధించారు. 75 సంవత్సరాలకు పైబడి బంగారపు ఆభరణాల వ్యాపారం కొనసాగిస్తున్న శ్రీరాం విశ్వనాథం సన్స్ శ్రీరాం సుబ్బారావు జ్యూయలరీ షోరూమ్ అధినేత సుబ్బారావు-సునీత దంపతులను ఏపి జెన్ అండ్ జ్యూవెలరీ ఫెయిర్, ఏపి బులియన్ మర్చంట్ అసోసియేషన్ సంయుక్తంగా శుక్రవారం రాత్రి విజయవాడ నోవాటెల్ హోటల్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన సభలో ఈ ప్రత్యేక పురస్కారం ప్రధానంచేశారు. రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కపిలవాయి విజయ్‌కుమార్, చీఫ్ ఆర్గనైజర్ శాంతిలాల్‌జైన్, యునైటెడ్ ఎగ్జిబిషన్ ఆర్గనైజర్ సాయి చైతన్య, జిల్లా బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లేశ్వరరావు, స్థానిక షరాబు వర్తక సంఘ ప్రధాన కార్యదర్శి కొంకిమళ్ళ మల్లిఖార్జునరావు సుబ్బారావు దంపతులను ఘనంగా సత్కరించారు. శ్రీరాం సుబ్బారావు తాత శ్రీరాం రాజగోపాల్, తండ్రి విశ్వనాథం, మూడో తరంలో సుబ్బారావు బంగారం వ్యాపారంలో నాణ్యత మన్నికలతో ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక గుర్తింపు పొందివున్నారు. ఈసందర్భంగా స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు తాడేపల్లి సోమేశ్వరరావు, ప్రతినిధులు తుమ్మేపల్లి నరేంద్రరావు ఉన్నారు.

# కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం



**విజయవాడ,నవంబరు22, ప్రభాతవార్త ప్రతినిధి:** కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవల్లో నిర్లక్ష్యంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చూపిన వైద్యులు, సిబ్బందిపై చర్యలకు ఆదేశించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత వైద్య సిబ్బందిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సూచించారు. కాకినాడ జీజీహెచ్‌లో మృతి చెందిన గర్భిణి కుటుంబానికి సాయం అందించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు తెలిపారు. కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో జరిగిన ఘటనలో, తాళ్లరేవు మండలం గడిమొగ గ్రామానికి చెందిన 8 నెలల గర్భిణీ మల్లేశ్వరి వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోయారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో 55 ఏళ్ల రోగికి అక్టోబర్ 2025 తేదీన గడువు ముగిసిన మందులను నవంబర్ 8న అక్కడ ఆసుపత్రి వర్గాలు ఇచ్చాయి. వాటిని వాడిన రోగి మరింత అనారోగ్యం పాలయ్యారు. ఈ రెండు ఘటనలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 8 నెలల గర్భిణి మల్లేశ్వరికి కొన్ని మెడిసిన్స్ పడవని, అలెర్జీ ఉందని, వీటితోపాటు హైపర్ టెన్షన్, డయాబెటిస్ కూడా ఉన్నాయని కేస్ షీట్ లో నమోదు చేసి ఉన్నట్లు తెలుస్తుంది. వాటిని పరిగణలోకి తీసుకోకుండా కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నవంబర్ 20న మధ్యాహ్నం పీజీ విద్యార్థిని గర్భిణికి అలెర్జీ ఉన్న ఇంజెక్షన్లను ఇచ్చారు. దీనివల్ల పేషెంట్‌కు వెంటనే ఫిట్స్, అనంతరం కార్డియాక్ అరెస్ట్ అయ్యింది. ఈ క్రమంలో ఆమె రాత్రి 10 గంటల సమయంలో మరణించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణ లోపం కూడా దీనికి కారణమని తేలింది. ఇదిలా ఉండగా రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో 55 ఏళ్ల రోగికి అక్కడి వైద్య సిబ్బంది అక్టోబర్ 2025 నాటికి గడువు ముగిసిన మందులు నవంబర్ 8న ఇచ్చారు. వాటిని వాడిన రోగి మరింత అనారోగ్యం పాలయ్యారు. ఈ రెండు సంఘటనలు వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని పలువురు ధ్వజమెత్తుతున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంబంధిత వైద్య సిబ్బందిపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

# ఛాయ్ రాస్తా అవుట్ లెట్ ప్రారంభించిన నారా భువనేశ్వరి



**కుప్పం, నవంబరు 22: ప్రభాతవార్త:** ఒక కుటుంబానికి ఒక వ్యాపారవేత్తను తయారుచేయాలనే సంకల్పంలో భాగంగా కుప్పంలో డ్వాక్రా మహిళలచే ఏర్పాటుచేసిన ఛాయ్ రాస్తా అవుట్లెట్లను ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరి ప్రారంభించారు. రుచి, శుచి, నాణ్యత ప్రధానంగా కార్పొరేట్ తరహాలో ఏర్పాటైన ఛాయ్ రాస్తా అవుట్ లెట్లో ఆమె మొదటి ఛాయ్ని కొనుగోలు చేశారు.. ఛాయ్ రాస్తా అవుట్లెట్లో రుచి, శుచి చక్కగా ఉన్నాయని ఆమె ప్రశంసించారు. ఐఐఎం, ఐఐటి గ్రాడ్యుయేట్ల భాగస్వామ్యంతో రూపొందించిన చాయ్ రాస్తా చాలా సరికొత్తగా ఉందని ఆమె అభినందించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని దీనిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని భువనేశ్వరి అన్నారు. కుప్పం డెవలప్మెంట్ ఆథారిటీ (కడా) మద్దతుతో ముందుగా కుప్పంలో ఈ ఛాయ్ రాస్తా అవుట్ లెట్ ప్రారంభం కావడం శుభపరిణామం అన్నారు. డ్వాక్రా మహిళలకు ప్రతి నెల స్థిరమైన ఉపాధితో పాటు వారికి గౌరవాన్ని కల్పించేలా ఛాయ్ రాస్తా అవుట్ లెట్లు పనిచేయన్నాయి. మెప్మా భాగస్వామ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో ఛాయ్ రాస్తా అవుట్లెట్లు ప్రారంభం కానున్నాయి. డ్వాక్రా మహిళలకు స్థిరమైన ఆదాయం, గౌరవం ఛాయ్ రాస్తా అవుట్ లెట్లతో లభిస్తుందని ఛాయ్ రాస్తా సీఈఓ మైథిలీ జోషి తెలిపారు.. మహిళలు ఎంతో సులువుగా ఛాయ్ రాస్తా అవుట్ లెట్ నిర్వహించవచ్చని, ఆధునాతన టెక్నాలజీతో ఈ ఛాయ్ రాస్తా అవుట్ లెట్లు ఉంటాయన్నారు.



# ముగిసిన రాష్ట్రపతి ముర్ము ఒకరోజు పర్యటన

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 22, ప్రభాతవార్త:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ ఒకరోజు పర్యటన ముగించింది. శనివారం బేగంపేట విమానాశ్రయం నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక విమానంలో బయలుదేరి పుట్టపర్తికి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, కలెక్టర్ హరిచందన దాసరి, డీజీపీ శివధర్‌రెడ్డి, నగర పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ ఉన్నతాధికారులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నగర పోలీసుల ఆధ్వర్యంలో బేగంపేట విమానాశ్రయంతోపాటు రాష్ట్రపతి ప్రయాణించిన మార్గంలో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

# 27తో ముగియనున్న జెఇఇ మెయిన్-2026 దరఖాస్తుల ప్రక్రియ

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఇంజ నీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జాతీయ స్థాయిలో నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) (మెయిన్) పరీక్ష మొదటి విడత పరీక్షలకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 27తో ముగియనుంది. అక్టోబరు 31 నుంచి ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ 27తో ముగియనుంది. వచ్చే ఏడాది జనవరి 21 నుంచి 30 వరకు మొదటి విడత పరీక్షలను నిర్వహించనున్నారు. జనవరి మొదటి వారంలో పరీక్షలను నిర్వహించే నగరాలను ప్రకటించనున్నారు. అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్ ప్రక్రియను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారోనే దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన తరువాత ప్రకటించనున్నారు. ప్రతి ఏడాది రెండు విడతలుగా జెఈఈ మెయిన్ పరీక్షలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా జెఈఈ మెయిన్- 2026 మొదటి సెషన్ పరీక్షలను వచ్చే ఏడాది జనవరి 21 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో జెఈఈ మెయిన్–2026ను రెండు సెషన్లలో (జనవరి, ఏప్రిల్ 2026) నిర్వహించ నుంది. ఇందుకు సంబంధించిన సెషన్–1 కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తు న్నారు. రెండో సెషన్‌కి సంబంధించిన పరీక్షలను ఏప్రిల్ 1 నుంచి 10 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను జనవరి చివరి వారం నుండి ఆన్‌లైన్‌లో స్వీకరించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించింది. విద్యార్థులు దరఖాస్తుల్లో ఆధార్‌లోపేరు, మెమో ఆధారంగా ఉన్న పేర్లను నమోదు చేసుకునే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని ఎన్‌టీఏ అధికారులుసూచించారు. మొదటి విడత జెఈఈ మెయిన్ పరీక్షల ఫలితాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న విడుదల చేయనున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. జెఈఈ మెయిన్ పరీక్షలను మొత్తం 13 భాషల్లో నిర్వహించనున్న సంగతి తెలిసిందే.



గీత కార్మికుల సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# గీత కార్మికులకు 45 లక్షల తాటి, ఈత మొక్కల పంపిణీకి ప్రభుత్వం సిద్ధం

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 45 లక్షల తాటి, ఈత మొక్కలను పంపిణి చేసేందుకు సిద్దంగా ఉందని, వాటి పెంపకానికి కల్లుగీత సంఘాలు ముందుకు రావాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటేందుకు వాటిని పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. గీత పనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం అంటే తనకు ఎంతో గౌరవమని ప్రభుత్వంతో చర్చించి మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్‌కు ధర్మభిక్షం పేరు పెట్టె విధంగా కృషి చేస్తానని మంత్రి తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన గీతపనివారల సంఘం రాష్ట్ర సదస్సులో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్‌గౌడ్ అధ్యక్షత వహించారు. గీత కార్మికుల రక్షణతోపాటు తమ పిల్లల విద్యాభ్యాసానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమ పిల్లలు నెగ్గెందుకు విద్య చాలా అవసరమని, తల్లిదండ్రులు కష్టపడి తమ పిల్లలను చదివించుకోవాలని సూచించారు. గీతకార్మికులకు ఎక్స్‌గ్రేషియా, కాటమయ్య రక్ష, సంఘపరమైన భవనాలకు సంబంధించి అన్ని గౌడ కులపెద్దలతో కలిసి అమలు జరిగేలా చేద్దామన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి తాను సిఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ట్యాంక్‌బండ్‌పైన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటును త్వరలో ప్రవేశపెడుతున్నామని చెప్పారు. ఈ సభలో మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సంఘం ప్రధాన కార్యదర్శి డి.జి. సాయిలుగౌడ్, కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షుడు కెవిఎల్, దూసరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# జనాభాకు అనుగుణంగా పశు సంరక్షణ, పెంపకం పెరగాలి

## చేపలు, గొర్రెలు, మేకలు, పశు సంరక్షణకు కృషి

## ఘనంగా పశువైద్య విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి

**హైదరాబాద్ (అత్తాపూర్) నవంబరు 22, ప్రభాతవార్త:** తక్కువ ధరకు దొరికే గుడ్లలో పోషకాలు చాలా ఉన్నాయని ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని పశుసంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య, రవాణా శాఖ కార్యదర్శి డా. ఇలంబర్తి పేర్కొన్నారు. శనివారం పివి ఎన్ఆర్ తెలంగాణ పశువైద్య విశ్వవిద్యా లయం 11వ విశ్వ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా ఇలంబర్తి హాజరై హార్టికల్చర్ వీసీ అంజి రెడ్డి, పశువైద్య విశ్వవిద్యా లయ వీసీ జ్ఞాన ప్రకాష్ లతో కలిసి జ్యోతి వెలి గించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐసి ఎఆర్ షెడ్యూల్డ్ కుల ఉప ప్రణాళిక నిధుల కింద మంజూరు చేసిన ఇ రిసోర్సెస్ (పుస్తకాలు, జర్నల్స్)ను ఆయన ప్రారంభించారు. వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్ నందు అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా ఆయన సందర్శించి పాడి రైతులు, పెంపుడు జంతువుల యజ మానులకు అందించే ఉత్తమ క్లినికల్ సేవలను ప్రశంసించారు. ప్రజారోగ్యం పరంగా ఈ రంగం ప్రాముఖ్యతను రాష్ట్ర జీఎస్డిపికి ఈ రంగం సహకారాన్ని పునరుద్ఘాటించారు. పాలు, గుడ్డు, మాంసం ఉత్పత్తుల ద్వారా తక్కువ ధరకు పౌష్టికాహారం అందించడం గురించి నొక్కి చెప్పారు. రాష్ట్ర జనాభా పెరిగిన కొద్దీ పశువు సంరక్షణ, పశువు పెంపకం పెంచాలని ఆయన కోరారు. అనంతరం మరో అతిథి కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రాజీరెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో పరిమితుల మధ్య పివిఎన్ఆర్‌టీవి సాధించిన పురోగతి గురించి ప్రశంసించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎం జ్ఞానప్రకాష్ విశ్వవిద్యాలయ పరిధిలోని సంస్థల పురోగతి గురించి వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. శరత్ చంద్ర, ప్రో.డి. మాధురి, అసోసియేట్ డీన్, విస్తరణ విభాగం అధిపతి డా సత్యనారాయణ, బోధన, బోధనేతర అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇలంబర్తి, హార్టికల్చర్ విసి అంజిరెడ్డి, విపి జ్ఞానప్రకాష్

## అజెండా పక్కనబెట్టి ఇరిగేషన్ ఇంజినీర్లకు

# మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్లాస్!

## ప్రాజెక్టుల అంచనా వ్యయాలు పెంచడంతో పక్కన పెడుతున్న సిఎం

**హైదరబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** 'ఇష్టం వచ్చినట్లు ప్రాజెక్టు అంచనాల వ్యయాలు పెంచుతున్నారు దీనితో ముఖ్యమంత్రి మన ఫైల్స్ పక్కన పెడుతున్నారు' అంటూ నీటిపారుదలశాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులపై శనివారం తీవ్రఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. జలసౌధలో జరి గిన సమావేశం ఎజెండాను పక్కనపెట్టి మంత్రి అధికారులకు ఫుల్‌గా క్లాస్ తీసుకొనట్లు తెలిసింది. కొత్త ప్రాజెక్టుల ప్రతిపాదనలు రూపొందించడంలో జాప్యం చేయడం, నిర్మాణంలో ఉన్న పనులలో జాప్యం జరగం వంటి అంశాలపై ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తంచేసిట్లు తెలిసింది. నీటిపారుదలశాఖ ఇంజనీర్లు రూపొందిస్తున్న అరకొర సమాచారంతో వస్తున్న ప్రతిపాదనలు సిఎం ఆఫీసు నుంచి వెనక్కిరావడమో లేదా వాటిని అక్కడే పక్కనపెట్టడమో జరుగుతున్నట్లు తెలిసింది. తుమ్మడిహట్టి నుంచి సుందిళ్ళ విఫల బ్యారేజికి నీళ్ళు తరలించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సుముఖత వ్యక్తం చేయడంలేదని అధికారులు చర్చించుకొంటున్నారు. ఇంటర్‌స్టేట్ వాటర్ రీసోర్సు యూనిట్, సిడివో డిపార్టుమెంట్ అధికారులు సరిగా పనిచేయకపోవడంతో అనేక సమస్యలు అలాగే పెండింగ్‌లో ఉంటున్నాయి. 18 అంశాల ఎంజెండా చర్చకు రాకుండానే మొత్తానికి సమావేశం ముగించారని అధికారులు చర్చించుకొంటున్నారు. ఆర్థికశాఖ అనుమతితోనే ప్రాజెక్టు వ్యయాలు పెంచుతామని ఇలాంటి సందర్భంలో సిఎం కూడా ఫైల్స్ పక్కన పెట్టడం ఏంటని కొంత మంది అధికారులు నొచ్చుకొన్నట్లు తెలిసంది. సమ్మక్కసాగర్ చత్తీస్గడ్ ఎన్‌వోసి అంశం, టిఎసి, సిడబ్ల్యుసి అంశాలతోపాటు మేడిగడ్డ,అన్నారం, సుందిళ్ళ బ్యారేజిలను ను ఎన్‌డిఎస్‌ఎ సూచనలమేరు మర్మమతు చేయడానికి సంబందించిన కార్యచరణ జలసౌధలో కీలకమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉండాల్సి ఉండగా అవి కూడా పక్కన పడ్డట్లు తెలిసింది. తుమ్మడిహట్టి నుంచి సుందిళ్ళకు నీటి తరలింపు అంశం, ఎఎంఆర్‌పి ఉదయసముద్రం, గట్టుప్రాజెక్టు, సింగూరు ప్రాజెక్టు మరమ్మతు, మిషన్‌కాకతీయ,డిండి, జూరాల ప్రత్యామ్నయ బ్రిడ్జి,పదోన్నతలు, 2023 డిసెంబరు 7నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులపై ఖర్చుచేసి అంశాలపై చర్చ జరగకుండా కేవలం అధికారులు ఇష్టం వచ్చినట్ల ప్రాజెక్టు కాస్ట్‌బూస్టప్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమావేశం ముగిసిందని తెలిసింది.



ట్రోఫీతో మాడవి కావేరి

# అండర్-19 గోల్డ్‌క్వీన్ మాడవి కావేరి

**పెంచికల్‌పేట్, నవంబరు 22, ప్రభాతవార్త :** ఒడిశా నేలపై జరిగిన అండర్-19 జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలంలోని గుండెపల్లి గిరిజన గ్రామానికి చెందిన విద్యార్థి మాడవి కావేరి అద్భుత ప్రతిభతో బంగారు పతకం సాధించింది. మారుమూల గిరిజన గ్రామా నికి చెందిన మాడవి వనితరాంజీల కుమార్తె అయినా కావేరి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కలశాల ఉట్నూర్‌లో ఇంటర్ ప్రథమ సంవ త్సరం చదువుతున్నది. కావేరి జాతీయ వేదికపై బంగారు పతకం సాధించడంతో గ్రామంలో ఆనందో త్సాహాలు వెల్లివిరిశాయి. క్రమశిక్షణ, కష్టపడే తత్త్వం, ఓటమిని ఒర్చుకునే ధైర్యంతో ప్రతి బౌట్‌లో ప్రత్యర్థులను వశం చేసు కుంటూ అత్యు త్తమంగా పోరాడి బంగారు పతకాన్ని సాధించిన కావేరిని గ్రామస్థులు, పలువురు అభినందించారు.

# హైదరాబాద్‌లో పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. ఈ నెల 25 నుండి మూడు రోజుల పాటు హైటెక్స్‌లో నిర్వహించనున్నారు. వికసిత్ భారత్ దిశగా స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్‌కు బాటలు వేసేలా వన్ నేషన్-వన్ ఎక్స్‌పో అనే థీమ్‌తో 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను నిర్వహిస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో 50 దేశాల నుండి 500 మందికి పైగా ఎగ్జిబిటర్స్, 40 వేలకుపైగా సందర్శకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అలాగే వివిధ దేశాలకు చెందిన 1,500 మంది ప్రతినిధులు, నిపుణులు హాజరవుతారు. ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ అధ్వర్యంలో సస్టైయిన బుల్ ఫీడ్ సెల్యూషన్స్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, ఆటోమేషన్, భవిష్యత్ ఉద్యోగవకాశాలు తదితర ప్రధాన అంశాలపై ఈ అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌లో చర్చ జరగనుంది.



# తెలంగాణ వైద్య విధానపరిషత్‌ను పూర్తిస్థాయి ప్రభుత్వ శాఖగా మార్చాలి

## ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లోని ఖాళీ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలి

## మంత్రి దామోదర రాజనర్సింహకు టిజిజిడిఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** తెలంగాణ వైద్య విధాన పరిషత్తు(టివివిపి)ను పూర్తిస్థాయి ప్రభుత్వ శాఖగా మార్చాలని తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజిజిడిఎ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దాంతోపాటు వైద్య శాఖలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు విజ్ఞప్తి చేసింది. డిఎంఇ, డిహెచ్, టివివిపి విభాగాల్లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అసోసియేషన్ నేతలు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పలుమార్లు హామీ ఇచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టివివిపిని పూర్తిస్థాయి ప్రభుత్వ శాఖగా మార్పు చేయాలని కోరారు. టివివిపిని డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా మార్చుతామని ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ.. ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. దీని మూలంగా టివివిపి వైద్యుల పరిపాలన, సేవా నియమాలు, పదోన్నతులు, ప్రమోషన్లపై నేరుగా ప్రభావం చూపుతోందని అసోసియేషన్ నేతలు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని కోరారు. వైద్యవిద్యా నాణ్యతను నిలబెట్టడానికి ఇది అత్యంత కీలకంగా మారుతుందన్నారు. ఫెరీఫెరల్ మెడికల్ కాలేజ్ అలవెన్స్ మంజూరును ప్రభుత్వం ఆమోదించినప్పటికీ ఇంకా విడుదల కాలేదని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిమూలంగా కొత్త మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిజిజిడిఎ నేతలు తెలిపారు.

జిఒఎంఎస్ నంబర్ 142ను సవరణ చేయాలన్నారు. జిఒ మూలంగా డిఎంహెచ్ఒ పోస్టులను జనరల్ లైన్ డాక్టర్లకు కేటాయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా, సవరణ నోటిఫికేషన్ ఇంకా వెలువడలేదన్నారు. వెంటనే సవరణ చేస్తూ జీవో జారీ చేయాలని మంత్రిని కోరారు. డిహెచ్, డెంటల్ కేర్ వైద్యుల కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్(సీఏఎస్) అమలు విషయంలో ప్రభుత్వం అంగీకరించినప్పటికీ, కార్యరూపం దాల్చలేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో టిజిజిడిఎ అధ్యక్షుడు డాక్టర్ నరహరి బాపనపల్లి, సెక్రటరీ జనరల్ డాక్టర్ లాలూప్రసాద్ రాథోడ్, ట్రెజరర్ డాక్టర్ ఎం.కే. రౌఫ్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దీన్ దయాల్, సీఈసీ మెంబర్ డాక్టర్ రాజశేఖర్ ఉన్నారు.

# ప్రమాదకర లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త:** కార్మికులకు ప్రమాదకరంగా మారనున్న నూతన లేబర్‌కోడ్‌లను ఉపసంహరించుకోవాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రమాదకరమైన లేబర్‌కోడ్లను ఉపసం హరించు కోవాలని కార్మికులు దేశ వ్యాపితంగా సమ్మెలు చేస్తున్నా, కార్మిక సంఘా లతో ఎలాంటి చర్చలు లేకుండానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో ఏకపక్షంగా ప్రకటించి శనివారం నుండి అమలుకు పూనుకున్నదని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసే, ప్రమాదకరమైన కార్మిక చట్టాలను తక్షణమే ఉపసం హరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలతో కార్మికులు తమ రక్షణ కోసం సాధించు కున్న 29 పాత చట్టాలకు కేంద్రం ప్రభుత్వం తెచ్చిన లేబర్‌కోడ్స్ తిలోదకాలు ఇస్తున్నాయన్నారు. కార్మికుల వేతనాలు, పని గంటలు, సామాజిక భద్రత వంటి హక్కులను కాల రాస్తు న్నాయని మండిపడ్డారు. కొత్త చట్టాలతో కార్మికులు సమ్మె చేసే హక్కును కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్‌లకు అనుకూలంగాను, కార్మికుల హక్కులకు తీవ్రనష్టం కల్గించే నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు చేయనున్నట్టు జాన్‌వెస్లీ స్పష్టం చేశారు.




రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్

# కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులను తక్షణమే క్రమబద్ధీరించాలి

## ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగా అధ్యాపకులను క్రమబద్ధీకరించిన తరువాతే విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయా లని ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. గత రెండు దశాబ్దాలు కా ంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులుగా పనిచేస్తున్నారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం విశ్వ విద్యాలయాలను నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు. విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ అధ్యాపకుల జెఎసి ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం కేవలం 7 శాతం నిధులు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించిందని, 15 శాతం కేటాయించవలసి ఉందన్నారు. అధ్యాపకుల క్రమబద్ధీకరణ కోసం విశ్వవిద్యాలయాల్లోని వైస్ ఛాన్సలర్స్ ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు దీనస్థితిలో ఉన్నాయని, పూర్తి స్థాయిలో అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలపై ఉన్నత విద్యా శాఖ మండలి, విద్యా కమిషన్ దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్యానాయక్ మాట్లాడుతూ అధ్యాపకుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ జన సభ అధ్యక్షుడు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, రాష్ట్ర గ్రంథాలయాల ఛైర్మన్ రియాజ్, జెఎసి కన్వీనర్ డా.పరుశురామ్, కో-కన్వీనర్లు డా.ఓర్సు కృష్ణయ్య, పాండయ్య, రాందాస్‌నాయక్, డా.కవిత తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే జిఒ నం. 46ను ఉపసంహరించుకోవాలి

## లేదంటే పెద్దఎత్తున బిసిల ఆందోళన తప్పదు

## ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 22, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జిఒ నంబరు 46ను విడుదలచేసి ఎస్సీ, ఎస్టీ, బిసిలకు కలిపి 50శాతం లోపు రిజర్వేషన్‌లు కొనసాగిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి మార్గదర్శకాలను విడుదల చేయడం బిసిలకు చేసిన పచ్చిదగా అని రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య ధ్వజ మెత్తారు. తక్షణమే జిఒ నంబరు 46ను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రెండు రోజుల్లో అన్ని సంఘాలతో సమావేశమై పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని ఆయన హెచ్చరించారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్‌లపై ఒకవైపు హైకోర్టులో వాద నలు కొనసాగించడానికి గడువు ఉన్నప్పటికీ ఆ దిశగా నిబద్ధతతో చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ముందుగానే చేతులు ఎత్తివేసి జిఒను విడుదల చేసిందని ఆయన ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని గత రెండేళ్లు గా ప్రభుత్వం ప్రకటిస్తూనే బిసిలను మోసం చేస్తూ బిసిలను మభ్యపెట్టిందని విమర్శించారు. ఈ నెల 20న డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిందంటూ, ఆ నివేదిక ఆధారంగా జిఒ నంబరు 46ను విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధానమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళితే పరిష్కారం అయ్యేదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదని, ఇప్పటికైనా ఎన్నికలను వాయిదా వేసి కోర్టులో జడ్జిమెంట్ వచ్చేంతవరకు అగాలని, ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల నుంచి తిరుగుబాటు తప్పదని ఆర్.కృష్ణయ్య హెచ్చ రించారు.

# ఫ్లేవర్‌ఫుల్ కబాబ్స్

చికెన్ రెసిపీలు ఫ్లేవర్‌ఫుల్ కబాబ్స్
క క కబాబ్ బాగుందీ.. అని పాడుకోవాలి, ఇలా కానీ ట్రై చేశారంటే సరిగ్గా వండాలే కానీ కబాబ్ టేస్ట్ ఎవరికి నచ్చదు చెప్పండి? అందుకే ఈ ఫ్లేవర్‌ఫుల్ కబాబ్స్‌ను మీరూ చేసి చూడడండి.

## తంగ్డీ చికెన్ కబాబ్.

**కావాల్సినవి:** చికెన్ లెగ్ పీసులు 6, గరంమసాలా చెంచా, మైదాపిండి- చెంచా, కార్న్‌ఫ్లోర్-2 కారం 2, ఉప్పు, నూనె-సరిపడా. నిమ్మరసం, మిరియల పొడి - చెంచా



పచ్చిమిర్చి పేస్ట్-2 చెంచాలు, గుడ్లు-2, పసుపు- పావుచెంచా, అల్లంవెల్లుల్లి ముద్ద -2 చెంచాలు.

**తయారీ:** చికెన్ లెగ్ పీసులని శుభ్రంగా కడిగి చిన్నగా గాట్లు పెట్టుకోవాలి. తర్వాత ఒక పానరతలో గుల్లను పగలకొట్టి కలిపి పక్కన పెట్టాలి. మరో పానరతలో నిమ్మరసం, ఉప్పు, మసాలా, కార్న్‌ఫ్లోర్, మైదా, పచ్చిమర్చి ముద్ద, అల్లం వెలుల్లి పేస్ట్, పసుపు, ఉప్పు, కారం, మిరియాల పొడి, పక్కకు పెట్టిన గుడ్ల మిశ్రమాన్ని వేసి బాగా కలిపి లెగ్ పీసులను కూడా మేసి మొత్తం కలిసేలా పట్టించి 10 నిమిషాలు పక్కకు పెట్టాలి. ఒక కడాయిలో నూనె పోసి వేడయ్యాక ఒక్కక్కటిగా లెగ్ పీసులను వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చుకోవాలి. తే తంగి చికెన్ కబాబ్ రెడీ.

## వెజ్ షమీ కబాబ్ ..



**కావాల్సినవి :** ఉల్లిపాయలు-2 (చిన్నవి), శనగలు కప్పు, పచినచమర్చి-3, కొత్తిమీర, పుదీనా, కరివేపాకు- పావుకప్పు, ఉప్పు, కారం, నూనె,సరిపడా, ధనియాలపొడి- చెంచా, గరంమసాలా-చెంచా, పసుపు-చిటికెడు, శనగపిండి-2 చెంచాలు, బియ్యంపిండి- చెంచా.

**తయారీ :** శనగలను ముందురోజు రాత్రి నానబెట్టాలి. నీళ్లు వడకట్టి కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చేవరకు ఉడకనిచ్చి తీశాక కచ్చా పచ్చాగా మిక్సీ పట్టాలి. ఒక పాత్రలో శనగల మిశ్రమం, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, శనగపిండి, బియ్యంపిండి, ఉప్పు, కారం, కొత్తిమీర,పుదీనా, మసాలా, ధనియాల పొడి.. అన్నీ వేసి కొద్దిగా నీళ్లు పోసి కబాబ్స్ చేయడానికి వీలుగా కలపాలి. చిన్న చిన్న గారెలుగా రౌండ్‌గా చేసుకొని పక్కకు పెట్టాలి. ఒక కడాయిలో నూనె పోసి కబాబ్స్‌ని రెండు వైపులా బంగారురంగు వచ్చేవరకు కాల్చుకోవాలి.

1. నల్ల శనగలు అయితే ఇంకాసనత రుచిగా ఉంటుంది.
2. ఈ కబాబ్స్‌ని టమాటా, పుదీనా చట్నీతో తింటే కాంబినేషన్ అదిరిపోతుంది.

**చెఫ్ టెక్నిక్ ..** మాంసం వండేటప్పుడు నీరు మరిగే దశ్కఉ వచ్చాక మంట తగ్గిస్తాం కదా.. ఇలా చేయడం వల్ల అందులోని ఫ్యాట్, ప్రొటీన్లు విడుదలై కూరకు చక్కని రుచి వస్తుంది. దీన్ని సిమ్మరింగ్ అంటారు. ఈ టెక్నిక్ సూప్స్, గ్రేవీలు, దుంప జాతి కూరగాయలు, కొన్ని రకాల ధాన్యాలు వండటంలో మెరుగ్గా పనికొస్తుంది. □

# ఆమెకు సేవే ఆనంద మార్గం ..



**ఇరవైల్లో ఉన్న యువత ఎవరికైనా సరదా, సంతోషాలే ప్రపంచం. కానీ, తమిళనాడుకి 22 ఏళ్ల షాలిని మాత్రం తనకు సేవే ఆనంద మార్గం అంటూ మరికొంతమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.**

అప్పటికి షాలిని వయసు పందొమ్మిదేళ్లు. తండ్రితో కలిసి ఓ పనిమీద కారులో బరులుదేరారు.. గమ్యం చేరకుండానే ఓ పెద్ద ప్రమాదం. తీవ్రగాయాల పాలైన తండ్రి ప్రాణాలను కాపాడమని... ఆమె చుట్టూ ఉన్నవారిని అర్థించారట. ఏ ఒక్కరూ స్పందించలేదు సరికదా! మానవత్వం మరిచి ఫొటోలూ, వీడియోలు తీశారు. ఆ సంఘటననూ షాలిని పై చెరగని ముద్రవేసింవి. దాంతో నాన్న చనిపోయిన బాధనే కాదు. ఆది మరిచిపోలేకపోయారు. ఆపై ఒంటరితనం ఆమెకు ఎన్నో పాఠాలనూ నేర్పింది. దాంతో తనలా కుటుంబ సభ్యుల్ని కోల్పోయిన ఆడపిల్లలకు అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు షాలిని. ప్రమాదం జరిగే నాటికి తను ఓ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆ సమయంలోనే సామాజిక మాధ్యమాల ద్వారా బ్రాండింగ్ చేయడం, ఆదాయం పొందడం చూశారట. ఇక, వాటిని తాను ప్రజోపయోగం కోసం ఉపయోగించాలనుకున్నారు.

**చదువుల సాయం...**

సోషల్‌మీడియా హడావుడి లేనప్పుడే షాలిని అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో సేవలందించేవారు. వారాంతాల్లో వారితో గడిపి వచ్చేవారు. తండ్రి మరణం తర్వాత అలాంటి వారిపై మరింత సానుభూతి పెరిగిందామెకు అలాంటివారికి చేయూత అందించేందుకు 'ది రాబర్ట్స్ ట్రస్ట్'ని ఏర్పాటు చేశారు. కష్టాల్లో కుటుంబాలు, యువతుల కథలను ఇన్‌స్టావేదికగా పంచుకోవడం మొదులుపెట్టారు. ఈ పోస్టులకు పెద్ద ఎత్తున ఆదరణ లభించడమే కాక వారి జీవితాలు



బాగుపడేందుకు అవసరమైన సాయమూ దాతల నుంచి అందుతోంది. సేవ చేయాలంటే డబ్బు కావాలనికుం టారు. చాలమంది. కానీ కాస్త సమయం కేటాయించి.. ఓదార్పునిచ్చినా చాలు. అలా నేను కలిసిన వారిలో ఓ అమ్మాయి తనకి కేవలం పాఠ్య పుస్తకాలు ఇస్తే చాలంది. ఇంకో యువతి నా అనుకునే ఓదార్పు కావాలనుకుంది. ఇవన్నీ పెద్ద సమస్యలేం కాదు. కానీ, వాటిని తీర్చడం ద్వారా వాళ్లల్లో ఆత్మవశ్వాసాన్ని నింపొచ్చు. ఎమోషనల్ హీలింగ్ చేయొచ్చు అని చెబుతారామె. ప్రస్తుతం షాలిని ఆధ్వర్యంలో నడిచే ఈ సంస్థ తమిళనాడులో 100 మంది అమ్మాయిల చదువులకు సాయం చేస్తు న్నారు. మహిళలు, దివ్యాంగులు చిన్న చిన్న వ్యాపారాలను ప్రారంభించడంలో చేయూతగా ఉంటున్నారు. అన్నట్లు చెప్పనేలేదు కదూ.. టెడెక్స్ స్పీకర్ కూడా అయిన షాలినీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకి రెండు లక్షల మందికిపైగా ఫాలోవర్లూ ఉన్నారు. □

# ప్రభువు ప్రేమను చాటుదాం..



'అందుకు పేతురును యోహానును వారిని చూచి-దేవుని మాట వినుటకంటె మీ మాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? మీరే చెప్పుడి, మేము కన్నవాటిని విన్నవాటిని చెప్పక యుండలేమని వారికి ఉత్తరమిచ్చిరి' (అపొస్తలు 4: 19,20). నిజమే దేవుడి ప్రేమను రుచిచూసిన వారు ఎవరైనా ఇతరులకు ఆయన ప్రేమను గురించి చెప్పకుండా ఉండలేరు. కానీ యేసుక్రీస్తు శిష్యులైన పేతురు, యోహానులకు ఉన్న ధైర్యం గొప్పది. వారు యూదుల అధికారులను, రాజ్యాధినేతల్ని కూడా లెక్కచేయకుండా సువార్తను ప్రకటించారు. వీరి సువార్త వల్ల వేలాదిమంది ప్రజలు రక్షించబడ్డారు. యోరుషలేంలో గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రజలు తండోపతండాలుగా ప్రభువు శిష్యులను వెంబడిస్తూ, యేసుక్రీస్తుని సేవించేవారు. దీన్ని ఆ పాలకులు అడ్డుకునేందుకు పేతురు, యోహానులకు యేసుక్రీస్తు గురించి బోధించవద్దని ఆజ్ఞాపించారు. అయినా వారు ప్రభువు చేసిన కార్యాల యాను చెప్పకుండా ఉండలేమని ఖరా ఖండిగా చెప్పారు. చివరికి సువార్త నిమిత్తం హతసాక్షిగా మారారు. నిజమే యేసుక్రీస్తు ప్రేమను మనం అనుభవిస్తే ఇతరులకు చెప్పకుండా ఉండలేం. హింసలకు సైతం వెనుదీయరు. ఇలాంటి ప్రేమ, త్యాగం మనకు ఉందా? ఇప్పటికైనా ఆయన ప్రేమను చాటుదాం.

-పి.వాణిపుష్ప

అంతర్వాణి

# చిమ్నీలు వాడుతున్నారా?

చిమ్నీలు వాడుతున్నారా? వంటగదిలో జిడ్డు పేరుకుపోవడమే కాదు.. ఘాటైన వాసనలూ ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. అలాకాకుండా ఉండటానికి ఈ మధ్య అందరూ చిమ్నీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో వాల్‌మౌంటెడ్, ఇన్‌బిల్ట్, టెలిస్కోపిక్, డక్టెడ్, డక్ట్‌లెస్.. ఇలా ఎన్నో రకాలు దొరుకుతున్నాయి. వేలకు వేలు పోసి కొనడమే కాదు.. దాన్ని ఎలా వాడాలో, శుభ్రం చేయాలో కూడా తెలుసుండాలి. అప్పుడే అది ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా చిమ్నీ ఫిల్టర్స్‌నీ, గ్రీజ్ ట్రాప్‌లనూ ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. వేణ్నీళ్లు, వంటసోడాతో రుద్ది కడిగితే జిడ్డు త్వరగా వదలడమే కాదు మన్నికగానూ ఉంటుంది. ఇక, డక్టెడ్ చిమ్నీల్లో ఏమైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలి. బయటకి తెరుచుకున్న వాటిల్లో ఏవీ దూరకుండా చూసుకోవాలి. కార్బన్ ఫిల్టర్స్ వాడితే వాటిని నిర్ణీత కాలంలో మార్చాలి. అంతేకాదు, బాగా మరిగిన నీళ్లల్లో కాసనత వినెగర్, వంటసోడా కలిపి అందులో చిమ్నీప్లేట్స్ నానబెట్టాలి. తర్వాత ఓ పాత టూత్ బ్రష్‌తో శుభం చేస్తే సరి. □

# మెరిసే జుట్టు కోసం



నిగనిగలాడే నల్లటి వాలు కురులకు ఇష్టం ఉండదు చెప్పండి. అయితే ఈ రోజుల్లో ఆహారపు అలవాట్లతోప మారుతోన్న జీవనశైలి ప్రభావం కురరఊఱ పడుతోంది. వీటికి తోడు స్టైలింగ్ కోసం ఉపయోగిం ఉత్పత్తులు కేశాలను నిర్జీవంగా మార్చేస్తున్నాయి. దీనికి పరిష్కారంగా ఇంట్లోనే సులరం చేసుకునే ఈహెయిర్ప్యాక్ను ప్తఊన చూడండి అంటున్నారు నిపుణులు. కావాల్సినవి: .. కోడిగుడ్డు సొన .. తేనె ఒక చెంచా .. ఆలివ్ ఆయిల్ ఒక చెంచా .. ఆముదం నూనె ఒక చెంచా .. ఆర్గన్ ఆయిల్ ఒక చెంచా

తయారీ : ముందు కోడిగుడ్డు సొన ఒక పాత్రలో వేసుకుని బాగాకలపాలి. తర్వాత తేనె, ఆలివ్ ఆయిల్, ఆముదం నూనె, ఆర్గన్ ఆయిల్ కూడా వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకి పట్టించి అరగంట పాటు ఆరనివ్వాలి. తర్వాత మంచి షాంపూ, కండిషనర్‌తో జుట్టు శుభ్రపరుచుకుంటే సరి.. నిగనిగలాడే కురులు సొంతమవుతాయి అంటున్నారు నిపుణులు. చేయడం. □

# ఆఫర్లతో జాగ్రత్త

పండగల వేళ ఎక్కడ చూడూ ఆఫర్ల జాతరే! దుకాణాలే కాదు ఆన్‌లైన్ వేదికలూ తగ్గింపు ధరలతో ఆకర్షిం చేస్తాయి. దీంతో ఆఫర్లూ సరేసరి. తగ్గింపు ధర అని బోర్డా పడట్లేదు కదా? ... గుండుపిన్నుకీ ఆన్‌లైన్ వేదికలపరనే రోజులివి. 'ఫలానా సంస్థ ప్రారంభించి వందో ఏడా సందర్భంగా... ప్రముఖ నగల సంస్థ ఆఫర్... లక్కీ విన్నర్... చెప్పుకొంటూ వెళ్లాలేకానీ వాట్సాప్, ఈమెయిల్స్‌లో



వచ్చే లింకులకు కొదవే ఉండదు. అయినవాళ్లు పంపారనో... ప్రముఖ సంస్థ నుంచి వచ్చింది కదా అనో లింకు తెరిచామో మోసపోయే ఆస్కారమే ఎక్కువ. 'నిజమేనేమో' అని నమ్మేంతలా వాటిని తీర్చిదిద్దుతున్నారు. కాబట్టి, తెరిచేముందు వచ్చిన తీర్చిదిద్దుతున్నారు. కాబట్టి, తెరిచేముందు వచ్చిన లింకులో 'హెచ్‌టిటిపిఎస్' ఉందో లేదో చూసుకోండి. చేతులను రుద్ది కడిగితే యాంటీసెప్టిక్ పనిచేసి మంటను తగ్గిస్తాయి. □

# అఖండ 2: తాండవం అద్భుతం



అఖండ 2: తాండవం ఖచ్చితంగా అందరినీ అలరిస్తుంది: కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను పవర్ ఫుల్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ డివైన్ యాక్షన్ ఎక్స్‌ట్రావగాంజా 'అఖండ 2: తాండవం' రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్ థమన్ సంగీతం అందించారు. టీజర్ సాంగ్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. ఈరోజు మేకర్స్ కర్నాటకలో జరిగిన భారీ ఈవెంట్ లో ట్రైలర్ లాంచ్ చేశారు. కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరైన ట్రైలర్ ని లాంచ్ చేశారు. డైరెక్టర్ బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. ఇది శివతత్వంతో ఉన్న అద్భుతమైన సినిమా. శివన్న చేతుల మీదగా ఈ ట్రైలర్ ని లాంచ్ చేయడం మేము చాలా గర్వంగా ఫీల్ అవుతున్నాం. ఆది పినిశెట్టి మాట్లాడుతూ.. ట్రైలర్ ని లాంచ్ చేసి మమ్మల్ని ఆశీర్వదించిన శివన్న గారికి థాంక్యూ. హీరోయిన్ సంయుక్త మాట్లాడుతూ... అందరికి నమస్కారం. ఈ ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను. బోయపాటి సినిమాలో చేయడం నా అదృష్టం. బాలయ్య గారితో కలిసి పనిచేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

# 28న థియేటర్‌లోకి జనతాబార్'

నవంబరు 28న థియేటర్‌లోకి రానున్న 'జనతాబార్' ప్రముఖ కథానాయిక రాయ్ లక్ష్మీ ప్రధాన పాత్రలో రూపొందుతోన్న లేడి ఓరియెంటెడ్ చిత్రం 'జనతాబార్' రోచి మూవీస్ పతాకంపై రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో అశ్వర్థ నారాయణ సమర్పణలో నిర్మాణం జరుపుకుంటోన్న ఈ చిత్రం నిర్మాణానంతర పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ నెల 28న చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక, నిర్మాత రమణ మొగలి మాట్లాడుతూ స్పోర్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకున్నమహిళలపై ఆ స్పోర్ట్స్ విభాగంలో ఉన్న ఉన్నతాధికారులు తమ అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేస్తున్న సెక్సువల్ హరాస్‌మెంట్‌కు చరమగీతం పాడటానికి పోరాడిన ఓ మహిళ కథ ఇది. ఈ చిత్రంలో రాయ్‌లక్ష్మీ పాత్ర ఎంతో పవర్‌ఫుల్‌గా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో పాటు సమాజానికి మంచి సందేశంతో పాటు మహిళల్లో చైతన్యం నింపే సినిమా ఇది. బాలీవుడ్ నటుడు శక్తికపూర్ ఈ చిత్రంలో ఎంతో శక్తివంతమైన పాత్రను పోషించాడు. తప్పకుండా ఈ చిత్రం కమర్షియల్‌గా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు. అమన్ ప్రీతిసింగ్, దీక్షపంత్, శక్తికపూర్, అనూప్‌సోని, ప్రదీప్‌రావత్,



సురేష్ భూపాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: రాంబాబు గోసాల, కళ్యాణ్ చక్రవర్తి, శ్రీనివాస్‌తేజ, ఫోటోగ్రఫీ: చిట్టిబాబు,సంగీతం: వినోద్ యజమాన్య, రచయిత: రాజేంద్ర భరద్వాజ్.

తెర

# 'మోహన రాగ' మ్యూజిక్ లేబుల్

రాకింగ్ స్టార్ మంచు మనోజ్ తన కొత్త మ్యూజిక్ లేబుల్ "మోహన రాగ" ప్రారంభించారు. లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్ అనే క్యాప్షన్ తో మన సంగీతాన్ని వరల్డ్ వైడ్ రీచ్ చేసేందుకు మోహన రాగ మ్యూజిక్ లేబుల్ తో తనదైన ప్రయత్నం చేయబోతున్నారు మంచు మనోజ్. ఈ రోజు సోషల్ మీడియా ద్వారా మంచు మనోజ్ ఈ ప్రకటన చేశారు. సంగీతం మీద తనకున్న ప్రేమే మోహన రాగ మ్యూజిక్ లేబుల్ స్థాపించేలా స్ఫూర్తినిచ్చిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఫ్రెష్ సౌండ్స్, బోల్డ్ టాలెంట్, ఫియర్ లెస్ క్రియేటివిటీ తమ మ్యూజిక్ లేబుల్ ద్వారా సంగీత ప్రపంచానికి పరిచయం చేస్తామని మంచు మనోజ్ తెలిపారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ ను అభినందిస్తూ సోషల్ మీడియాలో ఆయన అభిమానులు, నెటిజన్స్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# 'పాంచ్ మినార్' మిస్ అవ్వొద్దు



'పాంచ్ మినార్' చూసిన ఆడియన్స్ అద్భుతంగా ఎంజాయ్ చేస్తున్నారు. సినిమాని థియేటర్స్‌లో మిస్ అవ్వొద్దు. ఫ్యామిలీ, ఫ్రెండ్స్ కలసి ఎంజాయ్ చేసే సినిమా ఇది: సక్సెస్ మీట్‌లో హీరో రాజ్ తరుణ్‌యంగ్ ట్యాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరో ఫన్ టాస్టిక్ బ్లాక్ బస్టర్ 'పాంచ్ మినార్' రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్‌లో రాశి సింగ్ హీరోయిన్ గా నటించింది. గోవింద రాజు ప్రజెంట్ చేసిన ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ లిలిశి బ్యానర్ పై మాధవి, MSM రెడ్డి నిర్మించారు. నవంబర్ 21న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు.సక్సెస్ మీట్ లో హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ.. ఈ సినిమాకి మీడియా వారు ఇస్తున్న సపోర్ట్‌కి థాంక్యూ. శ్రీనివాస్ రెడ్డి గారికి నేను ఫ్యాన్ బాయ్. ఆయనతో కలిసి పనిచేసిన అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన వెంకీ సినిమాకి ఇప్పటికీ ఒకేలా ఉన్నారు.

# లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'ప్రేమంటే'

'ప్రేమంటే' కి సూపర్ హిట్ రెస్పాన్స్



ఇచ్చిన ప్రేక్షకులకు థాంక్యూ వెరీ మచ్. ఈ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ ని మీరందరూ తప్పకుండా థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను: ప్రెస్ మీట్‌లో హీరో ప్రియదర్శి ప్రియదర్శి లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ప్రేమంటే. ఆనంది హీరోయిన్ గా నటించింది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేశారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నరంగ్ నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మించిన చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రజెంట్ చేసింది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ గారికి ట్రిబ్యుట్‌గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాత. నవంబర్ 21న విడుదలైన ఈ సినిమా అద్భుతమైన రెస్పాన్స్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రెస్ మీట్ లో హీరో ప్రియదర్శి మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇంత మంచి సూపర్ హిట్ సినిమా ఇచ్చినందుకు ప్రేక్షకులకు థాంక్యూ వెరీ మచ్. డైరెక్టర్ నవనీత్ శ్రీరామ్ మాట్లాడుతూ.. సినిమాకి ఆడియన్స్ ఇచ్చిన రెస్పాన్స్ అదిరిపోయింది. ప్రతి చోట ఎంజాయ్ చేస్తున్నారు. ఆనంది మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. సినిమా థియేటర్లో అద్భుతమైన పాజిటివ్ వైబ్ ఉంది. సినిమా అయిన తర్వాత అందరూ క్లాప్స్ కొట్టారు. అందరూ కూడా చిరునవ్వుతో బయటకు వస్తున్నారు.ప్రొడ్యూసర్ జాన్వి నారంగ్ మాట్లాడుతూ. అందరికి నమస్కారం. ప్రేక్షకులం దరూ కూడా సినిమాని చాలా ఎంజాయ్ చేస్తూ నవ్వుకుంటూ వెళ్లారు. ఎంతో ప్రేమని ఇచ్చారు. అందరూ కూడా సూపర్ మూవీ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ అని కాంప్లిమెంట్స్ ఇస్తున్నారు.

# 'త్రీ రోజెస్' సీజన్ 2 టీజర్ రిలీజ్

"త్రీ రోజెస్" సీజన్ 1 ను మించిన ఎంటర్ టైన్ మెంట్ "త్రీ రోజెస్" సీజన్ 2లో చూస్తారు టీజర్ లాంఛ్ ఈవెంట్ లో ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్..ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ "త్రీ రోజెస్". ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్ గా వ్యవహారిస్తు న్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా..కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన ఈవెంట్ లో "త్రీ రోజెస్" సీజన్ 2 టీజర్ రిలీజ్ చేశారు. ఆహా కమర్షియల్ హెడ్ రాజేశ్ వాసిరెడ్డి మాట్లాడుతూ "త్రీ రోజెస్" ఫస్ట్ సీజన్ ఎన్నో రికార్డ్స్ క్రియేట్ చేసింది. ఫస్ట్ సీజన్ సక్సెస్ అయినప్పటి నుంచి సెకండ్ సీజన్ పై డిమాండ్ ఏర్పడింది. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ "త్రీ రోజెస్" కాన్సెప్ట్ తో ఎన్ని సిరీస్ లు అయినా చేయొచ్చు. అలాంటి యూనిక్ కాన్సెప్ట్ మారుతి గారు ఇచ్చారు. ఆయన రాజా సాబ్ సాంగ్ రిలీజ్ పనుల్లో ఉండి రాలేకపోయారు.



### మహిళల కబడ్డీ వరల్డ్ కప్..
# సెమీ ఫైనల్స్‌కు భారత్
### బంగ్లాదేశ్‌పై 16-51తో గెలుపు



**న్యూఢిల్లీ:** మహిళల కబడ్డీ ప్రపంచ కప్ సెమీఫైనల్లోకి ప్రవేశించడానికి భారత్ 4/4 విజయాలతో లీగ్ దశను పూర్తి చేసింది. మహిళల కబడ్డీ ప్రపంచ కప్‌లో భారత్ తమ చివరి గ్రూప్ ఎ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 51-16 తేడాతో ఓడించి లీగ్‌దశ రికార్డుతో సెమీఫైనల్‌కు చేరుకుంది. తద్వారా వారి అజేయ విజయాన్ని నాలుగుకు పెంచుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్స్ భారత్ అన్ని మ్యాచ్‌లలో పూర్తి నియంత్రణను కొనసాగించింది. దీంతో ఈ నెల 23న ఢాకాలోని షహీద్ సుహ్రావర్ది ఇండోర్ స్టేడియంలో తమ సెమీఫైనల్ ఆడతారు. జర్మనీపై 63-22 తేడాతో విజయం సాధించిన తర్వాత భారత్ ఇప్పటికే అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో థాయిలాండ్ (65-20), ఉగాండా (72-15)పై మునుపటి విజయాలు సహా ఆధిపత్యాన్ని సంపాదించింది. ఆతిథ్య బంగ్లాదేశ్‌పై భారత్ తాజా విజయం టోర్నమెంట్‌లో అత్యంత స్థిరమైన, క్లినికల్ జట్టుగా స్థానాన్ని బలోపేతం చేసింది. ఈ ఫలితంతో, భారత్ 12 పాయింట్లు మరియు పోటీలో అత్యధిక పాయింట్ల తేడాతో గ్రూప్ దశను ముగించింది. బంగ్లాదేశ్, థాయిలాండ్, ఉగాండా, జర్మనీలను అధిగమించి పూల్ ఎ లో అగ్రస్థానంలో నిలిచారు. ఇదే జోరుతో 2012లో తొలిసారి గెలిచిన కిరీటాన్ని తిరిగి కాపాడుకోవడానికి ఒక అడుగు దగ్గరగా వెళ్లాలనే లక్ష్యంతో భారత్ జట్టు ఇప్పుడు నాకౌట్ దశకు సిద్ధమవుతోంది.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు లక్ష్య



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియన్ ఓపెన్ 2025 బ్యాడ్మింటన్ టోర్నీలో చౌ టియన్ చెన్‌ను ఓడించి లక్ష్య సేన్ ఫైనల్‌కు చేరుకున్నాడు. సిడ్నీలో శనివారం జరిగిన ఈ ఓపెన్ సూపర్ 500 పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో భారత షట్లర్ లక్ష్య, చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్ చెన్‌పై మూడు గేమ్‌ల విజయంతో దూసుకెళ్లాడు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత అయిన లక్ష్య ప్రారంభ ఆటలో ఎదురైన ఎదురుదెబ్బ నుండి కోలుకుని అద్భుత ప్రదర్శనతో 86 నిమిషాల సెమీఫైనల్లో రెండవ సీడ్‌ను 17-21, 24-22, 21-16 తేడాతో ఓడించాడు. ఈ ఏడాది ప్రారంభంలో హాంకాంగ్ ఓపెన్ ఫైనల్‌కు చేరుకున్న 24 ఏళ్ల ఈ యువకుడు ఈ సీజన్‌లో ఇంకా టైటిల్ గెలవలేదు. ఈ నెల 23న జరిగే సమ్మిట్ పోరులో జపాన్‌కు చెందిన యుషి తనకా లేదా చైనీస్ తైపీకి చెందిన ఐదవ సీడ్ లిన్ చున్‌యితో తలపడనున్నాడు. లక్ష్య స్థిరమైన ఆట ఆట మధ్యలో విరామంలో అతనికి 11-6 ఆధిక్యాన్ని సంపాదించిపెట్టింది. తదుపరి 19-15 వద్ద ఇద్దరూ 44షాట్ల ర్యాలీని ఆడారు. లక్ష్య తన డిఫెన్సివ్ గ్రిట్‌ను అసాధారణమైన సేవ్‌లతో ప్రదర్శించి పాయింట్‌ను స్మాష్‌తో ముగించాడు. చెన్ చేసిన సర్వీస్ లోపం లక్ష్యను 17-9కి చేర్చడంతో పాటు, ఎనిమిది మ్యాచ్ పాయింట్లను సంపాదించిపెట్టింది. చెన్ నాలుగు సేవ్ చేసాడు కానీ చివరికి షటిల్‌ను గోల్ గా మార్చాడు, లక్ష్య అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాడు.



### ఇండియన్ ఓపెన్ టైటిల్..
# ఫైనల్స్‌లో అనహాత్, జోష్నా ఢీ

**న్యూఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ 2025, ఆల్ ఇండియా ఫైనల్స్‌లో భారత్ స్క్వాష్ దిగ్గజాలు జోష్నా చినప్పతో అనాహత్ సింగ్ తలపడనున్నారు. అనహాత్, జోష్నా ఫైనల్‌కు చేరుకోవడంతో ఇండియన్ ఓపెన్-2025లో మహిళల టైటిల్‌ను భారత్ ఖాయం చేసుకుంది. పిఎస్ఎ కాంస్య ఈవెంట్ ఇప్పుడు దేశంలోని వర్ధమాన స్టార్, అత్యంత అనుభవజ్ఞురాల మధ్య పోరో జరగనుంది. టోర్నమెంట్‌లో టాప్ సీడ్ అనహాత్ తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. జర్మనీకి చెందిన కాటెరినా టైకోవాపై క్వార్టర్ ఫైనల్ విజయాన్ని సాధించి సెమీఫైనల్స్‌లో మరో అద్భుతమైన ప్రదర్శనతో టైటిల్ రౌండ్‌కు చేరుకుంది. 16 ఏళ్ల ఈ అమ్మాయి ఈ వారమంతా అద్భుతమైన ఫామ్‌లో ఉంది, ప్రత్యర్థులను అధిగమించడానికి, ఆమె మ్యాచ్‌లలో కనీస పాయింట్లను కోల్పోవడానికి తన వేగం మరియు ఖచ్చితత్వాన్ని ఉపయోగించింది. డ్రాకు వ్యతిరేక దిశలో, అనుభవజ్ఞురాలు జోష్నా చిన్నప్ప ఫైనల్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకోవడానికి మరో క్లినికల్ ప్రదర్శన ఇచ్చింది. మాజీ ప్రపంచ టాప్10 క్రీడాకారిణి, గతంలో క్వార్టర్ ఫైనల్స్‌లో స్పెయిన్‌కు చెందిన సోఫియా మాటియోస్‌ను ఓడించింది. ఆమె కెరీర్‌లో చివరిలో మరొక పిఎస్ఎ టైటిల్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నందున సెమీఫైనల్ విజయం పట్టుదల, స్థిరత్వంతో సాధించింది. ఇక పురుషుల ఈవెంట్‌లో, భారత్‌కు చెందిన రమిత్ టాండన్ క్వార్టర్ ఫైనల్స్‌లో టాప్ సీడ్ యూసఫ్ సోలిమాన్‌ను ఐదు గేమ్‌లకు ఓడించి సెమీఫైనల్ బెర్తును తృటిలో కోల్పోయాడు. చివరికి సోలిమాన్ 11-5, 9-11, 3-11, 11-3, 11-5 తేడాతో విజయం సాధించి తన టైటిల్ బిడ్‌ను సజీవంగా ఉంచుకున్నాడు. మహిళల ఫైనల్ ఇప్పుడు అఖిల భారత పోటీగా నిర్ధారించబడినందున, ఇండోర్‌లో అందరి దృష్టి ఈ నెల 23న జరిగే పోరుపైకి మళ్లింది.

# సౌతాఫ్రికా వన్డేకు రోహిత్, కోహ్లీ రీ ఎంట్రీ
### శుభ్‌మన్, పాండ్యా ఔట్.. శ్రేయస్ డౌట్



**న్యూఢిల్లీ:** సౌతాఫ్రికాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే టీమిండియా మూడు వన్డేల సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ నెల 26న గౌహతిలో రెండో టెస్ట్ ముగియనుండగా, కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే అంటే ఈ నెల 30న రాంచీ వేదికగా తొలి వన్డే జరగనుంది. ఈ సిరీస్ కోసం బీసీసీఐ త్వరలోనే భారత జట్టును ప్రకటించనుంది. ఈ సిరీస్ ద్వారా టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి వన్డే జట్టులోకి అడుగుపెట్టనున్నారు. ఆసియా కప్ సందర్భంగా గాయపడిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌కు దూరంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. గాయం నుంచి కోలుకున్నప్పటికీ, నేరుగా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడకుండా, సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరపున ఆడి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోనున్నాడు. అలాగే ప్రస్తుతం మెడ నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకునే మరొకరికి కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించేందుకు సిద్ధమైంది. ఈ అవకాశం మాజీ కెప్టెన్ రోహిత్ శర్మకు అప్పగించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఇక వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా గాయంతో దూరమవడంతో రుతురాజ్ గైక్వాడ్‌కు జట్టులో చోటు దక్కవచ్చు. మరోపక్క రాబోయే టీ20 సిరీస్‌లను దృష్టిలో ఉంచుకుని జస్‌ప్రీత్ బుమ్రాకు ఈ వన్డేల నుంచి విశ్రాంతినివ్వనున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియాలో పేసర్లుగా సిరాజ్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ రేసులో ఉండగా, స్పిన్నర్లుగా కుల్దీప్, వరుణ్ చక్రవర్తి కొనసాగే అవకాశం ఉంది. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్, బ్యాకప్‌గా రిషభ్ పంత్ ఎంపికయ్యే ఛాన్స్ ఉంది.

అంచనా జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), రిషభ్ పంత్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి ఉన్నారు.

# రెండో టెస్టు తొలి రోజు భారత్‌పై ఆధిక్యంలో దక్షిణాఫ్రికా





**న్యూఢిల్లీ:** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు ఆటలో దక్షిణాఫ్రికా పై చేయి సాధించింది. మొదటి రోజు ఆటముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు నష్టానికి 247 పరుగులు చేసింఇ. ప్రస్తుతం క్రీజులో ముత్తుస్వావి (25), వెర్రిన్ (1) ఉన్నారు. శనివారం టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ప్రొటీస్ జట్టుకు ఓపెనర్లు మార్క్రమ్ (38), రికెల్టన్ (35) శుభారంభాన్ని అందించారు. బ్యాటర్లకు అనుకూలంగా ఉండే విధంగా పిచ్ తయారు చేయడంతో తొలి వికెట్‌ను సాధించేందుకు టీమిండియా బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. జస్ప్రిత్ బుమ్రా అద్భుతమైన బంతితో మార్క్రమ్‌ను ఔట్ చేయడంతో భారత్‌కు తొలి వికెట్ లభించింది. అనంతరం ట్రిస్టన్ స్టబ్స్ (49), కెప్టెన్ టెంబా బవుమా (41) నిలకడగా ఆడి ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే రెండో సెషన్‌లో మాత్రం భారత్ బౌలర్లు పుంజుకున్నారు. ముఖ్యంగా స్పిన్నర్లు కీలక వికెట్లు పడగొట్టారు. రికెల్టన్, స్టబ్స్, ముల్డర్‌లను కుల్దీప్ యాదవ్ పెవిలియన్‌కు పంపగా, బవుమాను జడ్డూ బోలాత కొట్టించాడు. భారత్ బౌలర్లలో ఇప్పటి వరకూ కుల్దీప్ మూడు వికెట్లు పడగొట్టగా, బుమ్రా, సిరాజ్, జడేజా తలో వికెట్ దక్కించుకున్నారు.



### యాషెస్ సిరీస్:
# ఆస్ట్రేలియా చేతిలో ఇంగ్లండ్ చిత్తు

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్ 2025-26ను ఆస్ట్రేలియా ఘనంగా ఆరంభించింది. పెర్త్ వేదికగా శనివారం జరిగిన తొలి టెస్టులో 8 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఆసిస్ చిత్తు చేసింది. 205 పరుగుల లక్ష్యాన్ని కంగారులు కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేధించారు. లక్ష్య చేదనలో టీ20 తరహాలో బ్యాటింగ్ చేసిన ఆసిస్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ కేవలం 69 బంతుల్లో తన సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఓవరాల్‌గా 83 బంతులు ఎదుర్కొన్న హెడ్ 16 ఫోర్లు, 4 సిక్స్‌లతో 123 పరుగులు చేశాడు. అతడితో పాటు మార్నస్ లబుషేన్ (51) అజేయ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. కాగా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ ఇంగ్లండ్ బ్యాటర్లు తీవ్ర నిరాశపరిచారు. ఆసిస్ స్పీడ్ స్టార్ మిచెల్ స్టార్క్ (7) వికెట్లు ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 172 పరుగులకే కుప్పకూలిన స్టోక్స్ సేన, రెండో ఇన్నింగ్స్‌లో కూడా అదే తీరును కనబరిచింది. బోలాండ్, స్టార్క్, డాకెట్‌లు నిప్పులు చెలరేగడంతో ఇంగ్లండ్ 164 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో లభించిన ఆధిక్యాన్ని జోడించి ఆసిస్ ముందు 205 పరుగుల లక్ష్యాన్ని ఇంగ్లండ్ ఉంచింది. అయితే తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌లో విఫలమైన ఆసిస్ రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చి ఘన విజయాన్ని అందుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసిస్ కేవలం 132 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 205 పరుగులు చేసి ఇంగ్లండ్‌ను ఓడించింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.